అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 16-3-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 25 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

తెలంగాణ పునర్నిర్మాణం



ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం.

తెలంగాణ పునర్నిర్మాణం

మహాలక్ష్మి
- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- 26.45 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు

ప్రజా పాలన
- ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి
- ధర్నాచౌక్ పునరుద్ధరణ
- పూలే ప్రజా భవన్ లోకి అందరికి ప్రవేశం
- గ్యారంటీల లబ్ధికి నిరంతర దరఖాస్తుల స్వీకరణ
- అర్హులైన వారందరికి తెల్ల రేషన్ కార్డుల జారీకి నిర్ణయం
- ఆర్థిక, విద్యుత్, సాగునీటి రంగాలపై అసెంబ్లీలో శ్వేతపత్రం

మహిళా శక్తి
- మహిళా సంఘాలకు 5 ఏండ్లలో రూ.లక్ష కోట్లు
- ప్రతి ఏటా 5000 గ్రామసంఘాలకు రూ.5000 కోట్లు
- మహిళలకు వడ్డీ లేని రుణాలు
- మహిళా సంఘం సభ్యురాలికి రూ.10 లక్షల ప్రమాద బీమా
- మహిళా సంఘాలకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పనులు
- మహిళలకు రుణ బీమా పథకం

శిక్షణ మరియు ఉపాధి
- నియోజకవర్గానికో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణం
- జీనోమ్ వ్యాలీ ఫేజ్-2
- 65 ఐటీఐలలో స్కిల్ సెంటర్లు
- 3 జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు

విద్యారంగం
- ప్రతి ఊరిలో ప్రభుత్వ బడి
- స్టేట్ ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల కోసం ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లు
- ప్రభుత్వ స్థలాల్లో ఆదర్శ పాఠశాలలు
- టీచర్ల భర్తీకి నోటిఫికేషన్లు
- వైద్య, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలల నిర్మాణం

పట్టణాభివృద్ధి
- మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధి
- మెహదీపట్నంలో స్కై వాక్ ఏర్పాటు
- హెచ్ఎండిఏ స్థలాల పరిరక్షణ
- లేఔట్ల క్రమబద్ధీకరణ

మైనారిటీ సంక్షేమం
- మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు.
- ఉర్దూ అకాడమీ ఏర్పాటు

చేయూత
- రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్యం


ఉద్యోగ నియామకాలు
- టీఎస్‌పీఎస్సీకి నూతన కమీషన్ ఏర్పాటు
- 28 వేలకు పైగా నియామకాల భర్తీ
- 563 పోస్టులతో గ్రూప్-1
- 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ
- 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు
- మహిళలకు 33 శాతం సమాంతర రిజర్వేషన్లు

పరిశ్రమలు - పెట్టుబడులు
- సీఎం దావోస్ పర్యటనతో రూ.40,232 కోట్ల పెట్టుబడులు
- 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్-2
- ప్రభుత్వ బంజరు భూముల్లో పరిశ్రమల ఏర్పాటు
- టాటా టెక్నాలజీస్ రూ.2000 కోట్లు

మౌలిక రంగం
- నూతన పారిశ్రామిక వాడలు
- మెగా మాస్టర్ ప్లాన్ 2050
- ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్లు
- ఎన్టీపీసీ రామగుండం రెండో యూనిట్ ప్రారంభం
- రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్
- బోయిన్ పల్లి డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్
- పాతబస్తీ పైనుండి మెట్రో విస్తరణ
- NH-44పై కారిడార్ నిర్మాణం
- కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ

ఆరోగ్య తెలంగాణ
- రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్యం
- అందరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు
- బీబీనగర్ ఎయిమ్స్ లో పూర్తి స్థాయి వైద్య సేవలు
- డ్రగ్స్ పై ఉక్కుపాదం

సాంస్కృతిక రంగం
- అధికారికంగా గద్దర్ జయంతి
- పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు రూ.25 లక్షల నగదు, రూ.25 వేల పెన్షన్
- గద్దర్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు
- కవులు, కళాకారులకు గద్దర్ అవార్డులు



గృహజ్యోతి
- 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- 41.78 లక్షల మందికి పైగా లబ్ధి

ఉద్యోగులకు అండగా ప్రభుత్వం
- ఉద్యోగులకు మొదటి తారీఖు జీతాలు
- ఆర్టీసి ఉద్యోగులకు 21 శాతం ఫిట్ మెంట్
- జీ.ఓ. 317, 46లపై కేబినెట్ సబ్ కమిటీలు
- సింగరేణి కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా

వ్యవసాయ రంగం
- రైతుకు పెట్టుబడి సాయం
- రాష్ట్ర రైతు కమిషన్ ఏర్పాటు
- నారాయణ పేట్ కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్
- పంటల బీమా పథకం ప్రారంభం
- ధరణి పోర్టల్ ప్రక్షాళనకు చర్యలు
- లక్షకు పైగా ధరణి సమస్యల పరిష్కారం
- కౌలు రైతుల రక్షణకు చట్టం తేవడానికి చర్యలు
- రూ.97 కోట్లతో రైతు నేస్తం

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికై
- కులాల వారిగా 17 కార్పొరేషన్ల ఏర్పాటు
- కులగణనకు ఆమోదం
- గిరిజన కార్పొరేషన్ల ఏర్పాటు

గ్రామీణాభివృద్ధి
- తాగునీటికి నియోజకవర్గానికో రూ.కోటి ప్రత్యేక నిధులు
- రోడ్లు లేని 422 గ్రామాలు, 3177 ఆవాసాలకు తారు రోడ్లు

మహాలక్ష్మి
- రూ.500కే గ్యాస్ సిలిండర్
- 40 లక్షల మందికి పైగా లబ్ధి

ఇందిరమ్మ ఇండ్లు
- రూ.22,500 కోట్లతో 4.5 లక్షల మందికి ఇందిరమ్మ ఇండ్లు

తెలంగాణ చిహ్నాలు
- టీఎస్ నుంచి టీజీగా వాహనాల రిజిస్ట్రేషన్ మార్పు
- రాష్ట్రగీతంగా జయ జయహే తెలంగాణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నంలో మార్పులు
- తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు





ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం.

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

ఎన్నికల సమయంలోనూ బాండ్ల విక్రయం



చట్టానికి సవరణ చేసిన మోడీ ప్రభుత్వం

ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో సంబంధమున్న పలు సంస్థలు 2019 లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయి. అంతేకాదు... 2022లో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ శాసనసభలకు ఎన్నికలు జరగడానికి ముందు కూడా బాండ్ల కొనుగోళ్లు జరిగాయి. సాధారణంగా ఎన్నికల సమయంలో బాండ్లను విక్రయించకూడదు. అయితే మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్ట సవరణ కారణంగా అందుకు మార్గం సుగమమైంది. ఫలితంగా కమలదళానికి విరాళాలు వెల్లువలా వచ్చి పడ్డాయి.

ఎన్నికల సమయంలో విక్రయించిన బాండ్లలో అధిక భాగం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఖాతాకే చేరాయి. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన వారి జాబితాలో అనేక బడా దేశీయ కంపెనీల పేర్లు కన్పించడం లేదు. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచిన సమాచారాన్ని ప్రాథమికంగా పరిశీలించినప్పుడు అదానీ, టాటా గ్రూప్ కంపెనీలు బాండ్లను కొనుగోలు చేసిన సమాచారం లేదు. రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా బాండ్లను నేరుగా కొనలేదు. అయితే ఆ గ్రూపుతో సంబంధమున్న సంస్థల పేర్లు కొనుగోలు దారుల జాబితాలో ఉన్నాయి. వీటన్నింటికీ ఉమ్మడి డైరెక్టర్లు ఉన్నారు. వాటి చిరునామాలు కూడా ఒకటే.

భారీగా కొనుగోళ్లు చేసిన రిలయన్స్ అనుబంధ సంస్థలు ఫలితంగా బీజేపీకి భారీ విరాళాలు

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో సంబంధమున్న సంస్థలలో క్విక్ సప్లయ్ చెయిన్ ప్రైవేట్ లిమిటెడ్ ఒకటి. ఇది రూ.410 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసింది. ఈ విషయాన్ని గతంలోనే పలు స్వతంత్ర మీడియా సంస్థలు వెల్లడించాయి. ఈ కంపెనీకి చెందిన ముగ్గురు డైరెక్టర్లలో ఒకరైన తపస్ మిత్రా రిలయన్స్ ఆయిల్ అండ్ పెట్రోలియం, రిలయన్స్ ఎరోస్ ప్రొడక్షన్, రిలయన్స్ ఫొటో ఫిల్మ్, రిలయన్స్ ఫైర్ బ్రిగేడ్, రిలయన్స్ పాలియస్టర్ సంస్థలకు కూడా డైరెక్టరుగా వ్యవహరిస్తున్నారు. ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అకౌంట్స్ (కన్సాలిడేషన్) విభాగానికి ఆయనే అధిపతి.

అంబానీ మాజీ భాగస్వామి కూడా...

ముకేష్ అంబానీకి ఒకప్పటి వ్యాపార భాగస్వామి సురేంద్ర లూనియాతో సంబంధమున్న సంస్థలు కూడా బాండ్లను కొనుగోలు చేశాయి. రిలయన్స్ అనుబంధ సంస్థలకు ఎన్డీటీవీలో ఉన్న 29.18% వాటాలను ఆయన అదానీ గ్రూపుకు విక్రయించారు. లూనియాతో సంబంధమున్న ఎన్స్‌జ్ డివైసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్ఫోటెల్ బిజినెస్ సొల్యూషన్స్ లిమిటెడ్ కంపెనీలు బాండ్లను కొనుగోలు చేశాయి. ఈ రెండు కంపెనీల బోర్డు సమావేశాలకు లూనియా హాజరవుతుంటారు. ఇక లూనియాకు ఇన్ఫోటెల్ యాక్సెస్ ఎంటర్‌ప్రైజెస్ ప్రయివేట్ లిమిటెడ్, ఇన్ఫోటెల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలతో సంబంధం ఉంది. వాటి డైరెక్టర్ కమల్ కుమార్ శర్మ ద్వారా లూనియాకు ఈ కంపెనీలతో సంబంధం ఏర్పడింది. లూనియాస్ ఇన్ఫోటెల్ గ్రూపుకు కమల్ కుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా, సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ఈ కంపెనీలన్నీ కలిసి 2019 మే 9న రూ.50 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశాయి. ఆ సమయంలో దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి.

టెండర్ దక్కించుకున్న రిలయన్స్

స్థానికంగా బ్యాటరీ సెల్స్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు మోడీ ప్రభుత్వం 2.4 బిలియన్ డాలర్ల కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనికింద ప్రోత్సాహకాలు పొందేందుకు రియలన్స్ గ్రూప్ బిడ్ సమర్పించింది. 2022 మార్చిలో టెండర్ దక్కించుకుంది. రిలయన్స్‌తో సంబంధమున్న మరో కంపెనీ హనీవెల్ ప్రాపర్టీస్ ప్రయివేట్ లిమిటెడ్ 2021 ఏప్రిల్ 8న రూ.30 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసింది. ఈ కంపెనీ డైరెక్టర్లలో ఒకరు 2005 నుంచి అనేక రిలయన్స్ గ్రూపు సంస్థల బోర్డుల్లో ఉన్నారు.

ఎన్నికల వేళ బాండ్ల విక్రయం

సాధారణంగా ఎన్నికల బాండ్లను సంవత్సరానికి నాలుగు సార్లు మాత్రమే విక్రయిస్తారు. లోక్‌సభ ఎన్నికలు జరిగే సంవత్సరంలో వీటిని అమ్మకూడదు. అయితే ఎన్నికలు జరిగే సంవత్సరంలోనూ పదిహేను రోజుల పాటు బాండ్లను విక్రయించేందుకు వీలుగా 2022 నవంబర్ 7న మోడీ ప్రభుత్వం చట్ట సవరణ తీసుకొచ్చింది. హిమాచల్ ప్రదేశ్ శాసనసభ ఎన్నికలు జరగడానికి కొద్ది రోజుల ముందు, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల ముందు ఈ సవరణ చేయడం గమనార్హం.

సింహభాగం బీజేపీకే

చట్ట సవరణ నేపథ్యంలో 2022 నవంబర్ 9 నుంచి వారం రోజుల పాటు బాండ్లను అమ్మారు. ఈ వ్యవధిలోనే రూ.676 కోట్ల విలువైన బాండ్లను ఎస్‌బీఐ విక్రయించింది. ఇందులో బీజేపీకి రూ.590 కోట్లు (87 శాతం) విరాళాల రూపంలో అందాయి. ఈ దశలో రిలయన్స్‌తో సంబంధమున్న సంస్థలే ఎక్కువగా బాండ్లను కొనుగోలు చేశాయి. ఈ వారం రోజుల వ్యవధిలో క్విక్ సప్లయ్ చెయిన్ ప్రయివేట్ లిమిటెడ్, నెక్స్‌జ్ డివైసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మాన్‌కైండ్ ఫార్మా లిమిటెడ్‌లు రూ.164 కోట్ల (మొత్తం విక్రయాలలో 24 శాతం) బాండ్లు కొన్నాయి. మాన్‌కైండ్ ఫార్మాలో లూనియా కూడా ఒక డైరెక్టరే.

లూనియాతో సంబంధం ఉన్న మరో సంస్థ ఎంఎస్ మీడియా వెంచర్స్ ఈ వారం రోజుల అమ్మకపు కాలంలో రూ.5 కోట్ల విలువైన బాండ్లు కొన్నది. దీనికి, నెక్స్‌జ్ డివైసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సందీప్ జైరాథ్ అనే వ్యక్తి డైరెక్టర్‌గా ఉన్నారు. ఎంఎస్ మీడియా వెంచర్స్‌లో రెండో డైరెక్టర్‌గా ఉన్న కుల్విందర్ పాల్ సింగ్ ఇన్ఫోటెల్ గ్రూపు (లూనియాకు చెందిన కంపెనీ)కు సీనియర్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు.

రెండోసారి కూడా...

సవరణ ద్వారా బాండ్లను విక్రయించిన కాలంలో రిలయన్స్ గ్రూపుతో పాటు వేదాంత గ్రూపు, యునైటెడ్ ఫాస్పరస్, శ్రీ సిద్ధార్థ ఇన్‌ఫ్రాటెక్ అండ్ సర్వీసెస్, డీఎల్ఎఫ్, సిప్లా, మారుతి సుజికీ కూడా పెద్ద మొత్తంలోనే కొనుగోళ్లు జరిపాయి. గుజరాత్ ఎన్నికలకు ముందు 2022 డిసెంబరులో మరోసారి బాండ్ల విక్రయానికి గేట్లు తెరిచారు. ఈ కాలంలో రూ.232 కోట్ల విలువైన బాండ్లు అమ్ముడుపోయాయి. వీటిలో కూడా సింహభాగం బీజేపీదే. ఆ పార్టీకి రూ.165 కోట్ల విరాళాలు అందాయి. క్విక్ సప్లయ్ రూ.410 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసింది. అందులో 2022 జనవరి 5న రూ.225 కోట్లు, జనవరి 10న రూ.10 కోట్ల విలువైన బాండ్లు కొన్నది.

మేము సైతం అన్న ఫార్మా, హెల్త్‌కేర్ సంస్థలు

రూ.900 కోట్ల ఎన్నికల బాండ్ల కొనుగోలు

న్యూఢిల్లీ : దేశంలోని కనీసం 30 ఫార్మా, హెల్త్‌కేర్ కంపెనీలు రూ.900 కోట్ల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి రాజకీయ పార్టీలకు విరాళంగా అందజేశాయి. వివిధ రాజకీయ పార్టీలకు అందిన రూ.12,155 కోట్ల విరాళాలలో ఈ కంపెనీల వాటా 7.5%. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన ప్రముఖ ఫార్మా, హెల్త్‌కేర్ సంస్థలలో యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (హైదరాబాద్-రూ.162 కోట్లు), డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ (రూ.80 కోట్లు), అహ్మదాబాద్‌లో కేంద్ర కార్యాలయం ఉన్న టొరెంట్ ఫార్మాస్యూటికల్స్ (రూ.77.5 కోట్లు), హైదరాబాదుకు చెందిన నాట్కో ఫార్మా (రూ.69.25 కోట్లు), హైదరాబాదుకే చెందిన హెటెరో ఫార్మా, దాని అనుబంధ సంస్థలు ఉన్నాయి. బియోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు కిరణ్ మజుందార్ షా కూడా ఆరు కోట్ల రూపాయల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేశారు. ఫార్మా పరిశ్రమకు చెందిన సిప్లా కంపెనీ సైతం రూ.39.2 కోట్ల విలువైన ఈబీలను కొనుగోలు చేసింది.

యశోదా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆరు దశలలో 80 బాండ్లను కొనుగోలు చేసింది. ఒక్క 2022 ఆగస్టులోనే రూ.80 కోట్ల విలువైన బాండ్లు కొన్నది. హెటెరో ఫార్మా మూడు విడతలుగా బాండ్లు కొనుగోలు చేసింది. దానికి ముందే ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగాయి. లెక్క చూపని రూ.550 కోట్ల నగదును అధికారులు కనుగొన్నారు. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన ఫార్మా కంపెనీల జాబితాలో హైదరాబాదుకు చెందిన వ్యాక్సిన్ తయారీ సంస్థలు భారత్ బయోటెక్ (రూ.10 కోట్లు), బయలాజికల్ ఈ (రూ.5 కోట్లు) కూడా ఉన్నాయి. కోవిడ్ వ్యాక్సిన్ల తయారీ కోసం ఈ రెండు కంపెనీలు ప్రభుత్వ అనుమతి పొందిన విషయం తెలిసిందే. ఇక్కడ గమనించాల్సిన విశేషమేమంటే పలు ఫార్మా కంపెనీలు ఒకే రోజు ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయి. ఉదాహరణకు 2022 నవంబర్ 10న సిప్లా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, ఇప్కా లేబొరేటరీ కలిపి మొత్తంగా రూ.50 కోట్ల విలువైన బాండ్లను కొన్నాయి. ఆ మరునాడే గ్లెన్‌మార్క్, మాన్‌కైండ్ కంపెనీలు రూ.30 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేశాయి. మూడు రోజుల తర్వాత అంటే నవంబర్ 14న అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్, ఆల్‌కెమ్ లేబొరేటరీస్, పిరమల్ కంపెనీలు రూ.20 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేయడం జరిగింది. 2022 మార్చిలో పన్ను ఎగవేత ఆరోపణలకు సంబంధించి గ్లెన్‌మార్క్ ఫార్మా, సిప్లా, మైలాన్, అరబిందో ఫార్మాపై డీజీజీఐ విచారణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో పాలకులను ప్రసన్నం చేసుకునేందుకు ఆయా కంపెనీలు ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి విరాళాలు సమర్పించుకున్నాయి.

మహారాష్ట్ర ప్రాజెక్టు కోసం...

రూ.140 కోట్ల బాండ్లు కొనుగోలు చేసిన మేఘా

న్యూఢిల్లీ : హైదరాబాదుకు చెందిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) గత సంవత్సరం ఏప్రిల్ 11న రూ.140 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. దానికి నెల రోజుల ముందే ఆ కంపెనీకి రూ.14,400 కోట్ల విలువైన థానే-బోరివాలీ జంట టన్నెల్ ప్రాజెక్ట్ టెండర్ దక్కడం గమనార్హం. మొత్తంమీద ఈ కంపెనీ అత్యధిక విలువ కలిగిన బాండ్లను (రూ.821 కోట్లు) కొనుగోలు చేసిందని ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాలను బట్టి తెలుస్తోంది. టన్నెల్ ప్రాజెక్టు కోసం ఎంఈఐఎల్ కంపెనీ ఒక్కటే టెండర్ దాఖలు చేసింది. టన్నెల్ నిర్మాణం కోసం ఎల్ అండ్ టీ సంస్థ దాఖలు చేసిన బిడ్లు తిరస్కరణకు గురయ్యాయి. దీనిపై ఆ సంస్థ బాంబే హైకోర్టును ఆశ్రయించినా ప్రయోజనం కలగలేదు.



వచ్చారు.. వెళ్లారు..

నిరుత్సాహపర్చిన మోడీ రోడ్డు షో

దాదాపు మూడు గంటలు వేచి ఉన్న బీజేపీ శ్రేణులు

మాట్లాడకుండా కేవలం అభివాదం చేస్తూ వెళ్లిపోయిన ప్రధాని

ఎందుకు వచ్చారు.. ఎందుకు వెళ్లారు.. అంటూ నైరాశ్యంలో రాష్ట్ర నేతలు

మోడీ మౌన రోడ్ షో అంటూ పెదవి విరుపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరిలో ప్రధాని నరేంద్ర మోడీ రోడ్ షో నిరాశపర్చింది. మోడీ రాక కోసం దాదాపు మూడు గంటల వరకు వేచి ఉన్న మహిళలు ఆయన ఎందుకు వచ్చారు.. ఎందుకు వెళ్లారు.. అంటూ నిరుత్సాహం వ్యక్తం చేశారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని మల్కాజిగిరి నియోజకవర్గంలో శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ విజయ సంకల్ప రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షో సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. 6.15కు ప్రారంభమైంది. మిర్జాలగూడ చౌరస్తా నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు దాదాపు 1.3 కిలో మీటర్లు మోడీ రోడ్ షో కొనసాగింది. గోషామహల్‌తో సహా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీజేపీ శ్రేణులను మూడు గంటల ఆలస్యం ఇబ్బందులకు గురిచేసింది. ప్రధాని మోడీ జిల్లాకు ఏమైనా వరాల జల్లు కురిపిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. అయితే రోడ్ షోలో నాయకులు, కార్యకర్తల హడావుడి జోరుగా కనిపించింది.

బారికేడ్లు ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు..

మోడీ పర్యటనను పురస్కరించుకుని బందోబస్తు పేరిట మల్కాజిగిరి అసెంబ్లీ పరిధిలోని పలు ప్రాంతాలను, ప్రధాన రోడ్లను దిగ్బంధించారు. ట్రాఫిక్ ఆంక్షలూ విధించారు. బారికేట్లు ఏర్పాటు చేసి రహదారులపై ప్రత్యేక నియంత్రణా చర్యలు చేపట్టారు. మల్కాజిగిరి పరిసర ప్రాంతాల్లో మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్ బాగ్, జెడ్ టీఎస్, మిర్జాల్ గూడ, గౌతంనగర్, మినీ ట్యాంక్ బండ్, నేరేడ్ మెట్ ప్రాంతాల్లోని ట్రాఫిక్ మళ్లించారు. అలాగే ప్రధాన రహదారి పక్కన వాణిజ్య సముదాయాలను మూసివేశారు. దాంతో వివిధ పనులు, హాస్పిటల్స్, రోజువారీ కార్యక్రమాల కోసం బయటికి వెళ్లే బస్తీవాసులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల బందోబస్తు పేరిట నాయకులు ఓవర్ యాక్షన్ చేసినట్టు తెలిసింది. కొందరు నాయకులు మల్కాజిగిరి చౌరస్తా ప్రాంతంలో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేయడంతో మోడీని దగ్గర నుంచి చూడాలనుకున్న ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బీజేపీ శ్రేణుల కంటే ప్రధాని మోడీని చూడాలనే ఉద్దేశంతో చాలా మంది రోడ్ షోకు వచ్చారు.

ఉలుకు లేదు.. పలుకు లేదు..

రోడ్ షోలో ప్రధాని మోడీని అతిగా ఊహించుకున్న పార్టీ క్యాడర్‌కు, ప్రజలకు నిరాశే మిగిలింది. రోడ్ షోలో మోడీ అభివాదమే తప్ప. ఉలుకు, పలుకు లేకుండా మౌనంగా రోడ్ షో ముగించటం పట్ల ప్రజలు అసహనానికి గురయ్యారు. ఈ రోడ్ షోలో ప్రధాని మోడీ వెంట బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్, సికింద్రాబాద్ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాం చందర్ రావు, బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రూరల్ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి పాల్గొన్నారు.

అనుమతుల కోసం నజరానాలు

రూ.825 కోట్ల విరాళాలు • బాండ్ల కొనుగోలులో మైనింగ్, స్టీల్ కంపెనీలు

న్యూఢిల్లీ : ఏ ప్రాజెక్టు నిర్వహించాలన్నా ప్రభుత్వం నుండి అనుమతులు ఊరికే రావు. అంతో ఇంతో సమర్పించుకోవాల్సిందే. దేశంలో పేరెన్నికగన్న మైనింగ్, స్టీల్ కంపెనీలు తమ ప్రాజెక్టులకు అవసరమైన పర్యావరణ అనుమతులు పొందేందుకు ఎన్నికల బాండ్ల పథకాన్ని ఉపయోగించుకున్నాయి. ఈబీలను కొనుగోలు చేసి పాలకులకు నజరానాలు అందజేశాయి. అయినా ఇప్పటికీ కొన్ని కంపెనీలు అనుమతుల కోసం ఎదురు చూస్తూనే ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం తన అధికారిక వెబ్‌సైట్‌లో బహిర్గతం చేసిన వివరాల ప్రకారం దేశంలోని బడా మైనింగ్, స్టీల్ కంపెనీలు కోట్లాది రూపాయల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేశాయి. వేదాంత లిమిటెడ్, రుంగ్తా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్, జిందాల్ స్టీల్ అండ్ పవర్ (జేఎస్‌పీఎల్), ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఈఎంఐఎల్), డెంపో సంస్థలు కలిపి రూ.825 కోట్ల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేశాయి. ఈ కంపెనీలలో రుంగ్తా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.100 కోట్లు, వేదాంత లిమిటెడ్ రూ.376 కోట్లు, ఈఎంఐఎల్ రూ.224.5 కోట్లు, జేఎస్‌పీఎల్ రూ.123 కోట్లు, డెంపో రూ.1.5 కోట్లు బాండ్ల కొనుగోలు కోసం వెచ్చించాయి.



అనుమతుల కోసం ఎదురు చూపులు

జేఎస్‌పీఎల్ ప్రధానంగా ఛత్తీస్‌గఢ్, ఒడిషా, జార్ఖండ్ రాష్ట్రాలలోని మైనింగ్, విద్యుత్, ఉక్కు రంగాలలో వ్యాపారాలు చేస్తోంది. ఈ కంపెనీ విరాళాలన్నీ 2022 అక్టోబర్, 2023 నవంబర్ మధ్య కాలంలో ఇచ్చినవే. ఇక ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ఈఎంఐఎల్ మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో బందర్ డైమండ్ ప్రాజెక్టును చేపట్టింది. 2019-2022 మధ్యకాలంలో ఈ కంపెనీ రూ.224.5 కోట్ల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. వీటిలో 2019లో రూ.50 కోట్లు, 2020లో రూ.20 కోట్లు, 2021లో రూ.104.5 కోట్లు, 2022లో రూ.50 కోట్ల బాండ్లను కొనుగోలు చేసింది. దేశంలోని అతి పెద్ద బొగ్గు మైనింగ్ కంపెనీలలో ఈఎంఐఎల్ ఒకటి. 2019లో ఈ కంపెనీ బందర్ డైమండ్ ప్రాజెక్ట్ కోసం మైనింగ్ లీజు పొందింది. అయితే స్థానికుల నుండి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కాలేదు. పర్యావరణ అనుమతుల కోసం కంపెనీ అందజేసిన దరఖాస్తును 2020లో పర్యావరణ మంత్రిత్వ శాఖ తిప్పిపంపింది. ఈ ప్రాజెక్టు పన్నా టైగర్ రిజర్వ్ సమీపంలో ఉండ డంతో ముందుగా అటవీ, వన్య ప్రాణులకు సంబం ధించిన అనుమతులు పొందాలని సూచిం చింది. అటవీ అను మతులకు సంబం ధించిన ఈఎంఐఎల్ ప్రతి పాదనలపై మంత్రి త్వ శాఖ అనేక ప్రశ్నలు లేవనెత్తింది. నోయి డాకు చెందిన జీహెచ్‌సీఎల్ కంపెనీ 2019లో రూ.50 లక్షల విలువ కలిగిన బాండ్లను కొను గోలు చేసింది. గుజరాత్ లోని సోడా యాష్ ప్లాంటు, కాప్టివ్ పవర్ ప్లాంటు ఆధునీకరణ నిమిత్తం ఈ కంపెనీ పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేసింది. అయితే తాను అడిగిన వివరణలను సమర్పించలేదన్న కారణంతో 2019 నవంబరులో ఈ ప్రాతిపాదనను మంత్రిత్వ శాఖ ఉపసంహరించుకుంది.

నిబంధనల్లో మార్పుల కోసం...

నోయిడాకు చెందిన బల్దోతా గ్రూపునకు చెందిన కంపెనీ ఎంఎస్‌పీఎల్ లిమిటెడ్‌ది కూడా ఇలాంటి కథే. ఇనుప ఖనిజం మైనింగ్ వ్యాపారం నిర్వహిస్తున్న ఈ కంపెనీ 2019 ఏప్రిల్‌లో కోటి రూపాయలు, 2023 ఏప్రిల్‌లో మూడు కోట్ల రూపాయల విలువ కలిగిన ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసింది. తన ఇనుప ఖనిజం మైనింగ్ ప్లాంట్లకు సంబంధించిన నియమ నిబంధనల్లో ఈ కంపెనీ కొన్ని మార్పులు కోరుకున్నది. కంపెనీ కోరిన మార్పులకు పర్యావరణ మంత్రిత్వ శాఖ 2022 ఫిబ్రవరిలో అంగీకారం తెలిపింది.

ఎన్నికలకు ముందే బాండ్లు కొన్న 'వేదాంత'

వేదాంత లిమిటెడ్ మొత్తం రూ.376 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేయగా వాటిలో రూ.98 కోట్ల విలువైన బాండ్లను ఒక్క 2022 జనవరిలోనే కొనుగోలు చేసింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా శాసనసభలకు ఎన్నికలు జరగడానికి ముందు వీటిని కొనుగోలు చేయడం గమనార్హం. వేదాంత గ్రూపులోని సెసా గోవా కంపెనీ దేశంలోని అతి పెద్ద ఇనుప ఖనిజపు మైనింగ్ కంపెనీలలో ఒకటి. ఒడిషాలో ఈ కంపెనీకి మైనింగ్ వ్యాపారాలు ఉన్నాయి. వేదాంత గ్రూపుకు ఇనుప ఖనిజం, చమురు-గ్యాస్, రాగి, అల్యూమినియం, ఉక్కు రంగాలలో వ్యాపారాలు ఉన్నాయి.

దాడుల తర్వాతనే...

• 41 కంపెనీల నుంచి బీజేపీకి విరాళాలు

• 18 కంపెనీల నుంచే రూ.2,010కోట్లు!

న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి దాడులను, చర్యలను ఎదుర్కొన్న తర్వాత 30 కంపెనీలు బీజేపీకి రూ.355 కోట్లను విరాళాలుగా అందజేశాయని ఫిబ్రవరిలో ఆన్‌లైన్ వార్తా వెబ్‌సైట్‌లైన న్యూస్‌లాండ్రీ, ది న్యూస్ మినిట్ పేర్కొన్నాయి. కానీ మరో 11 కంపెనీలు కూడా పాలక పార్టీకి రూ.62.3కోట్లు విరాళమిచ్చి ఇదే బాటలో పయనించినట్లు మూడు రోజుల క్రితం వెల్లడైంది. అంటే మొత్తంగా 41 కంపెనీలకు గానూ 18 కంపెనీలు గత రాత్రి ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎన్నికల బాండ్ల కొనుగోలుదారుల జాబితాలో వున్నాయి. ఈ 18 కంపెనీలు ఏకంగా దాదాపు రూ.2,010.5 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశాయి. అంటే గతంలో 41 కంపెనీలు బాండ్ల రూపంలో అందజేసిన విరాళాల మొత్తం కన్నా ఐదు రెట్లు ఎక్కువ. వాటిలో కొన్ని సంస్థల వివరాలిలా ఉన్నాయి.



లాటరీ కింగ్ : అన్నింటికంటే అగ్రభాగాన తమిళనాడుకు చెందిన లాటరీ కంపెనీ ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ పీఆర్ వుంది. అనేక క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్న, లాటరీ కింగ్‌గా తనకు తాను చెప్పుకునే శాంటియాగో మార్టిన్ ఈ కంపెనీ అధినేత. రూ.1368 కోట్ల మేరకు బాండ్ల రూపంలో ఈ కంపెనీ విరాళాలు అందజేసింది.

యశోదా హాస్పిటల్స్ : రావు సోదరులైన రవీందర్, సురేందర్, దేవేందర్‌లకు చెందిన ఈ గ్రూపు ఆఫ్ హాస్పటల్స్ రూ.162 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసింది.

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ : ముంబయికి చెందిన ఈ కంపెనీ దాని అనుబంధ సంస్థలు కలిపి 2014 నుంచి 2023 వరకు రూ.84 కోట్లను బీజేపీకి విరాళంగా అందజేశాయి. గత రాత్రి ఎన్నికల కమిషన్ అందజేసిన డేటా ప్రకారం ఐఆర్‌బి-మోడరల్ రోడ్ మేకర్స్, ఐఆర్‌బీ ఎంపీ ఎక్స్‌ప్రెస్‌వే, ఐడియల్ రోడ్ బిల్డర్స్ - కలిపి ఇచ్చిన రూ.84 కోట్లలో మోడరల్ రోడ్ మేకర్స్ రూ.53 కోట్లను, ఐఆర్‌బీ ఎంపీ ఎక్స్‌ప్రెస్ వే రూ.25 కోట్లను, ఐడియల్ కంపెనీ రూ.6కోట్లను అందజేశాయి.

సోమ్ డిస్టిలరీస్ : దాడి జరిగిన వెంటనే విరాళమిచ్చిన కంపెనీల్లో మధ్యప్రదేశ్‌కి చెందిన సోమ్ డిస్టిలరీస్ ఒకటి. అరెస్టయిన తన ప్రమోటర్లను విడుదలైన పది రోజుల్లో రూ.3కోట్లు విరాళంగా ఇచ్చింది.

హెటెరో గ్రూపు: హైదరాబాద్‌కి చెందిన హెటెరో గ్రూపు ఒక ఫార్మస్యూటికల్ సంస్థ. బీఆర్ఎస్‌కి చెందిన రాజ్యసభ సభ్యుడు, సంపన్నుడైన ఎంపీ అయిన పార్థసారథి రెడ్డి సారథ్యంలో ఇది నడుస్తోంది. మొదట వెబ్‌సైట్‌లు విడుదల చేసిన 30 కంపెనీల జాబితాలో ఇది వుంది. మూడు కంపెనీలతో కూడిన ఈ గ్రూపు 2022 ఏప్రిల్ 7 నుండి 2023 అక్టోబరు 12 మధ్యలో రూ.60కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది.

ఎస్‌పిఎంఎల్ ఓం, మెటల్ జెవి: ఓం కొఠారి గ్రూపునకు చెందిన ఈ కంపెనీకి జల విద్యుత్, రియల్ ఎస్టేట్, ఆటో డీలర్‌షిప్‌లు, హోటళ్లు, వినోద కేంద్రాల్లో వ్యాపారాలు వున్నా యి. 2020 జులో ఐటి దాడులవగానే రూ.5కోట్లు విరాళంగా ఇచ్చింది. తిరిగి 2021లో అక్టోబరు 4న మరో రూ.5కోట్లు విలువైన బాండ్లను కొంది.

రామ్‌కో సిమెంట్స్ : తమిళనాడుకు చెందిన ప్రధాన సిమెంట్ తయారీ గ్రూపు అయిన రామ్‌కో సిమెంట్స్ 2022 అక్టోబరు 10 నుంచి, 2023 నవంబరు 15 మధ్య రూ.54కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసింది.

కెజెఎస్ గ్రూపు : మధ్యప్రదేశ్‌కి చెందిన కెజెఎస్ సిమెంట్స్ 2019 ఏప్రిల్ 20, 2019 మే 9 మధ్య రూ.14కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసింది.

ఐఎల్ఎబిఎస్ టెక్నాలజీ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ : హైదరాబాద్‌కి చెందిన ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ అయిన ఈ కంపెనీ 2023 ఏప్రిల్ 10న రూ.5 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసింది. 2019 మే లో కూడా బీజేపీకి రూ.5కోట్లు విరాళమిచ్చింది.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 16-3-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 25 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



10లో..

ఒక దేశం ఒకే ఎన్నిక **వద్దు**

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో



హైదరాబాద్‌లో రాష్ట్రపతి ముర్ము

స్వాగతం పలికిన సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై తదితరులు



కవితతో కేటీఆర్

ఎమ్మెల్సీ కవిత అరెస్టు

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అదుపులోకి తీసుకున్న ఈడీ

- ఆరు గంటలకు పైగా ఇంట్లో సోదాలు
- నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత
- ఈడీ అధికారులతో కేటీఆర్, హరీశ్ వాగ్వాదం
- ఢిల్లీకి తరలింపు

దేశంలో సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎట్టకేలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లోని ఆమె నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తతల మధ్య అరెస్ట్ జరిగింది. అంతకముందు, దాదాపు ఆరు గంటలకు పైగా ఈడీ అధికారులు కవిత నివాసంలో సోదాలు నిర్వహించారు.

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి/బంజారాహిల్స్

కవితను అరెస్ట్ చేసి ఢిల్లీకి తీసుకువెళ్లాలనే ఈడీ అధికారుల ప్రయత్నాలకు ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల నుంచి ప్రతిఘటన ఎదురై తీవ్ర వాగ్వాదానికి దారి తీసింది. చివరికి తాము వేసుకున్న వ్యూహం ప్రకారమే ఈడీ అధికారులు కవితను రాత్రి ఢిల్లీకి విమానంలో తీసుకెళ్లారు.

స్కాంలో కవితదే కీలక పాత్ర : ఈడీ ఆరోపణలు

గత కొంత కాలంగా ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవితను ఈడీ అరెస్ట్ చేయనున్నట్టు ...10లో

బీఆర్ఎస్‌లో ప్రకంపనలు

- అటు మోడీ రోడ్‌షో...ఇటు కవిత అరెస్టు
- రాజకీయ కక్షసాధింపేనంటున్న పార్టీ శ్రేణులు
- పార్టీని వీడుతున్న ప్రజాప్రతినిధులు
- సీఎంను కలిసిన పసునూరి, దానం
- బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు ఖరారు
- బీఎస్పీకి నాగర్‌కర్నూల్, హైదరాబాద్ స్థానాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో రాజకీయ ప్రకంపనలు తీవ్రస్థాయికి చేరాయి. శుక్రవారం సాయంత్రం ప్రధాని నరేంద్రమోడీ హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానంలో రోడ్ షో నిర్వహిస్తున్న సమయంలోనే, బీఆర్ఎస్ అధ్యక్షులు కే చంద్రశేఖరరావు కుమార్తె, ఎమ్మెల్సీ కవితను ఈడీ, ఐటీ శాఖలు ...10లో

వచ్చారు.. వెళ్లారు..

నిరుత్సాహపర్చిన మోడీ రోడ్డు షో



2లో

అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

- దాదాపు మూడు గంటలు వేచి ఉన్న బీజేపీ శ్రేణులు
- మాట్లాడకుండా కేవలం అభివాదం చేస్తూ వెళ్లిపోయిన ప్రధాని
- ఎందుకు వచ్చారు.. ఎందుకు వెళ్లారు.. అంటూ నైరాశ్యంలో రాష్ట్ర నేతలు
- మోడీ మౌన రోడ్ షో అంటూ పెదవి విరుపు

మాది సెక్యులర్ సర్కార్

ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేస్తాం

- మోడీ, అమిత్‌షా దీన్ని రద్దు చేస్తామంటున్నారు..అది వారి వల్ల కాదు
- ఇఫ్తార్ విందు మతసామర్యానికి ప్రతీక : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పక్కా సెక్యులర్, ప్రజా ప్రభుత్వ పాలన సాగుతున్నదని సీఎం రేవంత్‌రెడ్డి



అప్యాయంగా..ఖర్జూరం తినిపిస్తూ..

అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, షబ్బీర్‌అలీ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముస్లిం మత పెద్దలు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అనాథపిల్లలకు కానుకలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీకగా ...11లో



తోఫా అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



నేడే ఎన్నికల నగారా

- 543 లోక్‌సభ స్థానాలు, నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు నేడు షెడ్యూల్ విడుదల
- ఏడు దశల్లో ఎన్నికలు జరిగే అవకాశం

వివరాలు 11లో

భువనగిరి బరిలో సీపీఐ(ఎం)

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

ప్రజల భవిష్యత్తు ఈ ఎన్నికలపైనే ఆధారపడి ఉంది : చెరుపల్లి, జూలకంటి

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య తెలిపారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని వెన్నెల కళాశాలలో నిర్వహించిన సీపీఐ(ఎం) జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. కుల, మతాల పేరుతో ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చి వైషమ్యాలను రెచ్చగొట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు.

నవతెలంగాణ-భువనగిరి

భారతదేశంలో 100 కోట్ల మందికి పైగా పౌష్టికాహారం అందడం లేదని ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని, కానీ దేశ ప్రధాని 80 కోట్ల మందికి మాత్రమే అందడం లేదని అబద్ధాలు చెప్పడం దారుణమని వీరయ్య అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం, ప్రభుత్వ రంగంలో ప్రయివేటు వ్యక్తుల వాటాలు పెంచడం ద్వారా ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో బడా బూర్జువా పెట్టుబడు దారులు మోడీని కొనసాగించాలని కోరుకుంటు న్నారే కానీ సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు మాత్రం బీజేపీని విమర్శిస్తున్నారన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో బీజేపీకి వేల కోట్ల రూపాయల విరాళాలు అందాయని తెలిపారు. పాలకవర్గ స్వభావాన్ని తక్కువగా అంచనా వేయవద్దని, ప్రజా సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మూడుసార్లు కలిసామని, నేటికీ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదని అన్నారు.

సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రజల భవిష్యత్తు ఈ ఎన్నికల ఫలితాలపై ఆధారపడి ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా సమస్యలే తమ ఎజెండాగా నిరంతరం ప్రజల తరపున పనిచేసే సీపీఐ(ఎం) అభ్యర్థికి ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అనుసరిస్తు న్న ప్రజా వ్యతిరేక ...11లో

ఎలక్టోరల్ బాండ్స్ కేసులో సుప్రీం ఆగ్రహం

ఎస్‌బీఐకి నోటీసులు

సోమవారంలోగా వివరణివ్వాలి





నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎలక్టోరల్ బాండ్ల కేసులో ఎస్‌బీఐ తీరుపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో తమ ఆదేశాలు పాటించలేదంటూ ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎలక్టోరల్ బాండ్లను సవాల్ చేస్తూ సీపీఐ(ఎం), ఏడీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎలక్టోరల్ బాండ్స్ వివరాలు వెల్లడించిన ఎస్‌బీఐ, ఆ ...11లో

దాడుల తర్వాతనే..

41 కంపెనీల నుంచి బీజేపీకి విరాళాలు 2లో..

18 కంపెనీల నుంచే రూ.2,010కోట్లు!

ఎన్నికల బాండ్ల గుట్టు బహిర్గతం

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో 11లో..

పదోన్నతులకు ఎన్నికల ఎఫెక్ట్

- పార్లమెంటు ఎలక్షన్ల తర్వాతే ప్రమోషన్లు
- మల్టీజోన్-2 జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల ఆందోళన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గెజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్‌ఎం) గ్రేడ్-2 పదోన్నతులకు పార్లమెంట ఎన్నికల ప్రక్రియ ఆటంకంగా మారనుంది. శనివారం ఆ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. దీంతో పదోన్నతులు చేపట్టేందుకు అవకాశముండదు. దీంతో పార్లమెంటు ఎన్నికల తర్వాతే మల్టీజోన్-2 పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ...11లో

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ

- చిన్నారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు
- సభ్యులుగా కోదండరామ్, దివ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలతోపాటు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యులతో ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి కమిటీ వేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ జీ చిన్నారెడ్డి నేతృత్వంలో టీజేఏసీ మాజీ చైర్మెన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కోదండరామ్, ఐఏఎస్ అధికారి దివ్యను సభ్యులుగా నియమించారు. ఈనెల 10న రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ప్రత్యేకంగా సమావేశమైన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా సంఘాల ప్రతినిధులు ఇచ్చిన ...11లో

మిషన్‌భగీరథపై విజిలెన్స్

రాష్ట్ర కార్యాలయంలో సోదాలు

- గణాంక అధికారితో భేటీ
- సమాచారం కోసం లేఖ
- కార్డులు సమర్పించాలని ఆదేశం
- ఇప్పటికే నిజామాబాద్‌లో తనిఖీలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఆయా ప్రభుత్వ శాఖల కార్యకలాపాలపై దృష్టిపెట్టింది. పాత బీఆర్ఎస్ సర్కారు హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, పథకాల్లో చోటుచేసుకున్న అవినీతిని వెలికితీసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ) పరిధిలో పనిచేసే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు ఆదేశాలు జారీచేశారు. అక్రమాలను బయటపెట్టి విచారణ చేయడం ద్వారా ఎన్నికల్లో ప్రజలకు చెప్పిన వాగ్దానాలను నెరవేర్చాలనే ఆశాభావంతో భావిస్తున్నది. ఇప్పటికే సాగునీటిపారుదల శాఖలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇద్దరు ఉన్నతాధికారులను ఇంటికి పంపిన ప్రభుత్వం, తాజాగా మిషన్ భగీరథలో తీగలాగేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలోని పౌరులందరికి ఉచితంగా తాగునీటిని అందించేందుకుగాను బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ ప్రాజెక్టును చేపట్టి పూర్తి చేసింది. దాదాపు రూ.35,300 కోట్లు ఖర్చు చేసింది. అయితే ఇందులో



అవినీతి,అక్రమాలు జరిగాయని అరోపణలు, విమర్శలు వచ్చిన నేపథ్యంలో విచారణకు శ్రీకారం చుట్టింది. సహకరించాలంటూ మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు గురువారం లేఖ రాసింది. ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియకు సంబంధించి రికార్డులు అందజేయాలని విజిలెన్స్ శాఖ కోరింది. నోట్ ఫైళ్లు, టెండర్ ఎవాల్యుయేషన్, టెండరు కమిటీ అనుమతులు, లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్(ఎల్‌ఓఏ) తదితర దస్త్రాలను విచారణకు సమకూర్చాలని కోరింది. ఇంట్రా విలేజ్ నెట్‌వర్క్‌కు చెందిన సర్క్యులర్లు, జీవోలు ఇతర సమాచారం ...11లో

ఖమ్మంలో హస్తం పంచాయితీ..!

కాంగ్రెస్ ఎంపీ సీటుపై సందిగ్ధత

పెద్ద నేతల చుట్టూ చక్కర్లు

- మంత్రుల కుటుంబీకుల్లో ఎవరికి ఇవ్వాలో తెలియని స్థితి
- ఒకరికిస్తే మరొకరి సహకారంపై అనుమానం
- మధ్యేమార్గం ఎంచుకున్నా సమన్వయంపై సందేహాలు
- అధిష్టానానికి సవాల్‌గా టిక్కెట్ కేటాయింపు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఖమ్మం పార్లమెంట్ టిక్కెట్ కేటాయింపు కాంగ్రెస్ అధిష్టానానికి సవాల్‌గా మారింది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు, మద్దతుదారులు మొన్నటి ఎన్నికల్లో భారీ విజయాలను సాధించడంతో ఈ సీటుపై ఆసక్తి తారాస్థాయికి చేరింది. ఓవైపు ముగ్గురు మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తమ కుటుంబీకుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా మరోవైపు ఇతర ఆశావహులు సైతం కాంగ్రెస్ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంత్రుల కుటుంబీకుల్లో ఏ ఒక్కరికి ఇచ్చినా మిగిలిన ఇద్దరు మంత్రులు ఏ మేరకు సహకరిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతానికి ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయం ఉంది. భవిష్యత్తులోనూ వీరి మధ్య పరస్పర సహకారం కొనసాగటం ఈ టిక్కెట్ కేటాయింపుపైనా ఆధారపడి ఉంటుందనే చర్చ పార్టీ శ్రేణుల్లో కొనసాగుతోంది.

టిక్కెట్ కోసం జోరుగా పైరవీలు..

ఖమ్మం ఎంపీ టిక్కెట్ కోసం జోరుగా పైరవీలు కొనసాగుతున్నాయి. మంత్రులు తమ కుటుంబీకుల కోసం ప్రయత్నాలు సాగిస్తూనే.. తమ వారికి దక్కని పక్షంలో ఎవరికి ఇవ్వాలో కూడా సూచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎన్టీవీ అధినేత నరేంద్రచౌదరిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం తీసుకువెళ్లడం చర్చనీయాంశమైంది. అయితే ఇది టిక్కెట్ కోసం కాకపోవచ్చు.. మర్యాదపూర్వకంగా అయివుండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు వీవీసీ సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ కూడా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మొన్న కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిస్తే...గురువారం రాయచూర్‌లో రాహుల్‌గాంధీని కలిసినట్లు తెలుస్తోంది. ఖమ్మం టిక్కెట్ విషయంలోనే తనకున్న అర్హతలను వివరిస్తూ.. మాజీ ఎంపీ వి.హనుమంతరావు సైతం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కపై ఇటీవల విమర్శలు చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుంకుమార్ సైతం కొద్దిరోజుల క్రితం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మం టిక్కెట్‌పై తనకున్న ఆసక్తిని వెల్లడించారు. రేణుకాచౌదరిని రాజ్యసభకు ఎంపిక చేసినా ఖమ్మం సీటుపై ...11లో

సంపాదకీయం


తెలంగాణ వీరులదే

సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముందు సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ "విమోచనదినం"గా జరపాలని నోటిఫికేషన్ జారీచేసింది కేంద్ర ప్రభుత్వం. మహోన్నత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సెప్టెంబర్ 17కు గల ప్రత్యేకత ఎవరూ కాదనలేనిదే. జాతికి గర్వకారణమైన ఆ పోరాటఖ్యాతిని తస్కరించి దానికి వక్రభాష్యాలు చెపుతూ, విశాల ప్రజామోదమున్న ఆ చారిత్రక సందర్భాన్ని తమ రాజకీయ ప్రయోజ నాలకు వాడుకోజూడటమే ఆక్షేపణీయం. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం చేస్తున్నది అదే. ఇప్పటికే సెప్టెంబర్ 17 వచ్చిందంటే వీరి "పరివారం" నిత్యం "విమోచనదినం" పేరుతో అనేకానేక అసత్య ప్రచారలకు పూనుకుంటోంది.

> కమ్యూనిస్టుల సాయుధ పోరాటం ముందు నిజాం తలవంచక తప్పదని తేలిపోయాకే భారత యూనియన్ సైన్యాలు రంగప్రవేశం చేసాయి. ఎందుకంటే ఇక్కడ ప్రజలు గెలిస్తే తెలంగాణ కమ్యూనిస్టుల చేతిలోకి వెళుతుందనీ, అది రేపు తమ ఢిల్లీ కోటను కూడా ముట్టడిస్తుందనే భయం వారిది. నిజం చెప్పాలంటే ఇది యూనియన్ సైన్యాలు తెలంగాణ ప్రజల నుండి నిజాం రాజుకు కల్పించిన విమోచన. తద్వారా కమ్యూనిస్టు ఉద్యమ ప్రకంపనలు హస్తినదాకా చేరకుండా చూసుకోవడమే నాటి నెహ్రూ ప్రభుత్వ లక్ష్యం.

ఇప్పుడు ప్రభుత్వమే ఆ అబద్ధాలను అధికారికం చేస్తూ భవిష్యత్ తరాలకు అందించజూస్తోంది.

విచిత్రమేమిటంటే వీరెవరూ ఈ పోరాటంలో ఒక్క నెత్తురుబొట్టు చిందించినవారూ కాదు. చుక్క చెమట రాల్చినవారూ కారు! కానీ కులమతాల కతీతంగా తెలంగాణ ప్రజలు లిఖించిన త్యాగాల చరిత్రకు మతం రంగు పులుముతున్నారు. ఇది హిందూ ప్రజలకూ ముస్లిం రాజుకూ మధ్య యుద్ధంగా చిత్రిస్తూ వక్రభాష్యాలు చెపుతున్నారు. "ముస్లింల పాలన కింద ఉన్న హిందూ ప్రజలకు 1948 సెప్టెంబర్ 17న భారత ప్రభుత్వం విమోచన కలిగించింది" అన్న అశాస్త్రీయ వాదనను ముందుకు తెస్తున్నారు. అసలు హైదరాబాద్ సంస్థానం ముస్లిం పాలన కింద ఉండేదన్నదే అర్థసత్యం. పాలకుడు ముస్లిం కావొచ్చు... అతడి మతం ఇస్లాం కావొచ్చు... కానీ ఆ రాజు ఆధారపడి పాలన సాగించింది హిందూ భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్ల మీదే. ప్రజలు ప్రత్యక్షంగా దోపిడీకి, విపరీతమైన పీడనకు గురయింది వీరి చేతుల్లోనే. అత్యంత క్రూరులూ మతోన్మాదులైన రజాకార్ మూకలన్నిటికీ ఈ హిందూ దొరల గడీలలోనే విడిది. అక్కడే తిని, తాగి ఈ కసాయి మూకలు ప్రజలమీద కిరాతక దాడులు చేసేవి అన్న సంగతి మరువగలమా? రజాకార్ల సైన్యాధ్యక్షుడు ఖాసీం రజ్వీ ముస్లిం అయితే,వాడికి ఆశ్రయమిచ్చిన విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి హిందువేగా! అతని దాష్టీకానికి



బలైన బందగీ ముస్లిం కాదా? లక్షల ఎకరాలకు అధిపతిగా జనాల మూల్గులు పీల్చిన జన్నారెడ్డి ప్రతాపరెడ్డి ఎవరు? పసిబిడ్డల తల్లుల్ని మోదుగుడొప్పల్లో పాలు పిండించి పరీక్షించిన పసునూరి రామ్మోహన్‌రావు ఎవరు? నీర్మాల నియంత లింగాల నర్సింహారెడ్డి ఎవరు? కోడూరి కర్కోట కుడు గడ్డం నర్సింహారెడ్డి ఎవరు? వీరి అమానుషాలను ఎండగట్టిన షోయబుల్లాఖాన్ ఎవరు? వీరి దురాగతాలను ప్రతిఘటించిన మఖ్దూం మొహియుద్దీన్ ఎవరు? ఈ చరిత్రనిండా ఇటువంటివెన్నో ఉదాహరణలు... వీటిలో "పీడకులు పీడితులు" అన్న విభజనకు తప్ప "హిందువులు ముస్లింలు" అనే విభజనకు ఆస్కారముందా?

ఇక 1948 సెప్టెంబర్ 17న జరిగింది విమోచనే అయితే, 1950 జనవరి 26 దాకా హైదరాబాద్ రాజ్య పాలన నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పేరు మీదనే ఎందుకు సాగినట్టు? ఆ తరువాత 1956 దాకా ఆయన రాజప్రముఖ్ (గవర్నర్)గా ఎలా కొనసాగినట్టు? దుర్మార్గమైన ఫ్యూడల్ నిరంకుశ పాలన సాగించి, ప్రజల రక్తమాంసాలు పిండి, పన్నులు వసూలు చేసి, ఆనాటికి ప్రపంచంలోనే అత్యంత ధనికులలో ఒకనిగా చలామణీ అయిన నిజాం ఆస్తులను ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? పైగా రాజభరణాల పేరుతో ఇచ్చిన కోట్ల రూకల్ని నాడు ఇందిరా గాంధీ రద్దు చేస్తే దాన్ని పూర్తిగా వ్యతిరేకించింది జనసంఘం, నేటి బీజేపీ మాతృక. ఈ ప్రశ్నలకు సర్కారు వారు జవాబు చెప్పగలరా? అదే నిజమైతే ఆ తరువాత కూడా ప్రజలు సాయుధ పోరాటం ఎందుకు కొనసాగించినట్టూ? ఎందుకంటే ఆ రోజుతో ఏదో మార్పు వచ్చినట్టు ప్రజలు భావించలేదు గనుక. వీరు చెపుతున్నట్టు 1948 సెప్టెంబర్ 17న విమోచన పూర్తయితే 1951 దాకా పటేల్ పటాలాలు తెలంగాణను ఎందుకు వీడలేదు? ఎందుకంటే అవి వచ్చింది నిజాం రాజు కోసం కాదు గనుక. వాటి "ఆపరేషన్ పోలో" అసలు లక్ష్యం కమ్యూనిస్టులే గనుక. తెలంగాణ ప్రజలపై, కమ్యూనిస్టులపై నిజాం పోలీసులు, రజాకారు మూకలకంటే యూనియన్ సైన్యాల హత్యలూ అకత్యాలే ఎక్కువ గనుక దీనిని బట్టి అర్థమవుతున్నదేమిటి? ఏలినవారు చెపుతున్నట్టు ఇది విమోచనే అయితే ఎవరి నుండి ఎవరికి విమోచన? ఈ చారిత్రక వాస్తవా లన్నీ విస్మరించి, వక్రీకరించి "విమోచనగానా లాపన" చేయడంలో వీరికి కొన్ని నిర్దిష్టమైన ప్రయోజనాలున్నాయన్న సంగతి తెలియనిది కాదు.

ఇక్కడ గమనించవలసిన అసలు విషయం ఏమిటంటే.. కమ్యూనిస్టుల సాయుధ పోరాటం ముందు నిజాం తలవంచక తప్పదని తేలిపోయాకే భారత యూనియన్ సైన్యాలు రంగప్రవేశం చేసాయి. ఎందుకంటే ఇక్కడ ప్రజలు గెలిస్తే తెలంగాణ కమ్యూనిస్టుల చేతిలోకి వెళుతుందనీ, అది రేపు తమ ఢిల్లీ కోటను కూడా ముట్టడిస్తుందనే భయం వారిది. నిజం చెప్పాలంటే ఇది యూనియన్ సైన్యాలు తెలంగాణ ప్రజల నుండి నిజాం రాజుకు కల్పించిన విమోచన. తద్వారా కమ్యూనిస్టు ఉద్యమ ప్రకంపనలు హస్తినదాకా చేరకుండా చూసుకోవడమే నాటి నెహ్రూ ప్రభుత్వ లక్ష్యం. ఈ చారిత్రక సత్యాన్ని విస్మరణకు గురిచేయడం, దానిని హిందూ ముస్లిం పోరాటంగా చిత్రించడం, తద్వారా తెలంగాణలో తన రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం నేటి మోడీ ప్రభుత్వ లక్ష్యం. అందులో భాగమే ఈ నోటిఫికేషన్. ఇది ముమ్మాటికీ చరిత్రకు ద్రోహం చేయడమే.

పీడకులకు పారిస్ కమ్యూన్ ఎప్పటికీ ఒక పీడకలే...



ఆర్. రఘు
9490098422

కనీవినీ ఎరుగని, అంతం కానరాని ఓ సుదీర్ఘ ఆర్థిక సంక్షోభం నేడు ప్రపంచాన్ని కుదిపేస్తున్నది. పర్యవసానంగా రాజకీయ, సామాజిక రంగాలలో తీవ్రమైన అనిశ్చితి నెలకొంది. పెట్టుబడిదారీ ప్రపంచానికి ఇవి చివరి రోజులని, ఆ వ్యవస్థకు కొమ్ముకాసే ఆర్థిక పండితులే ప్రకటిస్తు న్నారు. ఆ వ్యవస్థను ఇక కాపాడటం కోసం, మితవాద ఫాసిస్టుల కోసం వీరు ఎదురు చూస్తున్నారు. గతంలో ఇటువంటి పరిస్థితులను అధిగమించటానికి వామపక్ష విప్లవ శక్తులు ప్రభోదించే సోషలిస్టు పరిష్కారం మళ్లీ తలెత్తుతుందేమోనని, ప్రజలు ఆ వైపు చూస్తారేమో నని భయకంపితమవుతున్నది పెట్టుబడిదారీ వ్యవస్థ. "పారిస్ కమ్యూన్, కొద్దికాలం నిలబడ్డ విప్లవం. సంపన్నులపై పేదలు సామాజిక న్యాయం కోసం

> జర్మనీకి తలొగ్గిన ఫ్రెంచ్ ప్రభుత్వం తన దేశంలో తమ దేశ గౌరవం కోసం నిలబడి ప్రజలకు ఓ మంచి ప్రభుత్వాన్ని అందిస్తున్న కార్మికవర్గ రాజ్యాన్ని సహించలేక ఆ జర్మనీ సైన్యాన్ని సహకారంగా తీసుకొని పారిస్ నగరాన్ని, దాన్ని పాలిస్తున్న కార్మిక రాజ్యాన్ని అంతం చేసి పెట్టమని జర్మన్ ప్రభువులని వేడుకున్నది ఫ్రెంచి పెట్టుబడిదారీ వర్గం. దీన్ని కార్ల్ మార్క్స్ మొదటి ఇంటర్నేషనల్ (అంతర్జాతీయ కార్మిక సంస్థ)లో ప్రసంగిస్తూ "పెట్టుబడిదారుల అంతర్జాతీయత ఎలా ఉంటుందో మనం చూస్తున్నాం. దానికి ప్రతిగా కార్మిక వర్గ అంతర్జాతీయత ఒక్కటే మన ఆయుధం. పాతకాలపు భూస్వామ్య ప్రభువులకి తామే నిజమైన వారసులమని బూర్జువా వర్గం భావిస్తున్నది. అందువలన పేద ప్రజలపై ప్రయోగించడానికి ఏ ఆయుధాన్ని అయినా తాము వాడుకోవచ్చు. పేదలు ఏ ఆయుధాన్ని వాడినా అది మాత్రం మహా నేరం" అని పేర్కొన్నారు.

జరిపిన విప్లవం. అది ఓ అద్భుతమైన రాజకీయ కల. మారణకాండతో అంతమైంది కానీ, చావటానికి నిరాకరించిన స్వప్నమది. ఆ కల రానున్న శతాబ్దాల లో విప్లవాలకు ఉత్తేజాన్ని ఇస్తూనే ఉంటుంది." అని గొప్పగా వర్ణించాడు యేల్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్.

చావ నిరాకరించిన కల పారిస్ కమ్యూన్

భూస్వామ్య, రాచరిక పాలనని అంతం చేసి దాని స్థానంలో పెట్టుబడిదారీ వ్యవస్థ స్థిరపడటం మొదలైన కాలంనాటిది పారిస్ కమ్యూన్. 1789 ఫ్రెంచి పెట్టుబడిదారీ విప్లవం ప్రపంచాన్నే ఉత్తేజపరిచింది. అది మొదలుకొని ఐరోపా ఖండంలో పెట్టుబడిదారీ విప్లవాలు ప్రారంభమైనాయి. అయితే పెట్టుబడిదారీ వర్గానికి ఆదిలోనే హంసపాదులా ఆ వ్యవస్థలోని డొల్లతనాన్ని బట్టలూడదీసి నిలబెట్టింది పారిస్ కార్మిక వర్గం. 1871 మార్చి 18న ప్రారంభమై 72 రోజుల పాటు సాగిన ఈ తొలి కార్మికవర్గ రాజ్యం ప్రపంచ మానవాళి చరిత్రలో ఓ మరుపురాని చారిత్రక ఘటనగా నిలిచిపోతుంది. పారిస్ కమ్యూన్ నేటికీ పెట్టుబడి దారు లకి, ముఖ్యంగా ఐరోపా ఖండంలోని పెట్టుబడిదారీ వర్గానికి ఓ పీడకలలా మిగిలిపోయిందని, నేటికీ పారిస్ కమ్యూ న్ జ్ఞాపకాలపై ఫ్రాన్స్‌లోనే కాదు, అనేక పాశ్చాత్య దేశాలలో విషం గక్కు తున్న పరిస్థితిచూస్తే మనకు అర్థమవు తుంది.


పారిస్ కమ్యూన్ ఎందుకు పుట్టింది? ఏం చేసింది?

పెట్టుబడిదారీ వ్యవస్థ ఆయా దేశాలలో స్థిరపడడానికి రాచరిక వ్యవస్థలను కూల్చేందుకు ప్రజా బాహుళ్యాన్ని, అందులో భాగంగా విస్తరిస్తున్న కార్మికవర్గాన్ని కూడా తీసుకుపోవడానికి మతం పైన, మూఢాచారాల పైన ఒక్క మాటలో చెప్పాలంటే పురాతన భావాలపైన యుద్ధం ప్రకటించింది. పెనవేసుకుని ఉన్న ఫ్యూడల్, రాచరిక పాలన మతాధిపత్యాలను ఎదిరించింది. ఈ క్రమంలోనే లౌకిక తత్వం (సెక్యులరిజం) అంటే రాజ్యాన్ని, మతాన్ని విడగొట్టాలని నినదించింది. ప్రజాస్వామ్య జాతీయ రిపబ్లిక్‌లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. నిజానికి జనం పెట్టుబడిదారీ వ్యవస్థ ముందుకు తెచ్చిన ఆధునిక భావాల వైపు, శాస్త్రీయ దృక్పథం వైపు, పార్లమెంటరీ రిపబ్లిక్ వ్యవస్థల వైపు, లౌకిక వాదాల వైపు పెద్ద ఎత్తున ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలోనే పెట్టుబడిదారీవర్గం లేవనెత్తిన జాతీయవాదం బలంగా ముందుకు వచ్చింది.

ఈ నేపథ్యంలో దీనికి పూర్తి విరుద్ధమైన భావాల ప్రతిరూపంగా ఏర్పడిన కమ్యూనిస్టు లీగ్ రూపాంతరం చెంది 1864లో మొదటి అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ఫస్ట్ ఇంటర్నేషనల్) ఏర్పడింది. కార్ల్‌మార్క్స్, ఎంగెల్స్ ఈ సంస్థ ఆధారంగా పెట్టుబడిదారీ వ్యవస్థను చీల్చి చెండాడటం ప్రారంభించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ముందుకు తెచ్చిన జాతీయ వాదానికి ప్రతిగా కార్మిక వర్గ అంతర్జాతీయతని ముందుకు తెచ్చారు. భూస్వామ్య వ్యవస్థను పెట్టుబడిదారీ వ్యవస్థ కూల్చినట్లుగానే, పెట్టుబడిదారీ వ్యవస్థను కార్మిక వర్గం కూల్చి తీరుతుందని, పెట్టుబడిదారీ వర్గం ముందుకు తెచ్చిన ప్రతి నినాదంలోని, దాని వర్గ ప్రయోజనాల బండారాన్ని ఎండగట్టడం మొదలెట్టింది ఫస్ట్ ఇంటర్నేషనల్.

జర్మనీకి, ఫ్రాన్స్‌కి మధ్య యుద్ధం మొదలైంది. అప్పటికే ఫ్రాన్స్ పెట్టుబడిదారీ వర్గం కూలిపోయిన రాచరిక వ్యవస్థపై తాము ప్రజాస్వామ్య రిపబ్లిక్‌ను నిర్మిస్తామని వాగ్దానం చేసి ఉన్నారు. కానీ జర్మనీ సైన్యం దాడి ముందు నిలవలేక చేతులెత్తేసి ఫ్రాన్స్‌ని జర్మనీకి పాదాక్రాంతం చేయడానికి నిశ్చయించారు. ఈ క్రమంలో ఆ దేశంలోని అనేక పట్టణాలలో ప్రజలు ప్రతిఘటన ప్రారంభించారు. ల్యాన్, సెయింట్-ఎటన్నే, మార్సిల్లే, టౌలేస్ వంటి నగరాలలో ఈ ప్రతిఘటన సాగింది. తమపై విజయం సాధిస్తున్న జర్మనీ శత్రువుల కన్నా ఈ నగరాలలో కార్మికుల ప్రతిఘటన ఫ్రెంచి పెట్టుబడి దారులకు కోపం కలిగించింది. జర్మనీతో శాంతి ఒప్పందం పేరిట ఈ ప్రతిఘటనలన్నింటినీ వెంటనే అణచివేసింది. కానీ ఫ్రాన్స్ రాజధాని అయిన పారిస్ నగరంలో కార్మికుల నాయకత్వాన సాగిన ప్రజా ప్రతిఘటనను ఫ్రెంచ్ ప్రభుత్వం అణచలేకపోయింది. దేశభక్తితో జర్మన్ సైన్యానికి తమ దేశాన్ని పాదాక్రాంతం చేయడం అంగీకరించని పారిస్ ప్రజలు ప్రారంభించిన ఈ ప్రతిఘటన తిరుగుబాటుగా, ఒక విప్లవంగా మారి మార్చి 18న మొత్తం పారిస్ నగరాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నది.

మార్చి 26న పారిస్ మున్సిపాలిటీకి కార్మిక వర్గం ఎన్నికలు నిర్వహించింది. కార్మిక ప్రభుత్వం ఏర్పడింది (పారిస్ కమ్యూన్). ప్రభుత్వాన్ని ఏర్పరిచిన వెంటనే మతాన్ని రాజకీయాలను విడగొడుతూ తీర్మానం చేసింది. ఫ్యూడల్ వ్యవస్థ మతాధిపతులకి, మత సంస్థలకి కట్టబెట్టిన వేల ఎకరాల భూములను స్వాధీనం చేసుకుంది. మూతబడి ఉన్న పరిశ్రమలను తెరిపించి కార్మిక సహకార సంస్థలకు అప్పగించింది. బేకరీలలో రాత్రి షిఫ్టులు రద్దు చేసింది. స్త్రీ



పురుషులకు సమాన వేతనం ప్రకటించింది. పెట్టుబడిదారీ దేశాలలో కనీస వేతనం ప్రకటించడమే గొప్పగా చెప్పుకుంటారు. (నిజానికి దాన్ని కూడా అమలు చేయరు) కానీ గరిష్ట వేతనాన్ని 6000 ఫ్రాంకులుగా నిర్ణయించింది. అలాగే ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ఎవరైనా పారిస్ నగరంలో ప్రకటించబడ్డ కనీస వేతనాన్ని తమ వేతనంగా అంగీకరించి రాతపూర్వకంగా సమర్పిస్తేనే అర్హత ఉంటుందని తీర్మానించింది. ఈ కార్మిక వర్గ ప్రభుత్వం తమది ప్రజాస్వామ్య రిపబ్లిక్ కాదు. సోషలిస్ట్ రిపబ్లిక్ అని ప్రకటించింది. ఆ విధంగా ప్రజాస్వామ్య రిపబ్లిక్‌ల గురించి ఓ పక్క ప్రపంచాన్ని శాసించే శక్తిగా ఎదుగుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థలో పుట్టిన కార్మిక వర్గం తాను పెట్టుబడిదారీ వ్యవస్థని కూల్చగలిగిన శక్తే గాదు, ఆ వ్యవస్థకు భిన్నమైన, అత్యంత శక్తివంతమైన, దోపిడీ రహితమైన, సామాజిక న్యాయం, సమానత్వంతో కూడిన వ్యవస్థను నిర్మించగలదు అని నిరూపించింది పారిస్ కమ్యూన్.

దీనితో దేశ దేశాలలోని నాటి పెట్టుబడిదారీ పాలకులు భయకంపితులయ్యారు. వెను వెంటనే ఒకటయ్యారు. ప్యారిస్ కమ్యూన్‌పై విరుచుకు పడ్డారు. పారిస్ నగరాన్ని ఈ చీకటి శక్తులన్నీ కలిసి మట్టు పెట్టడానికి ఉపక్రమించాయి. జర్మనీకి తలొగ్గిన ఫ్రెంచ్ ప్రభుత్వం తన దేశంలో తమ దేశ గౌరవం కోసం నిలబడి ప్రజలకు ఓ మంచి ప్రభుత్వాన్ని అందిస్తున్న కార్మికవర్గ రాజ్యాన్ని సహించలేక ఆ జర్మనీ సైన్యాన్ని సహకారంగా తీసుకొని పారిస్ నగరాన్ని, దాన్ని పాలిస్తున్న కార్మిక రాజ్యాన్ని అంతం చేసి పెట్టమని జర్మన్ ప్రభువులని వేడుకున్నది ఫ్రెంచి పెట్టుబడిదారీ వర్గం. దీన్ని కార్ల్ మార్క్స్ మొదటి ఇంటర్నేషనల్ (అంతర్జాతీయ కార్మిక సంస్థ) లో ప్రసంగిస్తూ "పెట్టుబడిదారుల అంతర్జాతీయత ఎలా ఉంటుందో మనం చూస్తున్నాం. దానికి ప్రతిగా కార్మిక వర్గ అంతర్జాతీయత ఒక్కటే మన ఆయుధం. పాతకాలపు భూస్వామ్య ప్రభువులకి తామే నిజమైన వారసులమని బూర్జువా వర్గం భావిస్తున్నది. అందువలన పేద ప్రజలపై ప్రయోగించడానికి ఏ ఆయుధాన్ని అయినా తాము వాడుకోవచ్చు. పేదలు ఏ ఆయుధాన్ని వాడినా అది మాత్రం మహా నేరం" అని పేర్కొన్నారు. మే 28తో పారిస్ కమ్యూన్ పూర్తిగా కూల్చివేయబడింది. 30 వేల మందికి పైగా కమ్యూనార్డ్స్‌ని నగర వీధుల్లో కాల్చి చంపారు. లక్ష మందికి పైగా ఇతర దేశాలకు వలసలు పోయారు. వేల మందిని జైళ్లల్లో నిర్బంధించారు. ఆ విధంగా కార్మికవర్గ తొలి రాజ్యాన్ని అణచివేసి వెంటనే పెద్ద ఎత్తున దుష్ప్రచారం ప్రారంభించారు. శాంతియు తంగా అధికారంలోకి వచ్చిన కార్మిక రాజ్యాన్ని రక్తపుటేరుల్లో ముంచిన తాము శాంతికాముకులు గాను, ప్రతిఘటించిన దేశభక్తియుత పేద ప్రజలను, మూగజీవులను అరాచక వాదులుగా, రాక్షసులుగా నాడే కాదు నేటికీ పాలకులు చిత్రిస్తూనే ఉన్నారు.

ఈ విధంగా పారిస్ కమ్యూన్ పతనానంతరం మార్క్స్ "బానిసలు, పతితులు, యజమానులపై ఎదురు తిరిగిన నాడు బూర్జువా వ్యవస్థ నాగరికత, న్యాయం నగ్న రూపంలో వెల్లడవుతాయి. ఈ నాగరికత, న్యాయాలు ఎట్టి ముసుగులేని కర్కశత్వానికి, చట్టరహితమైన ప్రతీకార వాంఛకు తార్కాణమవుతాయి. ఉత్పత్తిదారునికి, సంపదను స్వాహా చేసే పరాన్న భుక్కులకు జరిగే వర్గ పోరాటంలో ప్రతి నూతన సంక్షోభం ఈ వాస్తవాన్ని మరింత స్పష్టంగా బయటపెడుతుంది, వర్సైల్స్ సైన్యాలు (ప్రభుత్వ సైన్యాలు) పారిస్‌లో ప్రవేశించిన తర్వాత పారిస్ స్త్రీలు, పురుషులు, పిల్లలు ఎనిమిది రోజులపాటు అనేకమైన త్యాగాలతో, ధైర్య సాహసాలతో పోరాడారు. వారి లక్ష్యం ఎంతటి ఉన్నతమైనదో వారి ప్రతిఘటనే చిహ్నం. ప్రభుత్వ సైనికులు నగరంలో సాగించిన అమానుష హత్యాకాండ ఈ కిరాయి మూకలు ప్రాతినిధ్యం వహించే నాగరికతలోని పాశవికత్వాన్ని వెల్లడిస్తుంది. యుద్ధమైన తరువాత మృతుల శవాల గుట్టలను తొలగించడమే ఒక పెద్ద సమస్యగా చేసిన వీరి నాగరికత ఎలాంటిదో చెప్పనక్కరలేదు" అని మార్క్స్ ఆ సమావేశంలో నిప్పులు చెరిగాడు.

కమ్యూన్‌కి మరణం లేదు

తిరిగి మార్క్స్ మాటల్లోనే చెప్పాలంటే "శ్రమజీవుల పారిస్ దాని కమ్యూన్‌తో సహా నూతన సమాజపు వేగుచుక్కగా చిరస్థాయిగా నిలుస్తుంది. దాని మృతవీరులు కార్మికవర్గ హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటారు". పారిస్ కమ్యూన్ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని కారల్‌మార్క్స్ మరో అత్యంత ప్రముఖమైన నేటికీ అవసరమైన విశ్లేషణ మన ముందుంచారు. కమ్యూన్ పార్లమెంటరీ సంస్థగా కాక, కార్యాచరణ సంస్థగా ఉండాలి. పార్లమెంట్‌లో ప్రజలకు ప్రాతినిధ్యం వహించి తమను అణగదొక్కవలసింది పాలకవర్గంలోని ఏ

> 21వ శతాబ్దంలో ఓ పక్క శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అపారంగా పెరిగింది. ఆహార ఉత్పత్తులు, పారిశ్రామిక అభివృద్ధి గణనీయంగా పెరుగుతున్నాయి. అయినా ఆకలిచావులు, నిరుద్యోగం, అనారోగ్యం, అసమానతలు, అరాచకాలు అదుపు లేకుండా పెరిగి పెట్టుబడిదారీ ప్రపంచాన్నే వెక్కిరిస్తున్న పరిస్థితి అన్ని దేశాలలోనూ, మన దేశంలోనూ చూస్తున్నాము. పర్యవసానంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కావాలని పీడిత ప్రజలు, శ్రామిక జనం ప్రత్యేకించి యువతీ యువకులు వెతుకులాట ప్రారంభించారు. వెనిజులా వంటి లాటిన్ అమెరికా దేశాలలో సోషలిస్టు తరహా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. ఉదారవాద ప్రజాస్వామ్యం కండ్లు తేలేస్తున్న నేటి ప్రపంచంలో సోషలిజం వైపు పురోగమించడమే మన కర్తవ్యం.

సభ్యుడు అనేదాన్ని ఐదేండ్లకు, ఆరేండ్లకు ఒక్కసారి నిర్ణయించుకునేందుకు ఉపయోగించిన మాదిరిగా కాకుండా, ఒక యజమాని తన వ్యాపారానికి కార్మికులను, ఫోర్‌మెన్‌లను, అకౌంటెంట్లను ఎన్నుకునే మాదిరిగా కమ్యూన్‌లో ఏర్పడిన ప్రజలకు ఉపకరించాలని, అంటే వారిని వెనక్కి పిలిపించే హక్కు ఎన్నుకున్న ప్రజలకు ఉండాలని ఆయన ప్రకటించారు. నిజానికి పారిస్ కమ్యూన్ ప్రజా ప్రతినిధులనే కాదు న్యాయమూర్తులు, సైన్యాధికా రులు, పోలీసు, మున్సిపల్ అధికారులని కూడా ప్రజలు వెనక్కి పిలిచే (రీ కాల్) హక్కును చట్టబద్ధం చేసింది. పారిస్ కమ్యూన్ స్ఫూర్తితో దాని అడుగు జాడలలో మారిన సామాజిక పరిస్థితుల్లో 1917 రష్యన్ విప్లవం, 1949 చైనా విప్లవం, ఆ తరువాత వియత్నాం, క్యూబా తదితర దేశాలలో విప్లవాలు జయప్రదమయ్యాయి.

21వ శతాబ్దంలో ఓ పక్క శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అపారంగా పెరిగింది. ఆహార ఉత్పత్తులు, పారిశ్రామిక అభివృద్ధి గణనీయంగా పెరుగుతు న్నాయి. అయినా ఆకలిచావులు, నిరుద్యోగం, అనారోగ్యం, అసమానతలు, అరాచకాలు అదుపు లేకుండా పెరిగి పెట్టుబడిదారీ ప్రపంచాన్నే వెక్కిరిస్తున్న పరిస్థితి అన్ని దేశాలలోనూ, మన దేశంలోనూ చూస్తున్నాము. పర్యవసానంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కావాలని పీడిత ప్రజలు, శ్రామిక జనం ప్రత్యేకించి యువతీ యువకులు వెతుకులాట ప్రారంభించారు. వెనిజులా వంటి లాటిన్ అమెరికా దేశాలలో సోషలిస్టు తరహా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. ఉదారవాద ప్రజాస్వామ్యం కండ్లు తేలేస్తున్న నేటి ప్రపంచంలో సోషలిజం వైపు పురోగమించడమే మన కర్తవ్యం.

అందుకు పారిస్ కమ్యూన్ పతనానంతరం కమ్యూన్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన కవి యూజిన్ పోర్టర్ రాసిన అద్భుత గీతం ఈరోజు లెక్కలేనన్ని భాషల్లోకి తర్జుమా చేయబడి ఆలపించబ డుతున్న గీతమే 'అంతర్జాతీయ గీతం'. ఆ గీతంలో చెప్పినట్టు **"ఆకలిమంటలు మలమలలాడే అనాథ లందరూ... లేవండోయ్"** అంటూ నిరూపిం చాల్సిన సమయమాసన్నమైంది.

(మార్చి 18 పారిస్ కమ్యూన్ డే)

వెంటాడుతున్న మనువాదం!

ఒంటి నిండా
కాలకూట విషాన్ని నింపుకొని
పెదాలపై చిరునవ్వు ఒలికిస్తుంటాడు
పేరు ప్రతిష్ఠ కోసం
విశ్వ గురునని బయలుదేరాడు
విషాదాలు మనకు కొత్త కాదు చూడండి

భజనపరులతో
బాడుగ రాతలతో
కితాబులిప్పించుకొని
తన్మయత్వం పొందుతున్నాడు
కండ్లు పెద్దవి చేసుకుని చూడండి

సన్యాసిగా
ప్రపంచాన్ని చుట్టేయసాగాడు
భయమో, భక్తో తెలియదు కానీ,
ఒకప్పుడూ...
వీసాలివ్వని దేశాలిప్పుడూ
సాష్టాంగపడి పొర్లు దండాలెడుతున్నాయి
మనస్సు పెట్టి చూడండి

గోద్రా అల్లర్ల గాయాలింకా మానిందిలేదు
బిల్కిస్ బానో గాయాలు రెచ్చుతున్నయి
నరహంతకులకు పూలదండలు
హారతుల రాచ మర్యాదలు
అబ్బో...
ఉన్మాదమే సిగ్గు పడుతుంది కదా
కండ్లు మూసుకోకుండా చూడండి

ఆడబిడ్డల నగ్న ఊరేగింపుతో
సోయి రాలేదింక
వస్తదని ఆశాసలే లేదు
మణిపూర్ ఇంకా అగ్నై మండుతుంది
జాతుల తెగల మధ్య
మతాధిపత్యం బుసలు కొడుతుంది
ఇప్పుడైతే గుండె స్పందించడం
కోసం చూడండి

పుట్టుక మూలాలను
ప్రశ్నిస్తున్న పౌరసత్వం
మళ్లీ రగులుకుంటోంది
చలి మంటలేసుకొని కాషాయ గుంపొకటి
అధికారానికి నిచ్చెనేసింది
నిచ్చెనమెట్ల కింద నలిగిన
గాయాల నుండి చూడండి

మనువాదానికి
మనం నిప్పెట్టకపోతే
వాడు... కచ్చితంగా
రాజ్యాంగాన్ని తగలబెడుతాడు
వెంటాడుతాడు, వేటాడుతాడు
త్రిశూలాలు ఆయుధాలవుతాయి
గోద్రా అల్లర్లలో నిండు గర్భిణిని
చీల్చిన శూలాల గుర్తులున్నాయక్కడ
వెనుతిరిగి చూడండి

మానవ వాదాన్ని పాతరేసి
నిర్జీవమైన మనుస్మృతికి ప్రాణం పోస్తాడు
కుల మత విషబీజాలు
జవసత్వాలందిస్తాయి
అప్పుడూ.. నువ్వు నేను
నిరాశ్రయులమవుతాం
సరిగ్గా చూడకపోతే..
నిర్బంధ కేంద్రాల్లో
కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ
మానవవాదాన్ని నెమరేసుకుంటాం
ఇక చావు బతుకుల సంగతి సరేసరి!

- మామిండ్ల రమేష్ రాజా,
7893230218

140 కోట్లూ ఆయన కుటుంబమేనా?

"ఏక్ సౌ చాలిస్ కరోడ్ దేశ్ వాసి మేరా పరివార్ హై" అని భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకులు మోడీ అంటూ అందులో కొన్ని సమూహాలను, రాజకీయ ప్రత్యర్థులుగా శత్రు సమానులుగా చూడడం ఆశ్చర్యమే! నేడు నూటా నలభై కోట్ల కుటుంబసభ్యుల్లో మునుపెన్నడూ లేనంత విభజన, అభద్రత నెలకొన్నది.ఒక ప్రధానమంత్రి స్థానంలోని నాయకుడు తన దేశ జనాభా మొత్తాన్ని కుటుంబంగా భావించడం ఆశించ దగినదే. కానీ 140 కోట్ల జనాభాలో దాదాపు 15 శాతం ప్రజానీకానికి అధికార పార్టీ ప్రాతినిధ్యం వహించడం లేదు. ఇది పరిశీలించాల్సిన అంశం. ప్రజాస్వామ్యమంటే భాగస్వామ్య పరిపాలన మాత్ర మే కాదు, ప్రాతినిధ్య పరిపాలన కూడా. అంటే ప్రజాస్వామ్య పరిపాలనలో అన్ని ప్రాంతాల, జాతుల, ప్రజాప్రతినిధులు భాగస్వా ములై నిర్ణయాలను చేయాలి. షెడ్యూల్డ్ కులాలు తెగలకు కొన్ని నియో జకవర్గాల నుండి ప్రాతినిధ్యం వహించే అవ కాశాన్ని రాజ్యాంగంలో పొందుపరిచారు. దీనికి మూలం పూనా ఒడంబడికలో ఏర్పడిందని అంటారు. ఈ పరి పాటిని రాజకీయపార్టీలు స్వచ్ఛందంగా పాటించినప్పుడే సార్థకత.



జి. తిరుపతయ్య
9951300016

దేశంలో లోక్‌సభకు 545, రాజ్యసభకు 250 దాదాపు 795 సభ్యుల వరకు ప్రాతనిధ్యం వహిస్తున్నారు. అలాగే నాలుగు వేలకు పైగా శాసనసభ సభ్యులున్నారు. ఇందులో దాదాపు వెయ్యి మంది దాకా బీజేపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరందరిలో ఒక్క ముస్లిం అభ్యర్థి కూడా లేడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి కులాలలోని ఉపకులాల వారీగా కూడా అభ్యర్థులను ఎంపిక చేసుకునే వారు ఒక మతస్తులనుపూర్తిగా ఎందుకు విస్మరిస్తున్నట్టు? స్వాతంత్ర్య సంగ్రామంలో వీరోచితంగా పోరాడి అమరులైన అనేకమంది ముస్లింల చరిత్ర మనకు తెలుసు. హైదరాబాద్‌లో షోయబుల్లాఖాన్ చేతులు నరికేసినా సరే నిజాం నవాబును ఎదిరించిన తీరు మనకు తెలుసు. అండమాన్ జైల్లో 17 ఏండ్లు కఠిన కారాగారం అనుభవించి జైలు అధికారుల నిర్బంధాన్ని దునుమాడి తిరగబడిన ముజ్తబా హుస్సేన్ గురించి కూడా చరిత్ర పుటల్లో నిక్షిప్తమై ఉంది. 22 కోట్ల జనాభాను పూర్తిగా విస్మరిస్తే సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్ అనే నినాదం శూన్య ఫలితమే ఇస్తుంది. బీజేపీలోకి ముస్లిం నాయకులు రావడం లేదా, లేక ముస్లింలను బీజేపీ రానివ్వడం లేదా? సదరు మతస్తులను వెనకేసుకొచ్చేందుకు రాస్తున్న వ్యాసం కాదిది. అంత పెద్ద సమూహాన్ని అక్కున చేర్చుకోకుండా దేశ జనాభా మొత్తం నాకుటుంబమని చెప్పడం హాస్యాస్పదమవుతుందనేది భావన.

ప్రస్తుత పాలక రాజకీయ పార్టీ మూలాల్లోనే ఆ విభజన పూరిత విధానం వేళ్లూనుకుని ఉన్నది. 1925లో ప్రారంభమైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఒక్క శాఖతో మొదలై ఇప్పుడు దాదాపు 57 వేల శాఖలకు విస్తరించి నట్టు తెలుస్తోంది. ఈ శాఖలన్నీ ప్రతిరోజూ ఒక గంటపాటు వ్యాయామాలతో కూడిన డ్రిల్‌ను నిర్వహించి, భారతమాతకు సమర్పితమవుతూ ధ్వజ ప్రణామం చేస్తాయి. ఆర్ఎస్ఎస్ ప్రచారాల్లో ముఖ్యమైనది హిందువుల ఐక్యత. ముస్లింలు కాని వారంతా ఇందులో చేరతారు. ఈ దేశం హిందువులది ఇక్కడ ఇతరులకు చోటు లేదనే భావనను నూరిపోస్తారు. ఆర్ఎస్ఎస్‌లో కులాలకతీతంగా అందరూ సమానంగా భావింపబడతారనే భావన ఉన్నది. ఆటాపాటల్లో, సహపంక్తి భోజనాల్లో తారతమ్యాలు ఏవి ఉండవు. అయితే గమనించవలసిన అంశమేమంటే ఇస్లాం వ్యతిరేకతతో కూడిన జాతీయవాద దేశభక్తికి హిందువులంతా ఐక్యంగా ఉండాలని మాత్రమే బోధన జరుగుతుంది. అదే దాని మూలసూత్రం కూడా. మైనార్టీ మతాలతో పాటు కమ్యూనిస్టులను కూడా వ్యతిరేకిస్తుంటారు. కానీ, ఆర్థిక అసమానతలకు సంబంధించిన ఏ ఒక్క చర్చ ఉండకపోగా అలాంటి అసమానతలకు కులవ్యవస్థ ప్రధాన కారణమని గుర్తించే ప్రయత్నాలేవి జరగవు. అంతేకాకుండా కులవ్యవస్థను నిర్మూలించాలనే ఆలో చన కూడా రానివ్వరు. పైగా కులవ్యవస్థ అనేక సమస్యలకు పరిష్కారాన్ని ఇవ్వగలరని కూడా ఆర్ఎస్ఎస్ వాదులు నమ్ముతారు. అనగా ఏదైనా సమస్య ఘనీభవించినప్పుడు కిందికులం వాళ్లు పై



> ఒకవైపు దేశమంతా నా కుటుంబం అంటూనే మరోవైపు జనాభాను జల్లెడబడతాం, కొందరిని ఏరి పారేస్తాం అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వలసదారులను గుర్తించడానికి నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సి)ని తీసుకొచ్చారు. వారి ఏలుబడిలో ఉన్న అస్సాంలో అమలు చేశారు కూడా. దేశమంతా దీన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు రచించగా తీవ్ర వ్యతిరేకత రావడంతో కాస్తా వెనక్కితగ్గారు. మొన్నటికి మొన్న సిటిజన్‌షిప్ అమెండ్మెంట్ యాక్ట్ (సిఏఏ)ను తీసుకొచ్చి ఆమలు చేసి తీరుతామంటున్నారు. దీని ద్వారా ముస్లింలు, క్రైస్తవులు మన దేశ పౌరులు కాదనే విభజను తీసుకొస్తున్నారు.

కులాల తీర్పులకు బద్ధులై వుండాలం టారు. ఆర్ఎస్ఎస్ భావజాలం అంబేద్కర్‌ను అంగీకరించదు. అనేకమంది ఆర్ఎస్ఎస్ భావజాలికులు అంబేద్కర్‌ను కీర్తించడాన్ని ఇష్టపడరు. దానికి ప్రధాన కారణం అంబేద్కర్ రిజర్వేషన్ల ద్వారా నైపుణ్యంగల వారికి అన్యాయం చేశారని వాపోతుంటారు. ఎస్సీ,ఎస్టీలు ఇతర వెనుకబడిన వారంతా అనాదిగా సామాజిక నిర్లక్ష్యానికి, కొందరు ఆధిపత్య భావజాలికుల దోపిడీకి గురయ్యారని కూడా వారు గుర్తించరు. "తమకు దాసోహం అంటూనే వారికున్న నైపుణ్యాలను బట్టి ఎదగాలి కానీ కింది కులాలకు ప్రత్యేక రాయితీలు ఎందుకు?" అనేది వారి ఆలో చన విధానం. "ఒకే గొడుగు కింద ఉన్న వాళ్లం, ఒక మతస్తులం మన ఐక్యత కావాలి" అనే ఆలోచనలలోనే ఇంతటి విషపూరిత విభజనవాదం ఉన్నప్పుడు, తమది కాదనుకున్న సమూహాన్ని వారు చేరదీస్తారని ఆశించగలమా? దీనికి సమాధానం వెతక కుండా 140 కోట్ల నా జనాభా అంటూ పలకడాన్ని ఏమంటాం!

ఒకవైపు దేశమంతా నా కుటుంబం అంటూనే మరోవైపు జనాభాను జల్లెడబడతాం, కొందరిని ఏరి పారేస్తాం అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వలసదారులను గుర్తించ దానికి నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సి)ని తీసుకొచ్చారు. వారి ఏలుబడిలో ఉన్న అస్సాంలో అమలు చేశారు కూడా. దేశమంతా దీన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు రచించగా తీవ్ర వ్యతిరేకత రావడంతో కాస్తా వెనక్కితగ్గారు. మొన్నటికి మొన్న సిటిజన్‌షిప్ అమెండ్మెంట్ యాక్ట్ (సిఏఏ)ను తీసుకొచ్చి ఆమలు చేసి తీరుతామంటున్నారు. దీని ద్వారా ముస్లింలు, క్రైస్తవులు మన దేశ పౌరులు కాదనే విభజను తీసుకొస్తున్నారు. "1971 మార్చి 25వ తేదీకన్నా ముందు నుండి ఈ దేశంలో ఉన్నట్లు ఆధారాలు ఉంటేనే ఈ దేశ పౌరులు, లేకుంటే కారు" అని దేశంలో ఉన్న ఏడు మతాలలో ఒక మతం వాసులు, ముస్లింలలో మాత్రమే బయోత్పత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. గుర్తింపు కార్డుల వ్యవస్థ మొదలై పట్టుమని పాతికేళ్లు కూడా కాలేదు. ఇండ్ల పట్టాలు, భూముల పట్టాలు కూడా అధికారికమైంది ఈ పాతికేళ్లలోనే. ఈ వాస్తవాలను తెలిసికూడా ఎందుకు ప్రకటిస్తున్నారంటే హిందు వులలో ద్వేషాన్ని నింపి రాజకీయ లబ్ధి పొందడానికే. వీరంతా 'విశ్వగురు' పలికిన కుటుంబ సభ్యుల సంఖ్యలో లేరా మరి? రాబోయే ఎన్నికలకు మరో అస్త్రంగా భావించబడుతున్నది యూనిఫామ్ సివిల్‌కోడ్. చట్టము బాహ్య వ్యవహారాలకు వర్తిస్తుంది కానీ అంతర్గత ఆచారాలకు వర్తించలేదన్న వాస్తవాన్ని మరిచిపోయి యుసిసి ద్వారా కొందరిని కట్టడిచేసి అణచి వేయగలమనే ఆధిపత్య భావజాలాన్ని ప్రజల్లో నింపజూ స్తున్నారు. బీజేపీ పాలిత కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే దీనికి చట్ట రూపాన్ని కల్పించ ప్రారంభించాయి. రాజకీయ లబ్ధి కోసం తెస్తున్న ఈ చట్టాలు తప్పుల తడకగా ఉన్నవని నిపుణులు అం టూనే ఉన్నారు. ఎవరినైతే కట్టడి చేయాలనుకుంటున్నారో వారందరూ ఈ 140 కోట్ల కుటుంబ సభ్యులు కారా? ఇదే 140 కోట్ల జనాభాలో కనీస గఅహ వసతి లేని వారి సంఖ్య కోకొల్లలు. గతేడాది తాత్కాలిక షెడ్లలో తల దాచుకుంటున్న ఏడు లక్షల 40 వేల మందిని వెళ్ళగొట్టి నిరాశ్ర యులుగా చేశారు. లక్షా 50 వేల మందిని అక్రమ నివాసంలో ఉంటున్నారంటూ వారి నివాసాలను నిర్దాక్షిణ్యంగా కూల్చి వేశారు. ఈ వివరాలను హౌసింగ్ అండ్ ల్యాండ్ రైట్స్ నెట్వర్క్ అనే సంస్థ బహిర్గతపరిచింది. అనధికారికంగా గ్రామాలలో కొండ కోనల్లో ఇలాంటివారు అనేకమంది ఉన్నారు. వీరి సంగతి కాస్త పట్టించుకోవాలి. ఏడాది పొడవునా కార్చి చ్చులా కాలి పోతూ వందల మందిని బలిగొంటున్న మణిపూర్ ప్రాంతాన్ని ఒక్కసారైనా సందర్శించక పోగా వివాదాన్ని పరిష్క రించే మార్గాలను కూడా సూచించకపోవడం చాలా విచారకరం. మొండి తనానికైనా ఒక హద్దు ఉంటుంది. ప్రతిపక్షాలపై కోపంతో మణిపూర్ మరణకాండని గాలికి వదిలేయడం గర్హనీయం. కేవలం ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లోని సమస్యలను మాత్రమే ప్రస్తావిస్తూ స్వపాలిత రాష్ట్రాల్లో రగులుతున్న కుంపటిని ఆర్పేయకపోతే ఎలా! ఇలాంటి ద్వంద్వ వైఖరిని అవలంబిస్తూ 140 కోట్లు నా కుటుంబం అని చెప్పడం స్వార్థ రాజకీయమే.

గిరిజన హక్కుల గర్జన సభను విజయవంతం చేయండి



నవతెలంగాణ-కొణిజర్ల

గిరిజనుల హక్కుల పరిరక్షణకై తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "గిరిజన హక్కుల గర్జన సభ" జరుగుతుందని గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం కోరారు. శుక్రవారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షులు తేజవత్ కష్ణ కాంత్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటయోధుడు ఠాను నాయక్ 74వ వర్ధంతి సందర్భంగా గిరిజన గర్జన సభ జరుగుతుందని అయన తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు తేజవత్ కృష్ణకాంత్, బానోత్ హరిచంద్, తేజవత్ సీతారాములు, ధారవత్ నంద్యా నాయక్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



'ధరణి' దరఖాస్తులపై సమీక్ష

- ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారు.. ఎన్ని రిజెక్ట్ చేశారు..కారణాలేంటి
- రెవెన్యూ అధికారులను వివరాలు కోరిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి

ధరణి పోర్టల్‌కు వచ్చిన దరఖాస్తులు, పరిష్కారాలు, రిజెక్ట్ అయిన దరఖాస్తులు అందుకు గల కారణాలపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రెవెన్యూ అధికారులతో స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమీక్ష జరిపారు. ఇప్పటి వరకు ధరణికి అందిన దరఖాస్తుల సంఖ్య ఎంతని తహసీల్దారు కూర్మా యోగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని పరిష్కరించగలిగారని, ఇందులో పర్సెంటేజ్ ఎంతని తహసీల్దారు అడిగారు. అందిన దరఖాస్తులో ఎన్ని దరఖాస్తులను తిరస్కరణకు గురయ్యాయని, అందుకు గల కారణాలను అడిగారు. దీంతో పాటు సత్తుపల్లి మండలంలోని బుగ్గపాడు, చంద్రాయపాలెం గ్రామాలకు చెందిన గిరిజనుల సాగులో సుమారుగా 360 ఎకరాల భూమి ఉందని గిరిజనులు చెబుతున్నారని తహసీల్దారును ఎమ్మెల్యే వివరణ కోరారు. పంటలు వేసిన ప్రతిసారీ ఆ భూములు మావంటూ అటవీశాఖ అధికారులు ఆయా భూములపైకి దాడులు చేయడం, వాళ్ల వేసుకున్న పంటలను ధ్వంసం చేయడం లాంటి ఘటనలకు చెక్ పెట్టాలంటే తక్షణమే జాయింట్ సర్వే జరిపించి ముందు గిరిజనులకు, అటవీ అధికారుల మధ్య భూ వివాదాలు రాకుండా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తహసీల్దారు యోగేశ్వరరావును ఆదేశించారు. ఈ సమీక్షలో రెవెన్యూ అధికారులతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మండల నాయకులు దొడ్డా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నేషనల్ స్టాండర్డ్ జూనియర్ సైన్స్ ఎగ్జామినేషన్లో హార్వెస్ట్ విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ- ఖమ్మం

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ వారు నిర్వహించే నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ జూనియర్ సైన్స్ (ఏ.ఎస్.ఇ.జె.ఎస్-2023)లో ఖమ్మం జిల్లా నుండి తమ విద్యార్థి మాత్రమే ఎంపికైనట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో ప్రతీయేటా నిర్వహించే నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ జూనియర్ సైన్స్ (ఏ.ఎస్.ఇ.జె.ఎస్-2023) జనవరి 31న ఖమ్మంలో నిర్వహించగా తమ విద్యార్థి సిహెచ్.కృష్ణమాధుర్ (10వ తరగతి) తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొని, రాష్ట్ర కోటా 17 మందిలో ఖమ్మం జిల్లా నుండి ఏకైక విద్యార్థిగా ఎంపిక కావడం జరిగిందని వారు వివరించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలో 32,629 మంది విద్యార్థినీ, విద్యార్థులు 1191 సెంటర్లలో పరీక్ష రాయగా, 426 మందిని ఎంపిక చేశారని, ఉత్తమ ఒకటవ శాతంలో తమ విద్యార్థి ఎంపిక కావడం జరిగిందని వారు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో ఐఐటి బ్రాంచ్ ఇంచార్జ్ జి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కారేపల్లి

ఖమ్మం జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం మండల అధ్యక్షులు అజ్మీర శోభన్ డిమాండ్ చేశారు. కారేపల్లిలో శుక్రవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా విభజన సందర్భంగా అప్పటి ప్రభుత్వం ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేస్తానని మాట తప్పిందన్నారు. ఏజెన్సీలో పోడు పట్టాలు ప్రజా వైద్యం అందుబాటులోకి తేవాలన్నారు. కారేపల్లి మండలంలో గ్రామంలో ప్రజలు కోసం దూర ప్రాంతాలకు వస్తుందని చీమలపాడు ప్రాంతంలో అదనపు పీహెచ్ సీ ఏర్పాటుతో పాటు కారేపల్లి పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని, 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక పోవటంతో గిరిజనులకు ఉన్నత విద్య దూరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మూడు బద్రు, భానోత్ వీరన్న, సుమన్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన

నవతెలంగాణ- ఖమ్మం

ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా ఆటోలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆటో డ్రైవర్లు, సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ మోహన్ బాబు, ఎస్సై రవి, వెంకన్న, ఆర్ఎస్సై సాగర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ వీపీ. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

బాల్య వివాహల నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మహిళా, శిశ, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంక్షేమ సమితి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణలో ఉన్న శిశువుల వివరాలు, పిల్లల దత్తతపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల సంక్షేమ సమితి, బాలల పరిరక్షణగా విభాగం,చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సభ్యులకు సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా బాలల సంక్షేమ సమితి యందు హాజరైనటువంటి పిల్లలు ఎంతమంది బాల్యవివాహాల గురించి,ఎంతమంది అటువంటి కేసులు మన దృష్టికి రాగానే ఫైల్ చేసిన ఎఫ్ఐఆర్లు ఎన్ని? ఎటువంటి చర్యలు తీసుకున్నారు? అటువంటి పిల్లలు గురించి అడిగి తెలుసుకున్నారు. తగు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, డీసీపీఓ విష్ణు వందన, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, లింగయ్య, అనిత తదితరులు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులు తమ విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

సెక్టార్ అధికారులు తమ విధులు, బాధ్యతల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ.గౌతమ్ అన్నారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘ నియమ, నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే పై అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, అప్రమత్తంగా ఉంటూ, సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, శిక్షణా ఐపీఎస్ మౌనిక, అదనపు డిసిపి జి. ప్రసాదరావు, జిల్లా స్వీప్ నోడల్ అధికారి కె. శ్రీరామ్, ఆర్డీవోలు, ఏసీపీలు, సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

- పీవైఎల్ జిల్లా అధ్యక్షులు మాదారపు ఉమాశంకర్

నవతెలంగాణ-ముదిగొండ

దేశభక్తులైన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతిని మతోన్మాదానికి వ్యతిరేకంగా నిర్వహించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షులు మాదారపు ఉమాశంకర్ పిలుపునిచ్చారు. ముదిగొండలో పివైఎల్ అద్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్ ల 93వ వర్ధంతి పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుండి 30 వరకు గ్రామ గ్రామాన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతులను జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ నాయకులు నరేష్, వంశీ, రామకృష్ణ, బన్నీ, గౌతమ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

విశ్వ విద్యాలయ ఏర్పాటు హామీని నెరవేర్చాలి

నవతెలంగాణ-ఖమ్మం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ విశ్వవిద్యాలయం ఏర్పాటు హామీ కలగానే మిగిలిందని, మంత్రులు దృష్టి సారించి ఖమ్మంలో విశ్వ విద్యాలయం ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో యూనివర్శిటీలు ఉన్నాయని, ఖమ్మం జిల్లా మాత్రమే ఏర్పాటు చేయలేదన్నారు. 2008లోనే నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి యూనివర్శిటీ ఏర్పాటు చేస్తామని ఖమ్మంలో ప్రకటించి, విస్మరించిన విషయం గుర్తు చేశారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

ఎంపీ నామ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-వైరా



ఖమ్మం పార్లమెంటు సభ్యులు నామా నాగేశ్వరావు జన్మదిన వేడుకలను వైరాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దిశా కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జునరావు, వైరా మున్సిపల్ వైస్ చైర్మెన్ ముల్లపాటి సీతారాములు, మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు షేక్ లాల్ మహమ్మద్, వైరా మార్కెట్ మాజీ చైర్మెన్ పసుపులేటి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'కమ్మ' కార్పొరేషన్ ఏర్పాటుపై చలసాని హర్షం

నవతెలంగాణ-సత్తుపల్లి

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై సత్తుపల్లి నియోజకవర్గ కమ్మ సేవా సంఘం కన్వీనర్, మదర్ థెరెసా ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వ్యవసాయసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకాచౌదరికి ఈ సందర్భంగా చలసాని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కమ్మ సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకొనేందుకు ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన కమ్మ కార్పొరేషన్ కృషి చేయాలని ఈ సందర్భంగా చలసాని ఆకాంక్షించారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు అధిక మొత్తంలో నిధులు కేటాయించి కార్పొరేషన్ ద్వారా కమ్మ సామాజికవర్గంలో పేదలను ఆదుకోవాలని ఈ సందర్భంగా సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు.



బీజేపీని ఓడిద్దాం...

- కార్మిక చట్టాలను కాపాడుకుందాం
- సిడబ్ల్యూఎఫ్ఐ ఆల్ ఇండియా ఉపాధ్యక్షులు మందడపు సాయిబాబు

నవతెలంగాణ- ఖమ్మం

బిజెపిని ఓడిద్దాం కార్మిక చట్టాలను కాపాడు కుందామని సిడబ్ల్యూఎఫ్ఐ ఆల్ ఇండియా ఉపాధ్యక్షులు మందడపు సాయిబాబు పిలుపు నిచ్చారు. శుక్రవారం ఖమ్మంలోని యూనియన్ కార్యాలయంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) తెలంగాణ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికుల పొట్ట కొట్టిందని, ఈ దేశంలో మతోన్మాదాన్ని పోషించి అధిక ధరలు పెంచి నిరుద్యోగాన్ని పెంచి ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టి ప్రభుత్వ ఆస్తులన్నీ అంబానీలకు, అదానీలకు దారాదత్తం చేస్తూ దేశాన్ని లూటీ చేస్తుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించాల్సిన బాధ్యత పౌర నిర్మాణ కార్మికులుగా మనందరి పైన ఉందని అన్నారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్ రామ్మోహన్, రత్నాకరం, కోటంరాజు, గౌరవ అధ్యక్షులు వంగూరు రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముదాం శ్రీనివాస్‌రావు, దోనోజు లక్ష్మయ్య, జంగయ్య, ఎల్క సోమయ్య గౌడ్, సాగర్, రాజు, బోయినపల్లి వీరబాబు, ఎర్ర మల్లికార్జున్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి : మంత్రి తుమ్మల

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, ప్రజలకు ఆహ్లాదం పంచే విధంగా మున్నేరు, గురుదక్షిణ ఫౌండేషన్ ప్రాంతాలు ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పోలేపల్లి గురుదక్షిణ ఫౌండేషన్ వద్ద స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని సుందరంగా అభివృద్ధి చేస్తామన్నారు. గత ప్రభుత్వం విధ్వంసంతోనే ప్రస్తుతం రాష్ట్రంలో సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయని వివరించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండే విధంగా పరిపాలన ఉంటుందన్నారు. గురుదక్షిణ ఫౌండేషన్లో ఆసుపత్రి, వృద్ధాశ్రమం, అవసరమైతే ఇంటర్నేషనల్ పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చాగంటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, గోపాలపురం వెంకటాచారి, లక్ష్మయ్య ప్రభాకర్, సత్యనారాయణ, విజయచందర్, గోపాలరావు, గురుదక్షిణ ఫౌండేషన్ అధ్యక్షుడు శంకరయ్య, కార్యదర్శి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, సాధు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖమ్మం నగరాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం

ఖమ్మం : ఖమ్మం నగరాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. 49వ డివిజన్‌లో రూ.70.21 లక్షలతో చేపట్టే సిసి రోడ్, సైడ్ కాల్వల నిర్మాణ పనులకు రామాలయం సెంటర్ వద్ద, 57వ డివిజన్ వికలాంగుల కాలనీలో రూ.72 లక్షలతో చేపట్టే సిసి రోడ్, సైడ్ కాల్వల నిర్మాణ పనులకు, 5వ డివిజన్ యూపీహెచ్ కాలనిలో రూ.72 లక్షలతో చేపట్టే సిసి రోడ్, సైడ్ కాల్వల నిర్మాణ పనులకు, 2వ డివిజన్ ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వద్ద రూ.72 లక్షలతో చేపట్టే సిసి రోడ్, సైడ్ కాల్వల నిర్మాణ పనులకు, 8వ డివిజన్ గోపాలపురంలో రూ.72 లక్షలతో చేపట్టే సిసి రోడ్, సైడ్ కాల్వల నిర్మాణ పనులకు, 27వ డివిజన్ శ్రీనివాసనగర్‌లో రూ.74 లక్షలతో చేపట్టే సిసి రోడ్, సైడ్ కాల్వల నిర్మాణ పనులకు, రూ. 25 కోట్ల అంచనాలతో చేపట్టే ఖమ్మం- కొదుమూరు 2 లైన్ల ఆర్ అండ్ బి రహదారిని 4 లైన్ల రహదారిగా అభివృద్ధి, పటిష్ట పరిచే పనులకు మంత్రి శంఖుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్అండ్‌బి ఎస్ఇ శ్యామ్ ప్రసాద్, పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, 57వ డివిజన్ కార్పొరేటర్ ఎమ్‌డీ ముస్తఫా రఫీదా బేగం, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కోణార్క్ రైల్లో 9 కిలోల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-మధిర

మధిర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం భువనేశ్వర్ నుండి ముంబై వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో నిర్వహించిన తనిఖీల్లో 9 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జంపాల రామ్మూర్తి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు రైల్వే జీఆర్పి పోలీసులతో కలిసి కోణార్క్ రైలులో తనిఖీలు నిర్వహించగా, ప్యాకెట్లుగా ఏర్పాటు చేసి తరలిస్తున్న బ్యాగులను గుర్తించడం జరిగిందని తెలిపారు.

కూలీలకు సౌకర్యాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం

- వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్
- గంగారంలో ఉపాధి కూలీలతో వ్యకాస సమావేశం

నవతెలంగాణ-సత్తుపల్లి



ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వారు పనులు చేస్తున్న ప్రదేశాల వద్ద కనీస సౌకర్యాల ఏర్పాటులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎండలు తీవ్రమవుతున్న నేపధ్యంలో కొద్దిసేపయినా కూలీలు సేద తీరేందుకు నీడ సౌకర్యం లేదన్నారు. మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచడం లేదన్నారు. నీడ సౌకర్యం లేని కారణంగా తెచ్చుకుంటున్న మంచినీళ్ల ఎండకు వేడెక్కి తాగలేని పరిస్థితి ఉందన్నారు. వెంటనే ఉపాధి పనుల ప్రదేశాల వద్ద కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే చేసిన పనులకు కూలిడబ్బులు చెల్లించడం లేదన్నారు. రెండు నెలలుగా కూలి డబ్బులు రాకపోవడంతో ఆయా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఉపాధిహామీ పథకానికి నిధులను తగ్గించుకుంటూ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతోందని శ్రీనివాస్ ఆరోపించారు. ఉపాధి పథకంలో పనిచేసే ప్రతి కూలీకి ఏడాదిలో 200రోజులు పని దినాలు కల్పించడంతో పాటు రోజుకూలి రూ. 200 చెల్లించాలన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని శ్రీనివాస్ కోరారు. ఈ సమావేశంలో దేవళ్ల అనురాధ, పమ్మి నాగలక్ష్మి, తమ్మిశెట్టి నాగేశ్వరి, జువ్వా కృష్ణవేణి, నూనె నీలమ్మ చిమట నాగమణి, కువ్వారపు దివ్య పాల్గొన్నారు.

నేడు 'పాలేరు'లో పొంగులేటి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజకవర్గంలో శనివారం పర్యటించనున్నారని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటలకు కూసుమంచిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. ఉదయం 10 గంటలకు జీళ్లచెర్వులో సీసీ రోడ్లను ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటలకు నేలకొండపల్లి మండలం చెన్నారంలో ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి అక్కడే కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు చెర్వుమాదారంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అదే విధంగా 1గంటకు కైకొండాయిగూడెంలో సీసీరోడ్లకు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు మహబూ బాబాద్‌లో జరిగే మహబూబాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరవుతారని తెలిపారు.

నేడు హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని. హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ పార్వతీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత వైభవంగా, కళాత్మకంగా చిన్నారుల కేరింతల మధ్య జరుపుకొనే ద్వితీయ వార్షిక సంబురాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం నగర ప్రముఖ వైద్యులు యలమంచలి రవీంద్రనాథ్, వివిధ రంగాలలో ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

60 ఏళ్ల భూ సమస్యకు పరిష్కారం

- కలెక్టర్‌ను సన్మానించిన రైతులు
- సమస్య పరిష్కారంలో 'మోదుగు' కీలక పాత్ర

నవతెలంగాణ - బోనకల్

అది 60 ఏళ్ల సమస్య. ఎంతోమంది కలెక్టర్లకు ఆ సమస్యను వివరించారు. అనేకమంది ప్రజాప్రతినిధుల వద్ద తమ మొరపెట్టుకున్నారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. అందరూ పేద దళితులే. 60 ఏళ్లుగా భూమిపై జీవనం సాగిస్తున్నారు. కాని ఆ భూమిపై మాత్రం ఎటువంటి హక్కు లేదు. 60 ఏళ్లుగా ఆ భూమినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 2022న జిల్లా కలెక్టర్ విపి గౌతం మండల కేంద్రంలో గల ఆర్‌టబి బ్రిడ్జి అక్రమ కట్టడాలను పరిశీలించడానికి వచ్చారు. ఆ సమయంలో బోనకల్ జడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు ద్వారా బాధిత దళితుల సమస్యను వివరించారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఇటీవల ఆ సమస్యను పరిష్కారం చేశారు. దీంతో దళిత రైతులు ఆనందంతో జిల్లా కలెక్టర్ ను గురువారం రాత్రి కలెక్టర్ కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.



ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సుమారు 60 ఏళ్ల నుంచి 40 మంది దళిత పేద రైతులు 60 ఎకరాలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ భూమి ఇనాం భూమి కావడంతో సంబంధిత రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేవు. 40 మంది రైతులు మాత్రం ఆ భూమిని సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నప్పటికీ పట్టాదారు పాస్ పుస్తకాలు లేక ప్రభుత్వం అందిస్తున్న సహకారం వారికి అందటం లేదు. 60 ఏళ్ల నుంచి మండల తహసిల్దార్, జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నామని రైతులు జెర్రిపతుల కిరణ్, తాతాటికొండ అచ్చయ్య, తాటికొండ జయరాజు, తాటికొండ దావీద్ తదితరులు తెలిపారు. తామే కాకుండా తమకంటే ముందు తమ వారసులు కూడా పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగారని తెలిపారు. అధికారుల చుట్టూ తిరిగితే పని కావడం లేదని ప్రజాప్రతినిధులు చుట్టూ కూడా తిరిగామని తెలిపారు. అవి ఇనాం భూములని వాటికి ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వరని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు చెప్పుకుంటూ వచ్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో బోనకల్ ఆర్వోబి బ్రిడ్జి కింద అక్రమ కట్టడాలను పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ వి పి గౌతం 2022న బోనకల్ మండల కేంద్రానికి వచ్చిన సమయంలో తాము జడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు ద్వారా కలిసి సమస్యను వివరించామని తెలిపారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, సాధ్యమైనంత తొందరగా విచారణ నిర్వహించి, ఆ విచారణ ఆధారంగా భూమి అనుభవిస్తున్న రైతులందరికీ తప్పనిసరిగా పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు కొన్ని నెలలకే మండల రెవెన్యూ అధికారులచే విచారణ నిర్వహించారు. ఆ విచారణ ఆధారంగా భూమి అనుభవిస్తున్న దళిత పేదలందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా మండల రెవెన్యూ అధికారులు 40 మంది రైతులకు 60 ఎకరాలకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. తమ సమస్య పరిష్కారం చేసినందుకు దళిత రైతులందరూ కలెక్టర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. అందులో భాగంగా గురువారం రాత్రి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో 15 మంది దళిత రైతులు కలెక్టర్ విపి గౌతమ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతలు తెలిపారు. మీ సమస్య పరిష్కారంలో జడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు కీలక పాత్ర నిర్వహించారని ముందుగా ఆయనకే కతజ్ఞతలు చెప్పండి అంటూ కలెక్టర్ అనటం విశేషం. కలెక్టర్‌ను సన్మానించిన వారిలో మోదుగు సుధీర్ బాబు రైతులు తాటికొండ ప్రభుదాసు, తాటికొండ రామయ్య, తాటికొండ ఇర్మియ, తాటికొండ రోజాన, తాటికొండ మైసయ్య, తాటికొండ రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

నవతెలంగాణ-మధిర

జింకల మురళి, మహాలక్ష్మిలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కు నోట్స్‌లు, ఫర్నిచర్, పరీక్ష సామాగ్రి ఉచితంగా అందిస్తూ తమ దాతృత్వం చాటుకుంటున్నారు. శుక్రవారం చిలుకూరు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని వారు అందజేశారు. ఈ సందర్భంగా వారిని మండల విద్యాశాఖ అధికారి వై. ప్రభాకర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఊట్ల శంకర్ రావు, ఊట్ల రాధాకృష్ణ, దెందుకూరు వ్యాపారస్తులు రాయల అంజనీ ప్రసాదు, మాటూరు గణిత ఉపాధ్యాయులు మేడేపల్లి శ్రీనివాసరావు, జింకల త్రిసంజన, జింకల వెంకట ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని అన్నారుగూడెం జిల్లా, పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవ సందర్భంగా ఆరవ తరగతి నుండి, పదవ తరగతి విద్యనభ్యసించే విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను మండల విద్యాధికారి నెమ్మకంటి ప్రసాద్ ప్రారంభించారు. విజేతలకు బహుమతులను ఎంఈఓ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ మాదినేని నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొరికిన సెల్‌ఫోన్.. బాధితుడికి అందజేత

నవతెలంగాణ-కల్లూరు

మర్లపాడు గ్రామానికి చెందిన పసుపులేటి అనంత్ కుమార్ గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై కల్లూరు వస్తుండగా పాయింట్ జేబులో పెట్టుకున్న సెల్ ఫోన్ పోయింది. దాని విలువ 18 వేలు, సెల్ కవర్‌లో 1300 రూపాయలు నగదు ఉంది. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అదే సమయంలో కల్లూరు పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి లక్కి నేని రమేష్ కల్లూరు వస్తుండగా స్థానిక డిఎస్ పి కళ్యాణ మండపం దగ్గర సెల్ దొరికింది. ఈ విషయాన్ని ఎస్సై షాకీర్ కు రమేష్ సమాచారం అందించారు. ఎస్సై బాధితుడికి ఫోన్ చేసి స్టేషన్ పిలిపించి లక్కినేని రమేష్ ద్వారా పసుపులేటి అనంత్ కుమార్కొ సెల్ ఫోను నగదు అందజేశారు. బాధితులు లక్కి నేని రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ పోగొట్టుకున్న సొమ్ము ఎవరికైనా దొరికితే తిరిగి మా ద్వారాగాని మా సమక్షంలో గాని వారికి అందజేసి మానవతా దృక్పథాన్ని చాటుకోవాలని ప్రజల్ని కోరారు. ఈ సందర్భంగా లక్కినేని రమేష్ ఎస్సై అభినందించారు.

వరి పంట పరిశీలన

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని గోపాలరావుపేట గ్రామంలోని బెల్లం మురళీకృష్ణ, బెల్లం జగదీష్, రైతుల సల్ఫైడ్ దుష్ప్రభావం అయిన వరి పొలాన్ని శుక్రవారం కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయచంద్ర, మండల వ్యవసాయ అధికారిణి వాణి, కెవికె శాస్త్రవేత్తలు రవి కుమార్, ఫణిశ్రీలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. చౌడు, మురుగు నీరు నిల్వ ఉండడం వలన సల్ఫైడ్ దుష్ప్రభావం జరుగుతుందని, దీని నివారణకు నీటిని తీసి ఆరబెట్టాలని, జిప్సంను వాడాలని, పచిరొట్ట ఎరువులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ రవీందర్, రైతులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ ప్రారంభం

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ పశు వైద్య కేంద్రంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వైస్‌ఎంపీపీ మంకెన దామోదర్ శుక్రవారం లాంఛనీయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాడి రైతులు ఉచిత టికాలను సద్వినియోగంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు పీ.అశోక్, రమేష్ బాబు, గోపాలమిత్రలు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జిల్లా మాల దాసరి సంఘం సమావేశం

నవతెలంగాణ-కల్లూరు

ఈ నెల 17వ తేదీన వైరాలో ఖమ్మం జిల్లా మాల దాసరి సంఘం సమావేశం ఉదయం 10 గంటలకు వైరాలోని మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు మాజీ జిల్లా కమిటీ అధ్యక్షుడు గుజ్జు సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని మాల దాసరిలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎంపీ నామ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

పార్లమెంటు సభ్యులు నామ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శీలం కవిత, పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యులు షేక్ మస్తాన్ వలి, సగ్గుర్తి కిషోర్ బాబు, యూత్ నాయకుడు కొండపాటి సాంబశివరావు, తిరుపతిరా వు, చిన్నం రాము, బుల్లిబాబు, కాలేశ్వరరావు, నాగేశ్వరరావు, భాస్కర్, దేవరకొండ రవి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-పెనుబల్లి

గ్రామపంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం పెనుబల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షులుగా జే. సీతారాములు, గౌరవ అధ్యక్షులుగా ఎన్‌వీ. ప్రసాద్, సభ్యులుగా చక్రవర్తి, వెంకటరామిరెడ్డి, హరిత, సౌజన్య, రాంప్రసాద్, రవికుమార్, శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారం కోసం నూతనంగా ఎన్నికైన కమిటీ పనిచేస్తుందని వారు తెలిపారు.

సీఎంకు రుణపడి ఉంటాం

- ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

నవతెలంగాణ-ఖమ్మం

ఆర్యవైశ్యుల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సమస్యలు పరిష్కరించారని, అందుకు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సభ్యులందరూ రుణపడి ఉంటారని ఆ సంఘం నాయకులు కొదుమూరి మధుసూదన్‌రావు అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు కృషిచేసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఖమ్మం జిల్లా వాసవి క్లబ్ సేవాదళ్ మాజీ అధ్యక్షులు గంగిశెట్టి వెంకటేశం, కాంగ్రెస్ జిల్లా నాయకులు సోమ సత్యనారాయణ, జిల్లా నాయకులు నల్లాల విశ్వేశ్వరావు, డోగిపర్తి నగేష్‌కుమార్, మేళ్లచెర్వు హనుమంతరావు, టీఎస్. చక్రవర్తి, కొదుమూరి ఉమేష్, కొదుమూరి భద్రయ్య, మేళ్లచెర్వు కేశవరావు, వెచ్చ చలపతిరావు, ఆకుల శ్రీను, ఏ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల శిక్షణలో 50శాతం ఫీజు రాయితీ

- సీవీఆర్ ఎంట్రన్స్ కాలేజీ డైరెక్టర్ చందా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ఖమ్మం



సీవీఆర్ ఎంట్రన్స్ కళాశాల నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఐదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పోటీ పరీక్షలకు శిక్షణ పొందే అభ్యర్థులకు 50శాతం ఫీజు రాయితీ ఇవ్వనున్నట్లు సీవీఆర్ ఎంట్రన్స్ కళాశాల డైరెక్టర్ చందా వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీవీఆర్ ఎంట్రన్స్ కళాశాల నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకొని ఐదవ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా పోటీ పరీక్షల శిక్షణకు 50శాతం ఫీజ్ రాయితీ ఇవ్వనున్నట్టు తెలిపారు. పోటీ పరీక్షలైన ఎంసెట్, నీట్, జెఈఈ మెయిన్స్, పాలిటెక్నిక్, టిఎస్ఆర్జేసి, నవోదయ, టెట్, డీఎస్సీలలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 7993624978ను సంప్రదించాలన్నారు.

'భూ నిర్వాసితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలి'

నవతెలంగాణ-కామేపల్లి



మండలంలోని సీతారాం ప్రాజెక్టు కాలువల కింద భూములు కోల్పోతున్న రైతులకు తక్షణమే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కామేపల్లి తహసీల్దార్‌కు సీతారాం ప్రాజెక్టు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు దుగ్గి కృష్ణ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుండి భూములను ప్రభుత్వం అవార్డు చేసింది. దీంతో రైతుబంధు రాక, రైతు రుణాలు రాక ప్రభుత్వ భూమిగా గుర్తిస్తూ ఆ భూముల రైతులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌కి, ఆర్డీఓ, ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిధులు విడుదల చేసి అందించాలని, లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంగోత్ బాలాజీ, అట్లా వీరయ్య దీవెన రంగయ్య, ఎన్నో నాగేశ్వరరావు, నడబోతు గోపిరెడ్డి, సమరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న కలెక్టరేట్ ఎదుట ధర్నా

• లిస్టులో ఎంపికైన యాదవ్, కురుమలు కలెక్టరేట్‌కి రావాలి

నవతెలంగాణ-పెనుబల్లి/కల్లూరు

గొర్రెల పంపిణీ పథకంలో డీడీలు కట్టి ఎదురుచూస్తున్న వారు, బీ లిస్టులో ఎంపికైన యాదవ్, కురుమలు అందరూ ఈ నెల 18న సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్దకు రావాలని గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు,బట్టు నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు ఈ నెల 18తో పూర్తవుతుందని పేర్కొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లో గొర్రెల డీడీలు కట్టిన వారికీ, బీ లిస్టులో ఎంపికైన యాదవ్, కురుమలందరికీ రూ. 2 లక్షలు బ్యాంకు ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ రోజు వరకు ప్రభుత్వం ఎక్కడ ఈ విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఇటివల పెట్టిన బడ్జెట్లో ఈ పథకానికి నిధుల కేటాయింపు చేయలేదని, నిన్న జరిగిన మంత్రివర్గంలో కూడా కార్పొరేషన్ల ప్రకటన తప్ప ఇచ్చిన 2 లక్షల హామీ ప్రస్తావన లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే జిల్లాలో 11వేల మంది 50 కోట్ల రూపాయలు డీడీలు చెల్లించి 18 నెలలుగా వడ్డీలు చెల్లించి నష్టపోయారని, ఇప్పుడు 3 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎదురు చూసిన ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. కొంతమంది ఇంకా వడ్డీలు కట్టలేక డీడీ డబ్బులు వెనక్కి తీసుకొంటున్నారని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం దృష్టికి సమస్యను తెచ్చేందుకోసం, జిల్లా కలెక్టర్‌కి సమస్యను విన్నవించేందుకు జిల్లాలో యాదవ్, కురుమలంతా కలెక్టరేట్ కార్యాలయం వద్దకు రావాలని కోరారు.

బోనకల్ రైల్వే స్టేషన్ 3వ లైన్ పరిశీలన

• పలు రైళ్లు నిలపాలని రైల్వే డీఆర్ఎమ్‌కు వినతి

నవతెలంగాణ-బోనకల్



బోనకల్ రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లు నిలపాలని సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేష్ కుమార్ జైన్‌కు స్థానికులు వినతి పత్రం అందజేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన మూడవ రైల్వే లైన్ తనిఖీల్లో భాగంగా బోనకల్ రైల్వే స్టేషన్‌కు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేష్ కుమార్ జైన్ శుక్రవారం వచ్చారు. ఈ విషయం తెలిసిన బోనకల్ మండల అఖిలపక్ష నాయకులు బోనకల్లు రైల్వే స్టేషన్లో ఆయనను కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో పాత రైల్వే గేటు వద్ద రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించడం వలన ఇటు వైపు నివసిస్తున్న ప్రజలు ఖమ్మం బస్టాండ్ వైపుకు వెళ్లాలంటే సుమారు రాను పోను మూడు కిలోమీటర్లు కిలోమీటర్లు వెళ్లవలసి వస్తుందని, తమకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని ఆ వినతి పత్రంలో కోరారు. బోనకల్ ప్రాంతం నుండి పెనుగంచిప్రోలు లక్ష్మీ తిరుపతమ్మ దేవాలయం, తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం, వేదాద్రి, ముత్యాల దేవస్థానాలు, నెమలి కృష్ణుడి దేవాలయం భక్తులు, తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు బోనకల్ రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణం కొనసాగిస్తుంటారని, వ్యాపారస్తులు, వైద్య, విద్య నిమిత్తం హైదరాబాద్ లాంటి పట్టణాలకు వెళ్లాల్సిన వారు శాతవాహన, ఇంటర్ సిటీ లాంటి ఎక్స్ ప్రెస్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. బోనకల్ రైల్వే స్టేషన్‌లో శాతవాహన, ఇంటర్ సిటీ, పద్మావతి ఎక్స్ ప్రెస్‌లను ఆపాలని ఆ వినతి పత్రంలో కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) నాయకులు గుగులోతు పంతు, టీడీపీ మండల రావుట్ల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేశ్వర్లు, పర్సనబోయిన వీరభద్రం, ఆర్యవైశ్య సంఘ నాయకులు పల్లపోతు వెంకట గోపాలరావు (గోపి), రంగా జనార్దన్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాజానికి కరుణాకర్ సేవలు భేష్

• ఎమ్మెల్యే రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి



క్రైస్తవ సమాజానికి ఎన్‌సీసీ పొలిటికల్ వింగ్ జాతీయ అధ్యక్షుడు, పాస్టర్ అలవాల కరుణాకర్ అందిస్తున్న సేవలు భేషుగ్గా ఉన్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఎన్‌సీసీ రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన కరుణాకర్‌ను అభినందిస్తూ ఆయన్ను ఘనంగా సన్మానించారు. క్రిస్టియన్ల అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి దయానంద్ చేతుల మీదుగా పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేయించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, ఎన్‌సీసీ రాష్ట్ర పొలిటికల్ వింగ్ అధ్యక్షుడు పింగిలి సామేలు, పాస్టర్లు కొత్తపల్లి ప్రభాకర్, కంచెపోగు దేవసహాయం, ఎన్‌సీసీ నియోజకవర్గ అధ్యక్షుడు జాన్‌మార్క్, బేతంపూడి రాజా, సుధీర్, యేసుపాదం, ప్రసన్నకుమార్, రాంబాబు, మోహన్, డానియేల్ పాల్గొన్నారు.

కార్మికులకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలి

• భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పేరాబోయిన వెంకన్న

ఖమ్మం : యాభై సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు రూ.10వేల పింఛన్లు ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్టీయూ) జిల్లా అధ్యక్షుడు పేరాబోయిన వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ వెంగమాంబకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని కార్మికులకు షరతులు లేకుండా ఇంటి నిర్మాణానికి 10 లక్షలు ఇవ్వాలని, స్థలం లేని కార్మికులకు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి పది లక్షలు ఇవ్వాలన్నారు. లేబర్ ఆఫీస్‌లో ఉన్న పెండింగ్ క్లెయిమ్స్ మొత్తం క్లియర్ చేయాలని, ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని, లేబర్ ఆఫీస్‌లో జరిగే అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, కృష్ణ, అశోక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ గౌరవ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి సందు
ఓ.యస్.నెం208 /2024

పిటీషన్ :
1.కొనకంచి కమలాబాయి
2.కొనకంచి సరళ
3.కొనకంచి కిరణ్ కుమార్
4.కొనకంచి కిషోర్ కూమారు
.....వాదులు

మరియు
1. తహసిల్దార్ ఖమ్మం అర్బన్
2.ఇట్టి విషయం ఎవరికి సంబంధించినదో వారికి
.....ప్రతివాదులు

టు,
1) కొనకంచి కమలాబాయి, భర్త:కొనకంచి ఏసురత్నం, వయస్సు: 62 సం॥లు,వృత్తి : గృహిణి.
2) కొనకంచి సరళ తండ్రి: కొనకంచి ఏసు రత్నం, వయస్సు: 46 సం.లు, వృత్తి: ప్రవేటు ఉద్యోగి.
3) కొనకంచి కిరణ్ కుమార్, తండ్రి: కొనకంచి ఏసురత్నం, వయస్సు:43సం॥లు,వృతి : గవర్నమెంట్ ఉద్యోగి
4) కొనకంచి కిషోర్ కుమార్ తండ్రి: కొనకంచి ఏసురత్నం, వయస్సు: 37 సం॥లు, వృతి ప్రవేటు ఉద్యోగి
వీరి అందరి నివాసము ఇం.నెం. పాకబండ బజారు, ఖమ్మం అర్బన్, ఖమ్మం జిల్లా తెలంగాణ రాష్ట్రం.

నోటీసు

పైన తెలిపిన వాదులు డిక్లరేషన్ దావా ఓ.యస్.నెం.208/2024 గౌరవ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు ప్రతివాదులు అయిన మీ పైన దావా దాఖలు చేసియున్నారు. అట్టి దావాలో మీ హాజరు కొరకు ది 15-04-2024 న వాయిదా ఉన్నది. కావున ఆ రోజు ఉదయం గం.10-30 ని॥లకు మీరు స్వయంగా గాని, న్యాయ వాది ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు, అభ్యం తరాలు తెలియజేయగలరు. లేనిచో సదరు కేసును మీ పరోక్షమందు తీర్మానించబడును.

//కోర్టు వారి ఉత్తర్వులతో //
మార్కపూడి కన్నాంబ
సి. హెచ్. కోటేశ్వరరావు
పి.సాయికిరణ్
న్యాయవాదులు, ఖమ్మం.
సెల్: 9347110315

వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

నవతెలంగాణ-నేలకొండపల్లి

విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలని ఖమ్మం ఎస్సార్ అండ్ బిజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకురాలు డీ.సుజాత అన్నారు. నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల కామర్స్ విభాగం, కన్సూమర్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.పరంజ్యోతి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కామర్స్ విభాగం ఇన్చార్జ్ డాక్టర్ యన్. మాధవరావు, డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్, అధ్యాపకులు జానకి రామారావు, డాక్టర్ బీ. నాగేశ్వరరావు, కే.శ్రీనివాస్, డాక్టర్ పీ.అనిత, మాధవి, కోటమ్మ, డాక్టర్ ఆర్. వెంకటరాజం, అప్పారావు, కుమారి వాణి విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీచైతన్య కళాశాలలో హ్యాకథాన్

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలో పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న హ్యాకథాన్ ప్రోగ్రాంని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డైరెక్టర్ సందీప్ మక్తాలా మాట్లాడారు. యువకులు స్టార్టప్ కంపెనీలు స్థాపించి వారి సృజనాత్మకతతో ఆవిష్కరణలకు బాటలు వేసి ఆర్థిక పురోగతిని సాధించడం వల్ల ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో భారత్ పోటీపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక, సీఈఓ శ్రీనివాస్, ఏఓ వైశాలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో 'కాన్షీరాం' జయంతి

నవతెలంగాణ-సత్తుపల్లి



బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ కాన్షీరాం జయంతిని శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో సత్తుపల్లిలో ఘనంగా జరిపారు. స్థానిక పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట కాన్షీరాం చిత్రపటానికి పూలుజల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు సుదర్శన్, తడికమళ్ల అర్జునరావు మాట్లాడుతూ బహుజనుల అభివృద్ధి కోసం కాన్షీరాం ఆయన జీవించి ఉన్నంత వరకు అనేక ఉద్యమాలు చేశారని ఆయన సేవలనుటీ సందర్భంగా కొనియాడారు. కాన్షీరాం ఆశయ సాధనకు బహుజనులంతా కృషిచేసిన నాడే ఆయనకు ఘన నివాళి అని వారన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

• మంత్రికి డ్రైవర్ల వినతి

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లాలోని నిరుపేద ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా స్థలం ఉన్న వారికి 5లక్షలు, స్థలంలేని వారికి స్థలంతో పాటు 5లక్షల రూపాయలు కేటాయించాలని కోరుతూ ఐఎన్టీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్. విప్లవ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విప్లవ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది కార్మికులు ఆటోనే జీవనాధారం చేసుకుని జీవిస్తున్నారని వారికి కనీస సౌకర్యాలు లేవని ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల ఫీజులతో ఇబ్బందులు ఎదుర్కోంటున్నారన్నారు. రోజు వచ్చే డబ్బులు ఆటో డీజిల్, కిరాయిలకే సరిపోతున్నాయని, ఆటో డ్రైవర్ల కుటుంబ సభ్యులు సరైన వైద్యం కూడా చేయించుకునే పరిస్థితి లేదని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి ఆటో డ్రైవర్లతో త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బొల్లిని నాగరాజు, కోశాధికారి తోట సైదులు, నగర అధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నగర కమిటీ సభ్యులు నరసింహారావు, ఎం.వెంకట్ నాయుడు, బాలకృష్ణ, జానీ, గోపాల్, శంకర్, నాగ హుసేన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో హథి రాం బాబాజీ, సంత్ సేవాలాల్ మహారాజ్ భక్తి సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రెండు రా ష్ట్రాల స్థాయి సీనియర్, జూనియర్ కబడ్డీ పోటీలను ఈ నెల 17, 18, 19 తేదీలలో నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల టీంలు తమ పేర్లను 16వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 7729957972ను సంప్రదించాలని కోరారు.

తల్లపురెడ్డి వెంకట్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో ఇటీవల ప్రభుత్వ లెక్చరర్ ఉద్యోగం పొందిన తల్లాపురెడ్డి వెంకటరెడ్డిని సీపీఐ(ఎం) మండల కమిటీ శుక్రవారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు మాట్లాడారు. జనరల్ కేటగిరీలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నల్లమోతు మోహన్‌రావు, చల్లా నాగేశ్వరరావు, రాజబోయిన సైదులు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, దూల మురళి, తెల్లపరెడ్డి రమణారెడ్డి, మాజీ సర్పంచ్ నిర్మల, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

వ్యవసాయ సాగులో మెళుకువలు పాటించాలి


- ఏఓ బీ.తారాదేవి

నవతెలంగాణ-కామేపల్లి

రైతులు వ్యవసాయ సాగులో మెళుకువలు పాటించాలని ఏఓ బీ.తారాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని రైతు వేదికలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ తారాదేవి మాట్లాడుతూ రైతులకు మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షలు, రసాయన ఎరువుల వినియోగం తగ్గించుట, పచ్చి రొట్ట ఎరువుల వినియోగం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీకన్య, రైతులు పాల్గొన్నారు.

'డీఆర్ఎస్'లో క్రీడాపోటీలు ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మం



మామిళ్లగూడెంలో డీఆర్ఎస్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించే గేమ్స్ అండ్ స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలను కళాశాల కరెస్పాండెంట్ వీ.మోహన్‌రెడ్డి, చైర్ పర్సన్ వీ.శోభారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ టీ.నాగేశ్వరరావు, ఏవో బీ.వెంకటకృష్ణ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలలో రాణించాలని, ఆటలకు కళాశాల ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ నెల 14 నుండి శనివారం 3 రోజులపాటు నిర్వహిస్తున్నామని తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

నవతెలంగాణ-ఎరుపాలెం

పార్లమెంటు సభ్యులు నామా నాగేశ్వరరావు నిధుల నుండి మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని తెల్లపా లెం గ్రామంలో ఐదు లక్షల రూపాయల నిధులతో సీసీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, మాజీ సర్పంచ్ పెరుగు రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు సగ్గుర్తి కిషోర్ బాబు, ఆవుల ముత్తయ్య, శీలం జనా ర్దన్‌రెడ్డి, బుర్ర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పెంపకంపై శిక్షణ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

చేప పిల్లల పెంపకం, యాజమాన్య పద్ధతులు' అనే అంశంపై గ్రామీణ యువత, రైతులకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మంగళగూడెంలో ఆర్ఎఎస్ చేప పిల్లల పెంపకం యూనిట్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవయాధికారి విజయనిర్మల, మత్స్యశాఖ ఏడీఏ ఆంజనేయస్వామి మాట్లాడారు. చేప పిల్లల పెంపకం గురించి అవగాహన కల్పించారు. చేపల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు అరుణజ్యోతి, శరత్ బాబు, లక్ష్మణ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

నవతెలంగాణ-నేలకొండపల్లి

రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం మండలంలోని పైనంపల్లి గ్రామం వద్ద జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం నేలకొండపల్లి గ్రామానికి చెందిన సామల వెంకటరమణ భర్తతో కలిసి బైక్ పై కోదాడ శుభకార్యానికి వెళ్లి వస్తున్నారు. పైనంపల్లి వద్దకు రాగానే బైక్ నడుపుతున్న ఆమె భర్త స్పీడు బ్రేకర్లు గమనించకపోవడంతో బైక్ స్కిడ్ కావడంతో ఇద్దరు కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో భార్య సామల వెంకటరమణ తలకు బలమైన గాయం అయింది. ఆమెను ప్రాథమిక చికిత్స స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఖమ్మం తరలించారు.

సీఎం చిత్రపటానికి పూలాభిషేకం

నవతెలంగాణ-కల్లూరు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో శుక్రవారం కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పూలాభిషేకం చేశారు. ప్రముఖ వైద్యులు పైడిపల్లి రాధాకృష్ణమూర్తి, మద్దిలేని రాధాకృష్ణ కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకర్ల రంగారావు, కట్ట గోపాలరావు, కే. కృష్ణమూర్తి, ఏనుగు సత్యంబాబు, ఆళ్ల వెంకటేశ్వరరావు, నున్న కృష్ణయ్య, బొప్పన శ్రీనాథ్, నున్న వెంకటయ్య, చావా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు రాక వెతలు...

ఇబ్బందులు పడుతున్న విద్యావాలంటీర్లు

- జీతాలు రాక మూడేండ్లు
- ఆందోళనలు చేసినా ఫలితం శూన్యం



కొత్తగూడెంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం (ఫైల్)

నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యా బోధన అంటే ఎంతో మక్కువ...పేద ప్రజలకు పాఠాలు చెప్పాలని ఆశ...ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలని లక్ష్యం..ఉన్నత చదువులు ఉన్నప్పటికీ...తక్కువ వేతనాలకు పనిచేసేందుకు ముందుకు వచ్చిన వాలంటీర్ల పరిస్థితి దయనీయం. 2020లో పనిచేసిన కాలానికి నేటికీ వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సమారు 750 మందికి 2020 సంవత్సరం జనవరి, ఫిబ్రవరి, మార్చి మూడు నెలలకు జీతాలు రాలేదు...వాలంటరీ సంఘాల నాయకులు గత మూడు సంవత్సరాలుగా గడచిన ప్రభుత్వ మంత్రులను, నూతనంగా ఏర్పడ కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులను కలిసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2019-20 విద్యా సంవత్సరానికి విద్యా వాలంటరీలను ప్రభుత్వం నియమించింది. జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లాలోని 23 మండలాలలో సుమారు 750 మందిని, నెలకు రూ.12 వేల వేతనంకి నియమించారు. 2019 డిసెంబర్ నెలాఖరు వరకు వేతనాలు సక్రమంగా చెల్లించారు. 2020 జనవరి, ఫిబ్రవరి, మార్చి వేతనాలు చెల్లించలేదు. 2020 మార్చి 20 తరువాత కోవిడ్-19 కారణంగా పాఠశాలలకు సెలవులు విధించారు. విద్యావాలంటరీల వ్యవస్థను నిలిపివాశారు. జీతాలు ఎప్పటికైనా ఇస్తారని ఆశతో ఉన్న వాలంటరీలకు 2024 మార్చి4వ తేదీ వరకు ఒక్క పైస జీతం రాలేదు. జిల్లా వ్యాప్తంగా 750 మందికి సుమారు రూ.1కోటి 50 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. గత 3 సంవత్సరాలలో ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, మంత్రులకు, జిల్లా కలెక్టర్‌లకు వినతులు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల తాజాగా జిల్లాలోని రెండు మండలాలకు చెందిన వారికి రెండు నెలల వేతనాలు ట్రెజరీ నుండి విడుదల చేసినట్లు సమాచారం. మిగిలిన వారికి జీతాలో ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి కనిపిస్తుంది.

మూడేండ్లుగా తిరుగుతున్నాం

అసలే చాలీచాలని జీతాలతో జీవితాలతో కొనసాగించిన విద్యావాలంటీర్లు అడుగడుగునా నిర్లక్ష్యానికి గురయ్యారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండడంతో పోషణ భారమై, డిగ్రీలు, పీజీలు, బిఈడీలు చదివిన వారు సైతం తక్కువ వేతనాలకు విద్యా వాలంటీర్లుగా మారారు. 2020 నుండి నేటి వరకు ఒక్క పైసా రాలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మేము పస్తులుండాల్సిన దుస్థితి దాపురించిందని, పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీలో వాలంటరీలుగా పనిచేసిన వారికి ప్రత్యే ప్రాధాన్యత కల్పించాలి. లక్షలాది రూపాయల వేతనాలు పొందుతున్న రెగ్యూలర్ టీచర్లకు సమానంగా విద్యాబోధన చేసిన వాలంటరీలకు ప్రభుత్వం సరైన న్యాయం చేయాలి. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వ విద్యా వాలంటీర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, తాజా డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రత్యేక ప్రధాన్యత కల్పించాలని, రాబోయే విద్యా సంవత్సరంలో విద్యా వాలంటరీలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి.

వాలంటరీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు
కుమార్ లాల్

కాంగ్రెస్ పథకాలే మహిళలకు శ్రీరామ రక్ష

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-పినపాక

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రాష్ట్రంలోని మహిళలకు, పేద ప్రజలకు శ్రీరామ రక్ష అని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలో పర్యటనలో భాగంగా ఈ బయ్యారం, మల్లారం గ్రామపంచాయతీ కార్యాలయాలను ప్రారంభించారు. అనంతరం గ్రామస్తుల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రతి ఒక్కరినీ పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకు మేలు జరిగే విధంగా రూపకల్పన చేశారని తెలిపారు. మహిళలు బాగుంటేనే వారి ఇల్లు బాగుంటుందని, తద్వారా సమాజం, రాష్ట్రం బాగుంటుందని నమ్మి రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన హామీలు నాలుగు అమలు చేశామన్నారు. జిల్లా మంత్రులు బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలుపవచ్చని, మణుగూరు ప్రజా భవన్ కార్యాలయంలో అందుబాటులో ఉంటామన్నారు. తనను కలవడానికి ఎటువంటి పైరవీలు అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, యువజన కాంగ్రెస్ నాయకులు కొరసా ఆనంద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,అర్జున్, తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, మాజీ సర్పంచులు, పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రియాంక అలా



నవతెలంగాణ-పాల్వంచ

సత్వరమే ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి కలెక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశపు హాలులో ధరణి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మీసేవ ధ్రువీకరణ పత్రాలు, సీతమ్మ సాగర్, ఇసుక రీచ్‌లు, అటవీ భూములు తదితర అంశాల్లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులపై రెవెన్యూ, అటవీ, సర్వే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణి ఫిర్యాదు వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేయాలని కూలంకషంగా పరిశీలించిన తదుపరి మాత్రమే సిఫారసు చేయాలని చెప్పారు. రానున్న ఏడు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న ధరణి ఫిర్యాదులన్నిటిని క్లియర్ చేయాలని చెప్పారు. దరఖాస్తు తిరస్కరణకు గురైన పక్షంలో అందుకు గల కారణాలను చెక్ లిస్టులో నమోదు చేయాలని చెప్పారు. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్, మీసేవ పెండింగ్ దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అన్ని మండలాల్లోని తహసీల్దారులు, ఆర్డీవోలు తమ పరిధిలోని దరఖాస్తులన్నీ పది రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కొన్ని మండలాల్లో పెండింగ్ దరఖాస్తులు అధికంగా ఉన్నాయని ఎందుకు ఎన్ని పెండింగ్ ఉన్నాయని అధికారులను ప్రశ్నించారు. సోమవారం కల్లా అన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు ప్రాజెక్టులకు అవసరమైన పెండింగ్ భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను రెండు రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ నెల 18వ తారీకు నుండి జరిగే పదవ తరగతి పరీక్షలకు ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక కావలసినవారు మన ఇసుక వాహనం https://tsmiv.cgg.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్‌లైన్లో బుక్ చేసుకోవాలని చెప్పారు. ఇసుక సంబంధించిన ఫిర్యాదులు, సందేహాలను నివృత్తి కోసం 08744 241950 హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు.

అటవీ శాఖ పరిధిలో పెండింగ్లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారానికై అటవీ, రెవెన్యూ, సర్వే జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి వారి సంతకాలతో కూడిన నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రవీంద్రనాథ్, ఆర్డీవోలు మధు, దామోదర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఏవో గన్య అన్ని మండలాలు తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

రాగితీగ అపహరణ

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని తూర్పుగూడెం, కొత్తతండా గ్రామాలలోని వ్యవసాయ భూమిలో ఉన్న 25 కెపాసిటీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీకి గురైన సంఘటన గురువారం రాత్రి జరిగింది. విద్యుత్ శాఖ అధికారుల వివరాల ప్రకారం... ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేసి అనంతరం ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారన్నారు. చోరీ విషయం రైతులు విద్యుత్‌శాఖ అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారన్నారు. ఆ గ్రామాలకు సంబంధించిన బొమ్మనపల్లి సబ్ స్టేషన్ విద్యుత్ శాఖ అధికారి పిండిపోలు బుజ్జి కన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ట్రాన్స్ఫర్మర్ల నుండి దొంగిలించిన రాగితీగ విలువ రూ.6,600ఉంటుందని తెలిపారు.

నిత్య అన్నదాన సత్రానికి 25 క్వింటాళ్ల బియ్యం వితరణ

- ఐటీసీ యాజమాన్యానికి ఈవో కృతజ్ఞతలు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి ఐటీసీ పీఎస్‌పీడీ యాజమాన్యం 25 క్వింటాళ్ల బియ్యాన్ని వితరణగా శుక్రవారం అందజేశారు. వచ్చేనెల ఏప్రిల్ 17 తారీకు శ్రీరామనవమి, 18వ తారీకు పట్టాభిషేకాన్ని పురస్కరించుకొని బియ్యాన్ని వితరణగా అందజేసినట్టు యూనిట్ బాధ్యులు చంగల్ రావు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇదే విధంగా ఐటీసీ యాజమాన్యం ప్రతి సంవత్సరం దేవస్థానానికి బియ్యాన్ని అందజేస్తున్నట్లు, అదేవిధంగా దేవస్థానానికి పలు విధాలుగా ఐటీసీ యాజమాన్యం సహాయ, సహకారాలు అందజేస్తున్నందుకు వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ప్రముఖ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, దేవస్థానం ఏఈఓ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం, గ్యాస్ పంపిణీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి

- డీసీఎంఎస్ ఛైర్మెన్ కొత్వాల



నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం, గ్యాస్ పంపిణీ ప్రజలకు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఛైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన 200 యూనిట్‌లలోపు ఉచిత విద్యుత్ పథకం, రూ.500లకు గ్యాస్ పంపిణీ దరఖాస్తు ఆన్‌లైన్ ప్రక్రియలో గ్యాస్ పంపిణీ ప్రక్రియకు సాంకేతిక లోపం తలెత్తడంతో లబ్దిదారులు కొత్వాలతో ఫోన్‌లో మాట్లాడగా ఆయన వెంటనే దరఖాస్తు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఏ.స్వామితో పాటు సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తలెత్తిన సాంకేతిక సమస్యను నివారించాలని కోరారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాకరంగా చేపట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.స్వామి, డీఈ మురళి, మేనేజర్ తంబళ్ల ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, ఎల్‌డీ ఎం కో ఆర్డినేటర్ బద్ది కిషోర్, కాంగ్రెస్ నాయకులు బట్టు మురళి, చాంద్ పాషా, కాపా శ్రీను, సూర్య కిరణ్, భరత్, వీరు, ప్రవీణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీడ్ ద నీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఎంపీ నామ జన్మదిన వేడుకలు

- దాతృత్వం చాటుకున్న గారపాటి దంపతులు




నవతెలంగాణ-దమ్మపేట

ఫీడ్ ద నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మెన్, దిశా కమిటీ సభ్యులు గారపాటి సూర్యనారాయణ-అనురాధ దంపతుల ఆధ్వర్యంలో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నల్లకుంట గ్రామానికి చెందిన 75 ఏండ్ల వృద్ధురాలు ఊకే ఈతమ్మ నివాస గృహం శిథిలావస్థకు చేరుకొనగా రేకులు వేయించి రూ.32 వేలతో గృహాన్ని పునర్:నిర్మించి అందజేశారు. అదే విధంగా వృద్దులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోడెం వెంకట్, వంకా జేమ్స్, పొట్టా వీరాస్వామి, పర్సిక వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు

- ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు పోయిన ఎల్సీలు ఇవ్వడం లేదు
- విద్యుత్ శాఖ తీరుపై మండిపడ్డ సహకార సంఘ ఛైర్మెన్



నవతెలంగాణ-పినపాక

రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు పోయి విద్యుత్ శాఖ అధికారులను ఎల్సి ఇవ్వాలని వేడుకున్నా ఎల్సి ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదని సహకార సంఘ ఛైర్మెన్ రవి శేఖర్ వర్మ మండిపడ్డారు. శుక్రవారం ఆయన జానంపేటలో మాట్లాడారు. జానంపేటలో రైతు పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫర్మర్ ఫీజు పోయి ఎల్‌సి కావాలని రైతులు అడిగితే సాయంత్రం వరకు ఎల్సి ఇవ్వమని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఇలా చేస్తే రైతులు పంట ఎండిపోయే అవకాశం ఉందన్నారు. విద్యుత్ సమస్య వచ్చిన ప్రాంతానికి అధికారులు వచ్చి పరిశీలన చేసి అనంతరం ఎల్సి ఇవ్వాలని కోరారు. రైతులు ఇలాంటి తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.





మానవ అభివృద్ధికి చదువే మూలాధారం

- 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-చెర్ల

మానవుడి అభివృద్ధికి మూలాధారం చదువుతోనేనని మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టీవీ సూరి అన్నారు. శుక్రవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులకు సత్యమార్గం సర్వీస్ సొసైటీ నేతృత్వంలో పలువురు దాతల సహకారంతో పరీక్షా సామగ్రి పంపిణీ కార్యక్రమానికి వారు పాల్గొని మాట్లాడారు. జెట్ స్పీడ్‌లో వెళ్తున్న కాలానికి అనుగుణంగా మనం ఎదగాలంటే ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని వారు కోరారు. చదువు జ్ఞానంతో పాటు నడవడిక, కట్టుబాటులు నేర్పిస్తుందని వారు తెలిపారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్క విద్యార్థి జ్ఞానాన్ని అలవర్చుకొని క్రమశిక్షణతో మెలగాలని అలా మెలిగినప్పుడే మానవాభివృద్ధికి పునాది పడుతుందని వారు తెలిపారు. ప్రతి విద్యార్థి తన నిజ జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కొంటూ చెడు మార్గాలను వక్రమార్గాలను విడనాడి సత్య మార్గం వైపు నడవాలని వారు కోరారు. ఈ సందర్భంగా కస్తూరిబాయ్ గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారిని సరోజినీ తెలిపిన సమాచారం మేరకు ఇద్దరు బాలికల యోగ క్షేమాలను తాను పరిరక్షిస్తానని ఎస్సై హామీ ఇచ్చారు. గతంలో కూడా ఎస్సై పలు వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సత్యమార్గం సర్వీస్ సొసైటీ ఆర్గనైజర్ దొడ్డి హరి నాగ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదివి ప్రయోజకులు కావాలని కోరారు. విద్యార్థులకు సుమారు రూ.11 వేల పరీక్షా సామగ్రి అందించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అధికారులు ఇద్దరినీ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ,అధ్యాపకులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-బూర్గంపాడ్

మండల కేంద్రమైన బూర్గంపహాడ్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థినులకు సురక్షిత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు గుదిగొండ్ల రవికుమార్ శుక్రవారం పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుదిగొండ్ల మాట్లాడుతూ... త్వరలో పది పరీక్షలు రాయబోతున్న విద్యార్థినులకు ఏడు రకాల వస్తువులను పరీక్షా సామగ్రిగా అందించడం జరిగిందని, ఎలాంటి వత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తోకల రవిప్రసాద్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

- వైద్యురాలు డాక్టర్ దుర్గాభవాని

నవతెలంగాణ-పినపాక

గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిరపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ దుర్గా భవాని కోరారు. శుక్రవారం ఉప్పాక గ్రామపంచాయతీ పరిధిలో గల ఎర్రగుంట వలస ఆదివాసి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఎమ్ఎల్ హెచ్పి రామరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుర్గాభవాని మాట్లాడుతూ వలస ఆదివాసీ గ్రామాలతో పాటు గ్రామ పంచాయతీల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పదవతరగతి పరీక్షలు

- ఎంఈఓ క్రిష్ణయ్య



నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈనెల 18వ తేదీ నుండి నియోజకవర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో 3 కేంద్రాలలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని విద్యాశాఖ మండల అధికారి పి.క్రిష్ణయ్య తెలిపారు. పదో తరగతి నిర్వహణ క్రమంలో ఆయన శుక్రవారం నవతెలంగాణతో మాట్లాడారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగే కేంద్రాలలో పారిశుధ్యం, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం తప్పనిసరిగా ఉండేటట్లుగా ఎండీఓ శ్రీనివాస్‌ను కోరామని తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధిత గ్రామపంచాయతీ సిబ్బందితోను, ఎంపీడీవోతోను సంప్రదించి మూడు రోజుల ముందు నుండే ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, తాగునీటికి, మరుగుదొడ్లలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా పరీక్షా పత్రాల గోప్యతను పర్యవేక్షించునున్నట్లు కలెక్టర్ తెలిపారు.

మూడు పరీక్షా కేంద్రాల్లో 642 మంది విద్యార్థుల పరీక్షల నిర్వహణ కోసం ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్‌లు, ముగ్గురు డిపార్మెంట్ ఆఫీసర్లు, 21 మంది పర్యవేక్షకులు ఉంటారని తెలిపారు. ప్రతి కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది ఉండేటట్లుగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించి మండలానికి మంచి పేరు తేవాలని అధికారులను పరీక్షల నిర్వాహకులను ఆయన కోరారు. పిల్లలందరూ ఎటువంటి భయం లేకుండా, ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు.

24 మందిపై పూసపల్లి కుట్రకేసు నమోదు చేయడం దుర్మార్గం

నవతెలంగాణ-ఇల్లందు

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ లీగల్ అగ్రనాయకులు సాదినేని వెంకటేశ్వరరావు, కే.గోవర్ధన్, గౌని ఐలయ్య, జే.సీతారామయ్య తదితర 24 మందిపై 120బితో పాటు ఆయుధాల చట్టంతో పూసపల్లి కుట్రకేసు నమోదు చేయడం అత్యంత దుర్మార్గమైనదని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ళ రమేష్ అన్నారు. పూసపల్లి కుట్రకేసును ఉపసంహరించుకోవాలని, రాష్ట్రంలో ఉపా కేసులను ఎత్తివేయాలని, ప్రజాస్వామ్య పాలన అందించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రకమిటీ ప్రచురించిన గోడపత్రికను శుక్రవారం కొల్లాపురంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజాస్వామ్య పాలన ఏడవ గ్యారెంటీగా ఇస్తున్నట్టు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూసపల్లి కుట్రకేసు లాంటివి బహిరంగంగా పనిచేస్తున్న ప్రజా ఉద్యమకారులపై నమోదు చేయడాన్ని వ్యతిరేకించాలని ప్రజలను కోరారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ పట్ల హర్షం

- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-ఇల్లందు

మున్నూరు కాపుల చిరకాల స్వప్నం "తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్" పట్ల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు పింగళి నరేష్, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వర్ రావు, పగడాల చందు, రిపోర్టర్ ఉమా, చిల్ల శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్, మాజీ ఛైర్మెన్ అనసూర్య, రావుల రమేష్, కూతురు అరుణ్ కుమార్, చెట్టి సునీత, మదారమ్మ చంద్రకళ, భారతి, సావిత్రి, సాయి పాల్గొన్నారు.

వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-టేకులపల్లి

జాతీయ పశురోగ నివారణ కార్యక్రమంలో భాగంగా పశువులకు గాలి కుంటువ్యాధి సోకకుండా వైద్య అధికారులు చేపట్టిన వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. శుక్రవారం కోయగూడెం గ్రామంలో పశు వైద్య, పశుసంవర్ధనశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యాధి నివారణ టీకాలను ప్రారంభించి మాట్లాడారు. 15తారీకు నుంచి ఏప్రిల్ 14 తారీకు వరకు పశువులకు గాలికుంటు టీకాలు వేస్తానన్నారు. మండలంలోని పాడి రైతులు వ్యాధి సోకకుండా పశువులకు ముందు గానే టీకాలను వేయించుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వర్ధక శాఖ అధికారి బి.పురంధర్, మండల పశు వైద్యాధికారి వి.సంతోష్, రాజేష్ ఖన్నా, పార్వతి, వెటర్నరీ సిబ్బంది వి.సాధికా, వెంకటేశ్వర్లు, జయమ్మ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | మార్చి 16, 2024 | www.navatelangana.com

లక్ష్మీదేవిపల్లిలో నామ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

ఎంపీ నామా నాగేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూగర్ చైర్మెన్ అన్వర్ పాషా, ఆత్మ కమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్, ప్రశాంతి నగర్ మాజీ సర్పంచ్ చింటూ, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు లావుడియా రామకోటి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు తుంపురి ప్రసాద్, బిఆర్ఎస్ నాయకులు మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.

పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పౌల్ రాజ్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఎంసీ కాలనీలో మాల మహానాడు ముఖ్య కార్యకర్తల బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఉన్న అర్హులైన ఎస్సీ, బీసీ, మైనార్టీల పేద ప్రజలకు ప్రతి కుటుంబానికి డబల్ బెడ్ రూములు ఇల్లు ఇవ్వాలని, గత ప్రభుత్వంలో ప్రతి ఒక్క అధికారులకి వినతి పత్రాలు అందించి అలిసిపోయామని ఆవేదన వ్యక్తపరిచారు. ఈసారైన ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు రామకృష్ణ, రాంబాబు, దుర్గారావు, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం

నవతెలంగాణ-అశ్వారావుపేట

కమ్మ కార్పోరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక కమ్మ సామాజిక వర్గం ప్రముఖులు శుక్రవారం అశ్వారావుపేటలోని మూడు రోడ్ ల ప్రధాన కూడలి లో సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ సీనియర్ నాయకులు మొగళ్ళపు చెన్నకేశవరావు, జేష్ఠ సత్యనారాయణ చౌదరి, సుంకవల్లి వీరభద్ర రావు, కాసాని వెంకటేశ్వరావు, కమ్మ సంఘం అధ్యక్షులు సంకురాత్రి సతీష్, తలసిల ప్రసాద్, అల్లూరి బుజ్జి, ఆంద్రు ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళ హక్కుల్ని కాలరాస్తున్న బీజేపీ

- దాని మిత్రపక్షాలకు వ్యతిరేకంగా పోరాడుదాం : పీఓడబ్ల్యూ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ, మహిళ హక్కుల్ని కాలరాస్తోందని పిఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.నిర్మల అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా పట్టణ కేంద్రంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్డిఓ ఆఫీస్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి భద్రాచలం ఆర్డీవో కి వినతి పత్రం అందజేశారు. తదనంతరం ఏర్పాటు చేసిన సదస్సుకు పీఓడబ్ల్యు భద్రాచలం డివిజన్ ఉపాధ్యక్షురాలు రాపర్తి లక్ష్మి అధ్యక్షత జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఫాసిస్ట్ పాలన సాగుతుందని 2024 ఎన్నికల్లో బీజేపీ గెలవాలని పావులు కదుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ భద్రాచలం డివిజన్ గౌరవ అధ్యక్షురాలు పెద్దగోని ఆదిలక్ష్మి, కార్యదర్శి సున్నం భూలక్ష్మి, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ భద్రాచలం, మణుగూరు సబ్ డివిజన్ నాయకులు పున్నం చందు, పీఓడబ్ల్యు డివిజన్ ఉపాధ్యక్షురాలు కురసం సుజాత, బండ్ల కమల నాయకులు మర్ల కృపారాణి పాల్గొన్నారు.

కిరాణా దుకాణాల్లో చోరీలు

నవతెలంగాణ-అశ్వారావుపేట

పట్టణంలో గురువారం రాత్రి దొంగలు హల్ చల్ చేశారు. అశ్వారావుపేట - జంగారెడ్డిగూడెం రోడ్డులో నాలుగు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. విక్టరీ మినీ సూపర్ మార్కెట్లో లోకి చొరబడిన దొంగ సుమారు రూ.3 వేలు నగదుతో పాటు సెల్ ఫోన్, దుర్గా సూపర్ మార్కెట్లో రూ.3 వేలు నగదును దోచికెళ్ళారు. అదేవిధంగా కూరగాయలు, మరో కిరాణా దుకాణంలోనూ దొంగలు చోరీకి యత్నించారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో దొంగతనం జరిగినట్లు సీసీ కెమెరాల్లో రికార్డైన దొంగతనం ఘటన ఆధారంగా తెలుస్తోంది.శుక్రవారం ఉదయం దుకాణాలు తెరిచేందుకు వచ్చిన యజమానులు దొంగలు చొరబడినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్రీరాముల శ్రీను సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ తో తనిఖీలు నిర్వహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్సై తెలిపారు.

సైనిక్ స్కూల్ ఫలితాలలో 'బ్రిలియంట్' విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-బూర్గంపాడ్

సారపాక బ్రిలియంట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సైనిక్ స్కూల్ ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబర్చినట్లు విద్యాసంస్థల చైర్మెన్ బీఎస్ఆర్ శుక్రవారం తెలిపారు. గురువారం ప్రకటించిన జాతీయస్థాయి సైనిక్ స్కూల్ ఫలితాల్లో జి. రుత్విక్ రామ్ జయభార్గవ్, దీపక్ సాయి, శ్రీరామ్ తేజ్, పృథ్వీసాయిచరణ్ రెడ్డి, నేత్ర నిఖిల్, అజయ్ కుమార్, గౌతమ్ సీట్లు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బిఎస్ఆర్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. బీఎస్ఆర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది సైనిక్ స్కూల్, నవోదయలో సీట్లు సాధించడం బ్రిలియంట్ పాఠశాలకు ఆనవాయితీగా వస్తోందని, మున్ముందు కూడా సీట్లు సాధిస్తామని తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులు

నవతెలంగాణ-చంద్రుగుండ

మండలంలోని ప్రాథమిక పాఠశాలలో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులు ఎమ్మెల్యే పిఏ అనేటువంటి భక్తులు నరేష్ క్లాస్ నిర్వహించారు. పిల్లలకి ఎటువంటి ఒత్తిడికి లోనవ్వకుండా ముందుగా మీకు వచ్చిన ప్రశ్నలని రాసిన తర్వాత మిగతా వాటి గురించి వెళ్ళండి రాని వాటిని గురించి ఆలోచించి ఎక్కువగా డిప్రెషన్ లోకి వెళ్లదన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ యువ నాయకులు చిత్తంశెట్టి నవీన్, రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పదిలో ఉత్తమ ప్రతిభ చూపాలి

- డీఎస్పీ చంద్రభాను

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

పదో తరగతి పరీక్షలను ఆత్మవిశ్వాసంతో మంచిగా రాసి ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఇల్లందు డీఎస్పీ ఎస్.చంద్రభాను విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని మర్కోడు గ్రామంలోని బాలుర ఉన్నత ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన ప్యాడ్, పెన్, పెన్సిల్, చాక్ మార్, ఎరేజర్, తదితర పరికరాలను డీఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులు ఓ ప్రణాళిక ప్రకారం మంచిగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం పాఠశాలకు వాలీబాల్ కిట్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ టి.సురేష్, స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్, ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, టీచర్ కొమరం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL FAMILY COURT.C.C.C.
AT: SECUNDERABAD
F.C.O.P.NO.460 OF 2023
BETWEEN:
Erapula @lakka Swathi D/o.Late Lakka Sathyanarayana W/o. Erapula Chandra Shaker Age :31, Occ.Pvt.Employee, R/o H.no 3-3-8 0, Kurma Basthi, Secundrabad, Hyderabad -500003
And
Erapula Chandra Shaker S/o.Late E.Laxman Rao, Age :36 , Occ. Pvt. Employee, R/o 7-11-136, Pragathi Nagar Colony, Kothagudem, Bhadradri Kothgudem Dist.
Sir
Where as the above named Petitioner had filed the above Original Petition U/s 13 (1) (i-a) (i-b) seeking the Divorce by dissolving the marriage between the petitioner and respondent. The Hon'ble Court posted the matter **on 15-04-2024 at 10-30 A.M.** for objection if any. Therefore, you are requested to appear before the court of Hon'ble judge Family Court C.C.C. Secunderabad **at 10-30 AM on 15-04-2024** in-person, on through the counsel duly instructed, failing which the matter will be subject as ex-parte in your absence.
(By order of the Court)
[Prashanth Kumar Aduri]
Advocate
Cell No: 7386503140
(Counsel for the Petitioner)



అర్ధరాత్రి తోలకాలు

- గృహావసరాలకు దొరకని ఇసుక
- బస్టాండ్ ఆవరణను అడ్డాగా వాడుకుంటున్న కాంట్రాక్టర్లు
- చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

అక్రమంగా ఇసుక దందా..

నవతెలంగాణ-అశ్వాపురం

మండల కేంద్రంలో సీసీ రోడ్లను నిర్మించేందుకు ఓ కాంట్రాక్టర్ కు అక్రమంగా అర్ధరాత్రి వేల ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది. ఓ పక్కన గత కొంతకాలంగా అక్రమ ఇసుక రవాణా జరగకుండా అధికారులు కట్టుదిట్టం చేస్తున్నారు. అయినా సరే కొందరు ట్రాక్టర్ నిర్వాహకులు అధికారుల కండ్లు కప్పి మరి కాంట్రాక్టర్లతో బేర సారాలు కుదుర్చుకుని ఇసుక రవాణాలను చేస్తున్నారు. ఇసుక నిల్వలను మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో ప్రధాన రహదారి పక్కనే నిల్వ చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్ ప్రభుత్వ అనుమతులు ఉన్న ఇసుక రీచ్‌ల ద్వారా ఇసుకను తరలించి పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఇలా అడ్డదారిన ఇసుక కొనుగోలు చేసి పనులు చేపడుతున్నాడని పలువురు అంటున్నారు. అదేవిధంగా ఆర్టీసీ ఆవరణలో సంత నిర్వహణ చేపడితేనే అడ్డుకున్న ఆర్టీసీ అధికారులు ఇలా పెద్ద ఎత్తున ఇసుక, కంకర, హెడ్ మిక్సను నిల్వ చేస్తున్నప్పటికీ స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

గృహ నిర్మాణాలకు దొరకని గుప్పెడు ఇసుక :

మండల కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాలలో నూతన గృహ నిర్మాణాలు ఇతరత్రా నిర్మాణాలు చేపట్టే వారికి గుప్పెడు ఇసుక దొరకక అల్లాడుతున్నారు. ఇసుక కొరత ఏర్పడడంతో ఓ పక్కన గృహ నిర్మాణాలు నిలిచిపోవడంతో పాటు గృహ నిర్మాణ కార్మికులకు సైతం పనులు లేక అలమటిస్తున్నామని కార్మికులు అంటున్నారు. అయినప్పటికీ అక్రమార్కులకు మాత్రం ఇసుక యథేచ్ఛగా రవాణా అవుతుందని కార్మికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణా చేపడుతున్న వారిపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే కార్మికులకు ఉపాధి కల్పించేందుకు గృహ నిర్మాణాల అవసరాల కోసం ఇసుక అనుమతులను ఇవ్వాలని భవన నిర్మాణ కార్మికులు కోరుతున్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు

రు.22.69 కోట్లు మంజూరు

- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాలోని యుడైస్ డేటా ప్రకారం గుర్తించబడిన 697 పాఠశాలల్లో అత్యవసరమైన మౌలిక వసతుల కల్పనకు రూ.22.69 కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీఓలు, అన్ని ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, డీఆర్డీఓ, ఇతర అధికారులతో జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ జిల్లాలో 697 పాఠశాలల్లో అత్యవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు వీటిలో మైనర్ మేజర్ రిపేర్లు, విద్యుదీకరణ, తాగునీటి వసతి కల్పన, బాలికల టాయిలెట్లు వంటి వాటిని గుర్తించి వీటిని త్వరితగతిన పూర్తి చేయడానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారానే పనులు చేయించనున్నట్లు తెలిపారు. దీనికోసం జిల్లాలో గుర్తించబడిన 697 పాఠశాలల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చైర్మన్‌గా, పాఠశాలలో ప్రతి తరగతి నుండి ముగ్గురు పిల్లల తల్లులు కమిటీ సభ్యులుగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీ చైర్మెన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుల పేరుతో ఉమ్మడి బ్యాంక్ ఖాతాను తెరవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆయా నిధులను ఆయా బ్యాంక్ అకౌంట్లకు విడుదల చేయనున్నట్లుగా తెలిపారు.

ఉపాధి హామీ చట్టం కింద చేపట్టే బాలికల టాయిలెట్లు నిర్మాణానికి సంబంధించి ఎస్టిమేట్లను వెంటనే అప్లోడ్ చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంజూరైనటువంటి పనులను ఎటువంటి అలసత్వం లేకుండా నాణ్యతతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు నాణ్యతతో చేయించుకోవాలని, పనులలో నాణ్యత లోపానికి సంబంధిత ప్రధానోపాధ్యాయులు, కమిటీ అధ్యక్షులే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. పాఠశాలలు పున: ప్రారంభ సమయానికి అన్ని మౌలిక వసతులతో పాఠశాలలు కళకళలాడాలని అధికారులను ఆదేశించారు. మండల విద్యాశాఖ



అధికారులు మండల నోడల్ అధికారులు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమంలో శ్రద్ధ తీసుకొని అన్ని పాఠశాలలను తిరిగి పనులన్నీ పూర్తయ్యేటట్లుగా బాధ్యత వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ విద్యా చందన, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర చారి, వివిధ ఇంజనీరింగ్ విభాగాల ఎస్సీలు డీఈలు, పాల్గొన్నారు.

చిన్నారుల ప్రతిభ చిరస్మరణీయం



- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డుల పంపిణీ లో ప్రముఖులు

నవతెలంగాణ-చెర్ల

గురుదేవ్ విద్యాలయం చిన్నారుల ప్రతిభ చిరస్మరణీయమని చర్ల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టీవీ సూరి, నర్సిరెడ్డి, తెలుగు విశ్రాంత ఉపాధ్యాయురాలు వంగర సుజాత అన్నారు. గత నెలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురుదేవ్ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో చూపిన ప్రతిభ 110 మంది విద్యార్థులు 101 పద్యాలు కేవలం 16 నిమిషాల వ్యవధిలో ఏకకంఠంతో చెప్పడంతో ఆ విద్యార్థులకు అరుదైన ఘనత తగ్గింది. అయితే ఆ 110 మందికి విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయురాలు తెలుగు భాష పండితురాలైన సుజాత, చర్ల ఎస్ఐలు టీవీ సూరి, నర్సిరెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో గురుదేవ్ విద్యాలయానికి చెందిన విద్యార్థుల ప్రతిభ వల్ల ఎట్టకేలకు చర్ల ప్రాంతానికి స్థానం దక్కింది. 110 మంది విద్యార్థులు 101 పద్యాలను కేవలం 16 నిమిషాల వ్యవధిలో పద్యార్చన చేసి అత్యద్భుతమైన ప్రదర్శనచేయడంతో అరుదైన ఘనత లభించింది.

గురుదేవ్ పాఠశాలలో విద్యతో పాట విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేలా తీసుకుంటున్న శ్రద్ధను పలువురు ప్రశంసిస్తున్నారు. తెలుగు భాష శతకాన్ని ఇంత అర్థవంతంగా పాడిన విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా గురుదేవ్ విద్యాలయం చర్లలోని చిగురుమళ్ళ శ్రీనివాస్ రాచించిన తెలుగు భాష శతక పద్యార్చన ఘనంగా నిర్వహించబడింది. ప్రధానోపాధ్యాయులు హెచ్. గిరి వెంకట ప్రసాద్, అకాడమిక్ కో -ఆర్డినేటర్ ఎంవీ. సుబ్రమణ్యం ప్రోత్సాహంతో, తెలుగు ఉపాధ్యాయులు ఎస్. విశాల, ఎం. విజయ రాణి, ఏ.హేమలత, కుమారి పి.సంధ్య, కె. నాగేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో 2వ తరగతి నుండి 9వ తరగతి వరకు 110 మంది విద్యార్థులు 101 పద్యాలను కేవలం 16 నిమిషాల వ్యవధిలో పద్యార్చన చేసి అత్యద్భుతమైన ప్రదర్శన చేయడం వలన ఈ ఘనత లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు హెచ్ జీవి గిరిప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వారిలో ఉన్న ప్రతిభ పాటవాలను గుర్తించి వారికి ఒక గుర్తింపు తేవాలన్న ఆలోచన దేశ, విదేశాలను పర్యటించి అక్కడి సంస్థల కార్యచరణలను తెలుసుకొని సంస్థకి సంబంధిత సమాచారాన్ని అవగాహన చేసుకొని మారిషష్, సింగపూర్, శ్రీలంక, బ్యాంకాక్, మలేసియా వంటి దేశాల తెలుగు సంఘాల వారితో చర్చించి తుదకి తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్ కి తిరుపతిలో జరిగిన 4వ తెలుగు ప్రపంచ మహా సభలను పురస్కరించుకొని వెలసిన ఈ సంస్థ మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా సంస్థ లోగోను హైదరాబాద్ లో వారి ఛాంబర్లో 2012 డిసెంబర్ 24న ఆవిష్కరించారని గుర్తు చేశారు. తొలుత విశిష్ట అతిథులకు పాఠశాల యాజమాన్యం శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు విద్యార్థులు, పుర ప్రముఖులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత కక్షతో వ్యక్తిపై దాడి

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

పాత కక్షతో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. శుక్రవారం గ్రామస్తుల వివరాల ప్రకారం.. రాయిపాడు (రామచంద్రయ్య గుంపు) తుమ్మ రమేష్, వాసం రవీందర్ లకు గత కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఇరువురి మధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చేరడంతో మారణాయుధాలతో విచక్షణా రహితంగా ఇరువురు తీవ్రంగా కొట్టుకున్నారు. రవీందర్ గొడ్డలితో రమేష్ ను తలపై వెనుక నుంచి మోది అక్కడి నుంచి పరారయ్యాడు. తలకు తీవ్ర గాయమైన రమేష్ స్పృహ కోల్పోయి అక్కడే పడిపోయాడు. అది చూసిన రాము కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్, 108 కు సమాచారం ఇవ్వడంతో వచ్చిన ములకలపల్లి 108 వాహనం ఈఎంటి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి వాహనంలో తీసుకెళ్లారు. రమేష్ పరిస్థితి విషమంగా ఉందని ఖమ్మం నగరానికి కుటుంబ సభ్యులను తీసుకుని వెళ్లమని అక్కడి వైద్యులు సూచించారు. ఖమ్మంలో శుక్రవారం అతడి ఆరోగ్య పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు సూచనప్రాయంగా తెలిపారు. ఇదిలా ఉంటే విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్ పోలీస్ సిబ్బందిని ఘటనాస్థలానికి పంపించి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. గాయాలతో పరారీలో ఉన్న రవీందర్ ను అదుపులో



తీసుకుని ఆళ్ళపల్లి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి ఎస్సై పంపించారు. రవీందర్ కు సైతం తలపై రెండు చోట్ల 20 కుట్లు పడ్డాయని వైద్యాధికారి అర్వపల్లి రేవంత్ తెలిపారు. కేసు పూర్వాపరాలు అనంతరం స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- అసోసియేట్ డీన్ హేమంత్ కుమార్



నవతెలంగాణ-అశ్వారావుపేట

కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా మహిళలు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కళాశాలను ములకలపల్లికి చెందిన గుడ్ షెఫర్డ్ ఎన్జీవో సంస్థ ద్వారా మహిళా రైతులు సందర్శించారు. సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆధునిక వ్యవసాయ యాజమాన్య పద్ధతులు, అదనపు ఆదాయ మార్గాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, వారికి కళాశాల ప్రొఫెసర్లు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ మహిళలు అన్నీ రంగాల్లో విశేష గుర్తింపు సాధించాలని, వ్యవసాయ అనుబంధ రంగాలైన పుట్టగొడుగుల పెంపకం, వానపాముల ఎరువు తయారీ, జీవన ఎరువుల తయారీ, తేనెటీగల పెంపకం గురించి వివరించారు. ఈ కుటీర పరిశ్రమలను నిర్వహిస్తే మహిళలకు అదనపు ఆదాయం వస్తుందని తద్వారా ఆర్థికంగా బలోపేతం కావొచ్చన్నారు. అనంతరం మహిళా రైతులు కళాశాలలోని కుటీర పరిశ్రమలను పరిశీలించి, అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు కే గోపాలకృష్ణమూర్తి, దీపక్ రెడ్డి, శిరీష, టీ.పావని, పీ.శ్రీలత, పీ.రెడ్డిప్రియా, మహిళలు పాల్గొన్నారు.

వస్తువు కొనుగోలుకు రసీదు తప్పనిసరి

- జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి

నవతెలంగాణ-పాల్వంచ



వస్తువు కొనుగోలుకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి సూచించారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి మాట్లాడుతూ వినియోగదారులందరూ తాము కొనుగోలు చేసిన వస్తువులకు విధిగా బిల్లులు తీసుకోవాలని, కొనుగోలు చేసిన వస్తువు ఏదైనా చెడిపోతే వినియోగదారుల హక్కు ఫోరంలో ఫిర్యాదు చేసి తమకు జరిగిన నష్టాన్ని తిరిగి పొందవచ్చని తెలిపారు.

ప్రయివేటు స్కూల్స్, కాలేజీలలో అన్ని తరగతులు ఫీజులు, బస్సుల చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తున్నారని, వాటిని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేసినప్పుడు విధిగా బిల్లు తీసుకోవాలనికోరారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలోని రైతులందరికీ పత్తి విత్తనాలు, ఎరువులు కొనుగోలుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తూనికలు కొలతలు అధికారి మనోహర్, డిఎం సివిల్ సప్లై త్రినాథ్ బాబు, డ్రగ్ ఇన్స్పెక్టర్ సంపత్ కుమార్, అసిస్టెంట్ ఇన్ ప్రొహిబిషన్ ఎక్సైంజ్ కరంచంద్, కన్స్యూమర్ రైట్ ఆర్గనైజేషన్ గుగులోతు బాలు, రాజ్ పుత్ ఆర్గనైజేషన్ కొత్తగూడెం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్లను అందజేసిన జమాల్ ఖాన్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఉపవాస దీక్షలు చేస్తున్న పేద మధ్యతరగతి ముస్లిం కుటుంబాలకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం కూనవరం మండలంలోని కూనవరం, భీమవరం, టేకుల బోరు గ్రామాలకు, విఆర్ పురం మండలంలోని 10 కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. కూనవరం మండలంలో 60 కుటుంబాలకు ఇదే తరహాలో రంజాన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ మాట్లాడుతూ రంజాన్ ఉపవాస దీక్షలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంటాయని పేదవారి ఆకలి తప్పులను తెలుపుతూ ధనిక వర్గాల వారికి అవగాహన కలిగిస్తూ అల్లా సన్నిధికి తోడ్పడేలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ పురం గ్రామ పెద్దలు సర్పరాజ్, ముస్లిం కమిటీ సభ్యులు, మరియు కూనవరం మజిద్ కమిటీ సూఫీ, షరీఫ్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ దీపాలు పంపిణీ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని మానుగట్ట వలస గుత్తికోయ గ్రామంలో 141 బెటాలియన్ సీఆర్పిఎఫ్ ఏ కంపెనీ ఆధ్వర్యంలో, దుమ్ముగూడెం పోలీసుల సహకారంతో శుక్రవారం కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. గ్రామస్తుల కోరిక మేరకు వారికి కావాల్సిన సోలార్ విద్యుత్ దీపాలను ఇంటికి ఒకటి చొప్పున మొత్తం 40 సోలార్ విద్యుత్ దీపాలను, చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, డ్రాయింగ్ మెటీరియల్, లంచ్ బాక్సులు, వాటర్ బాటిల్స్ ఇతరత్రా సామాన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన 141 బెటాలియన్ సిఆర్పిఎఫ్ సెకండ్ ఇంచార్జ్ ప్రీత, అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జునన్, దుమ్ముగూడెం సిఐ బి.అశోక్ లు మాట్లాడుతూ.... శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ఆదివాసీ ప్రజల సంక్షేమం కోసం సిఆర్పిఎఫ్, పోలీస్ శాఖలు ఎప్పుడు కృషి చేస్తూనే ఉంటాయని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ -దుమ్ముగూడెం

విద్యుత్ సరఫరాలో అంతరాయం సందర్భంగా విద్యుత్ వినియోగదారులు అన్ని విధాల సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ మోహన్ రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు మూడవ శనివారం ఉప కేంద్రం మరమ్మతుల నిమిత్తం ఎల్సి తీసుకున్నట్లు చెప్పారు. కావున దుమ్ముగూడెం ఉప కేంద్ర పరధిలో గల గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించలని ఆయన తెలిపారు.

పది పరీక్ష కేంద్రాలను సందర్శించిన మండల విద్యాశాఖ అధికారి

నవతెలంగాణ - జూలూరుపాడు



పది పరీక్షలు ఈ నెల 18 నుండి ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన సెంటర్లు జడ్పీహెచ్ఎస్ జూలూరుపాడు స్కూలు, సెంట్ ఆంటోనీ స్కూల్ లను శుక్రవారం ఎంఈవో పరిశీలించారు. సెంటర్ లలో ఫర్నిచర్ ను, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జూలూరుపాడు స్కూల్ సీనియర్ ఉపాధ్యాయులు రామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పత్తాలేని డీఈ, ఏఈలు

- ఇది ములకలపల్లి R&B సబ్ డివిజన్ కార్యాలయం దుస్థితి

- జర దేకో కలెక్టర్ మేడం

నవతెలంగాణ-ములకలపల్లి



ములకలపల్లి కేంద్రంలో రహదారులు భవనాలు శాఖ సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. పేరుకే కార్యాలయం ఇక్కడ ఉండాల్సిన డీఈ, ఏఈ, ఆఫీస్ స్టాఫ్ ఒక్కరోజు కూడా కార్యాలయంలో ఉన్న పాపాన పోలేదనిసీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, మండల కార్యదర్శి ఎండీ యూసుఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆఫీస్‌లో కనీస సౌకర్యాలు లేవు.. ఆయమన్న ఫ్యాన్, కుర్చీలు లేవన్నారు. ఈ కార్యాలయంలో పట్టుమని డీఈ, ఏఈలను చూసింది లేదని ఆరోపిస్తున్నారు. ఆఫీస్ కు అభివృద్ధి పనులు వివరాలు తెలుసుకునేందుకు వస్తే అధికారి లేరు, ఫోన్ చేస్తే డీఈ లిఫ్ట్ చేయడం లేదని అన్నారు. లక్షల రూపాయలు వేతనం తీసుకోని ప్రజలకు జవాబు దారిగా ఉండాల్సిన డీఈ ఎక్కడ ఉంటాడో ఎవరికి తెలియదన్నారు. కలెక్టర్ గారు ఒక్కసారి ములకలపల్లి R&B ఆఫీస్ వైపు చూడండని కోరుతున్నారు. మండలంలో సంబంధిత శాఖ ఆధ్వర్యంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతుంటే పని ప్రదేశంలో ఉండి పని పర్యవేక్షణ చెయ్యాల్సిన అధికారులు కంటికి కనపడరని తెలిపారు. కంటికి కనపడని కార్యాలయానికి రాని డీఈ, ఏఈలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ : ఈనెల 16న, తల్లాడ ఫీడర్లో, మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని శుక్రవారం ఏఈ రాజేష్ ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 9 గంటల నుండి 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తల్లాడ, నారాయణపురం, మల్లవరం ప్రజలు సహకరించాలని, ఏఈ కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | మార్చి 16, 2024 | www.navatelangana.com



అనారోగ్యంతో సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు మృతి

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని గోవిందాపరం ఎల్ గ్రామానికి చెందిన సిపిఎం నాయకుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు మాతృమూర్తి, లక్ష్మీపురం ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత అత్త జొన్నలగడ్డ లక్ష్మీ నరసమ్మ (80) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. సిపిఎం నిర్వహించే కార్యక్రమాలలో ఆమె చురుకుగా పాల్గొనేది. గత కొన్ని రోజులగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతుంది. పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతదేహాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు,. రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులకు సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, లక్ష్మీపురం సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు, ఐలూ రాష్ట్ర అధ్యక్షులు ఏడునూతల శ్రీనివాసరావు, సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి మాదినేని నారాయణ, మాజీ సర్పంచ్ కొమ్ము కమలమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు ఏడునూతల లక్ష్మణరావు, మాజీ ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శిలు కోట కాటయ్య, కళ్యాణపు బుచ్చయ్య, సొసైటీ డైరెక్టర్ కళ్యాణపు శ్రీనివాసరావు, నాయకులు పొన్నం రాంబాబు, మాజీ ఎంపీపీ కొమ్ము శ్రీనివాసరావు, సిపిఎం చింతకాని మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు షేక్ జబ్బర్, కెవిపిఎస్ నాయకులు ఏసుపోగు బాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

తమ్మారపు సక్కుబాయిని పరామర్శించిన పోతినేని

గోవిందపురం ఎల్ గ్రామానికి చెందిన తమ్మారపు సక్కుబాయిని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు శుక్రవారం గోవిందాపురం ఎల్ గ్రామంలో పరామర్శించారు. గత నెల రోజుల క్రితం అనారోగ్యంతో ఖమ్మంలోనే ఆరోగ్య హాస్పిటల్‌లో చికిత్స పొంది కోలుకొని ఇటీవల ఇంటికి వచ్చారు. ఈ విషయాన్ని ఆ గ్రామ సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ తుళ్లూరి రమేష్, సిఐటియు మండల మాజీ కార్యదర్శి వల్లంకొండ సురేష్, సిపిఎం నాయకులు కోట కాటయ్య, కళ్యాణపు బుచ్చయ్య , పసుపులేటి వెంకటేశ్వర్లు నాయకులు ఏసుపోగు బాబు తదితరులు ఉన్నారు.

28న జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం మార్చి 15న జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 2023-24 సంవత్సరాల బడ్జెట్‌ని ప్రవేశపెట్టి ఆమోదించారు. 2024-25 నూతన బార్ అసోసియేషన్ కమిటీని ఎన్నుకోవడం కోసం ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల అధికారిగా మారగాని శ్రీనివాసరావు, సహాయ ఎన్నికల అధికారులుగా కూరపాటి శేఖర్ రాజు, రాయల పావెల్ ను నియమించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసారు. ఈ నెల 18 నుండి 20 వరకు నామినేషన్లు స్వీకరణ, 21న నామినేషన్లు పరిశీలన, 22న నామినేషన్ల ఉపసంహరణలు, పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. 28- 03- 2024 న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఓట్లు లెక్కింపు, ఫలితాలు ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహకాలు

నవతెలంగాణ-సత్తుపల్లి

మండలంలోని గంగారం గ్రామంలోని శ్రీ దాసరి వీరారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వాగ్దేవి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం జయరాజు అధ్యక్షతన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభను వాగ్దేవి పూర్వ విద్యార్థి సంఘం బేతుపల్లి గంగారం వారి ఆధ్వర్యంలో వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. సంఘ కోశాధికారి బాల నాగేశ్వరరావు పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే 106 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జియోమెట్రి బాక్సులు, పెన్నులు, పెన్సిల్లు, స్కేల్స్ తో పాటు రూ. 10వేలు విలువైన బోధనోపకరణాలను అందజేశారు. పదో తరగతి ఫలితాలలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ. 5వేలు, ఐఐటీ సీటు సాధించిన విద్యార్థులకు రూ.10వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో జూన్ నుండి ఏప్రిల్ వరకు అత్యధిక హాజరు శాతం కలిగిన విద్యార్థులకు, వార్షిక పరీక్షలలో అత్యధిక మార్కులు పొందిన 6 నుండి 9వ తరగతి విద్యార్థులకు కూడా నగదు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు వై శ్రీనివాస రెడ్డి, చెరుకు శ్రీనివాసరావు, థామస్, ప్రభాకర్, ఉదయకుమార్ పాల్గొన్నారు.



డిజిటల్ లైబ్రరీని ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ఖమ్మం జిల్లా కోర్టులో నూతన డిజిటల్ లైబ్రరీని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి బసవయ్య, ఉపాధ్యక్షుడు మాధిరాజు లక్ష్మీ నారాయణ, కోశాధికారి ఎం.జె.ప్రవీణ్ కుమార్, గ్రంథాలయ కార్యదర్శి గాజుల అమర్ నాథ్, కె.వి వి.లక్ష్మి బార్ కార్యవర్గం, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఐఎన్‌టీఎస్‌వో జాతీయ పరీక్ష ఫైనల్ ఫలితాలల్లో ఖమ్మం మమత హాస్పిటల్ రోడ్ నందు గల శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. వీరిలో 7వ తరగతి చదువుతున్న గోకుల్ శ్రీనాథ్, 9వ తరగతికి చెందిన జి.పూజిత తేజస్వి, గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాప్‌ట్యాప్‌లను దక్కించుకున్నారు. వీరితోపాటు 8వ తరగతి చదువుతున్న ఏ.సాయి మహేష్, 3వ తరగతి చదువుతున్న శ్రేష్ఠరెడ్డి ద్వితీయ బహుమతి స్మార్ట్ వాచ్ గోల్డ్ మెడల్స్, 6వ తరగతి చదువుతున్న బాలు శ్రీ సాయి శౌరి, 6వ తరగతికి చెందిన జి.విదుర్, 7వ తరగతికి చెందిన ప్రణవ్ చౌదరి, 8వ తరగతికి చెందిన లక్ష్మణరావు నాలుగోవ బహుమతి, గోల్డ్ మెడల్ సాధించారు. 4వ తరగతికి చెందిన కృతి శ్రీ, 9వ తరగతికి చెందిన రాజ్యవర్ధన్ వర్మ ఐదవ బహుమతి, గోల్డ్ మెడల్స్ సొంతం చేసుకున్నారు. దాదాపు 467 మంది విద్యార్థులు గోల్డ్‌మెడల్, మెరిట్ సర్టిఫికెట్ సాధించారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మెన్ మల్లెంపాటి శ్రీధర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, ఏజీఎం చేతన్ మాధుర్, కో ఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపల్స్ టిఎల్ఎన్ శర్మ, రాజ్‌కుమార్ జోషి, ఏడుకొండలు, వైస్ ప్రిన్సిపల్స్ రామకృష్ణారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. శుక్రవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్కోడు గ్రామానికి చెందిన కీసరి నరేందర్, కీసరి సాయిరాం ఓ బైక్ పై మర్కోడు వైపు వెళ్తుండగా.. నడి మిగూడెం గ్రామానికి చెందిన పాయం శేషు, మద్దెల సాయి, మద్దెల అజయ్ ఓ బైక్ పై గురువారం రాత్రి కొత్తగూడెం వెళ్తున్న క్రమంలో మండల పరిధిలోని బండారుగూడెం సమీపంలో ఇరు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ఢీకొన డంతో నరేందర్, సాయిరాం, శేషులకు కుడి కాళ్ళకు తీవ్రంగా గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న బాటసారులు క్షతగాత్రులను ఆళ్ళపల్లి పీహెచ్ సికి ప్రైవేట్ వాహనాల ద్వారా తీసుకుని వచ్చి వైద్య సిబ్బందితో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం స్థానికంగా ఉండే 108 వాహనం సుమారు గత వారం రోజులుగా అందుబాటులో లేకపోవడంతో గుండాల మండలం 108 వాహనంలో ఇద్దరిని, మరో చోట నుండి వచ్చిన 108 వాహనంలో మూడో క్షతగాత్రుడిని కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి ఆలస్యంగానైనా వచ్చి తీసుకెళ్లారు. సాయిరాం, శేషులకు మోకాలు భాగంలో విరిగినట్లు, నరేందర్ పాదంలో తీవ్రంగా గాయమవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నీటికి కటకట..




- బావురమంటున్న వ్యవసాయ బావులు, బోర్లు
- అడుగంటిన భూగర్భ జలాలు
- మొక్కజొన్న, వరి పంటలను రక్షించుకునేందుకు రైతులు పాట్లు
- బావుల్లో పూడికతీతలు.. అయినా రాని నీళ్లు

నవతెలంగాణ-ముదిగొండ

మండలంలో సాగు నీళ్ల లేక కాలం కటకటగా మారింది. బోర్లు, వ్యవసాయ బావులు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. నివాసంలో ఉన్న నీళ్ల వ్యవసాయానికి లేకపోవటంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. తొలకరిలో అడపదడప పడిన వర్షపు జల్లులకు రైతులు పత్తి, వరి, మిర్చి, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. రైతులు సాగుచేసిన పంటలు ఆశించిన మేరకు దిగుబడులేక పత్తి ఆగమైంది. వరి పంట బయటపడింది. మిర్చి తోటలు వైరస్‌కి గురికాగా, రైతులు తోటలను రక్షించుకునేందుకు అధిక పెట్టుబడి పెట్టారు.

మండలంలో గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ వరకు వర్షాలు పడినాయి. అంతటితో వర్షపాతం మండలంలో సక్రమంగా నమోదు కాకపోవటం, సాగర్ డ్యామ్ లోకి నీళ్ల ఆశించిన మేరకు చేరకపోవడం, కాలువకు సాగర్ జలాలు రాకపోవడం రైతులు 50శాతం సాగు చేసిన పంటలు పూర్తిస్థాయిలో చేతికందక కొంతమంది రైతులు పంటలు వదిలేసారు. 2022-23 ఏడాదిలో వేసిన పంటలు 2023-24లో నీళ్ల లేక సాగు సకానికి సగం తగ్గిపోయింది. గత ఏడాది అక్టోబర్ నుండి, ఈ ఏడాది మార్చి వరకు వర్షాలు పడలేదు. ఐదు నెలల నుండి వర్షాలు లేకపోవడంతో, భూగర్భ జలాలు మరింతగా అడుగంటిపోయాయి. దీనికి తోడు ఎండలు పెరగటంతో మరింతగా జలాలు ఇంకిపోయాయి. డిసెంబర్, జనవరిలో 15 నుంచి 20 అడుగుల కింద నీరు ఉండేది. మార్చిలో నీరు కాస్త 30 అడుగులకు వెళ్లాయి. కొన్ని బోర్లు మొత్తానికి ఎండిపోయాయి. ఈ ఏడాది యాసంగి (రబీ సీజన్లో) మండలంలో బోర్లు, వ్యవసాయ బావులు కింద రైతులు మొక్కజొన్న, యాసంగి వరి పంటను సాగు చేశారు. ఈ పంటలకు నీళ్లందక ఎండిపోవటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. బోర్లు, బావులు నీళ్ల లేక అడుగంటడంతో రైతులు ఏం చేయాలో తెలియక దిక్కులు చూస్తున్నారు. గత నెల నుండి నీళ్ల అందక వరి పంటలు ఎండిపోయిన విషయం విధితమే. వ్యవసాయ బావుల్లో ప్రొక్లెయినితో రైతులు పూడిక తీసినా జలాలు ఊరకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది.

రబీ సీజన్లో సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. గత ఏడాది నుండి ఇప్పటివరకు సరైన వర్షాపాతం లేకపోవటమే, భూగర్భ జలాలు అడుగంటటానికి ప్రధాన కారణమని నిపుణులు చెప్తున్నారు. సాగర్ ఆయకట్టుదారులు పంటలు సాగు చేయటానికి సాగునీరు లేక బాధపడుతూ తీవ్రంగా నష్టపోయారు. బోర్లు, బావులు కింద సాగు చేసిన మొక్కజొన్న చేతికందే దశలో ఎండిపోవటంతో రైతులు లబోదిబోమంటున్నారు. పెట్టుబడులు పెట్టి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తుంది. ఒకపక్క సాగునీరు లేక రైతులు ఇబ్బంది పడుతుంటే, మరోపక్క తాగునీటికి నీళు లేవని ప్రభుత్వం సాగర్ జలాలను ప్రధాన కాలువకు వదిలింది. ఈ కాలువ ముదిగొండ మండలాన్ని ఆనుకొని ఇతర ప్రాంతాలకు వెళుతుంది. ఈ మండలంలోని ప్రధాన కాలువకు అనుసంధానం ఉన్న పిల్ల కాలువల తూములన్నింటిని పూడ్చివేసి 18, 19 మేజర్ కాలువలకు చుక్క నీరు దిగకుండా జలాలను, అధికారులు ఇతర ప్రాంతాలకు మళ్లించడంపై మండల వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో సాగునీటి సమస్యతో పాటు, తాగునీటి ఎద్దడి గ్రామాల్లో రానున్నకాలంలో (వేసవికాలం) ఉత్పన్నమయ్య అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తమై సాగర్ జలాలను ముదిగొండ మండలానికి వినియోగించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరారు.



ఎండుతున్న వరి



అడుగంటిన నీరు



పూడిక తీస్తున్న దృశ్యం



స్వాతంత్ర్య సమరయోధురాలు గౌరమ్మ మృతి

నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు

నవతెలంగాణ-ముదిగొండ



మండలపరిధిలో వల్లాపురం గ్రామంలో స్వతంత్ర సమరయోధురాలు తాటికొండ గౌరమ్మ (91) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గౌరమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలు గౌరమ్మకు ఇద్దరు కుమారులు, పెద్ద కుమారుడు తాటికొండ రమేష్, సినియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు. రెండవ కోడలు కే.విజయ ఎంపీటీసీ సభ్యురాలుగా కొనసాగుతున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బుల్లెట్ బాబు, గుడిపూడి బుచ్చిరామయ్య, మందరపు ఉపేందర్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు ప్రారంభం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం ప్రారంభమైంది. మండల పశు వైద్యాధికారి ఎం.ఉపేందర్ టీకాను ప్రారంభించి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 41 గ్రామపంచాయతీలలో మండల పశు వైద్య సిబ్బంది గ్రామాలలో సందర్శిస్తూ పశువులకు వ్యాధి నివారణ టీకాలు అందజేస్తారన్నారు.

10 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



ఈ నెల 18వ తేదీ నుండి జిల్లాలోని 73 కేంద్రాలలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగే కేంద్రాలలో పారిశుధ్యం, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం తప్పనిసరిగా ఉండేటట్లుగా సంబంధిత ఎంపీడీవోలు శ్రద్ధ వహించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధిత గ్రామపంచాయతీ సిబ్బందితోను, ఎంపీడీవోతోను సంప్రదించి మూడు రోజుల ముందు నుండే ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, తాగునీటికి, టాయిలెట్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా పరీక్షా పత్రాల గోప్యతను పర్యవేక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రశ్నాపత్రాలను సురక్షితంగా పోలీస్ స్టేషన్ నుండి పరీక్షా కేంద్రాలకు తరలించడం, జవాబు పత్రాలను పరీక్షా కేంద్రాల నుండి పోస్ట్ ఆఫీస్‌కు సురక్షితంగా తరలించటంలో సంబంధిత చీఫ్ సూపర్డెంట్లు పూర్తి బాధ్యత వహించాలని కేంద్రాల సూపర్డెంట్‌లను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ కోసం 73 మంది చీఫ్ సూపర్డెంట్లు, 73 మంది డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, 720 మంది ఇన్విజిలేటర్‌లు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు, ప్రతి కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది ఉండేటట్లుగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర చారి, అన్ని మండలాల ఎంపీడీవోలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డీఆర్‌డీఓ విద్యా చందన పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగులకు యూనిఫామ్

- అందజేసిన జెడ్పీ చైర్మెన్ కంచర్ల

నవతెలంగాణ-కొత్తగూడెం

జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగులకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న యూనిఫామ్ దుస్తులను శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర రావు, జిల్లా పరిషత్ సీఈవో ప్రసూనా రాణి చేతుల మీదుగా ఉద్యోగులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ నాల్గవ తరగతి ఉద్యోగులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న యూనిఫామ్ బట్టలను సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో పనిచేసి అధికారుల దగ్గర మంచి పేరు, గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. యూనిఫామ్ బట్టల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసి అందించినందుకు జిల్లా పరిషత్ చైర్మెన్, సిఇఓ, డిప్యూటీ సిఇఓలకు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్ రావు, కార్యాలయ సూపరింటెండెంట్స్ జిల్లాలో ఉన్నటువంటి సబార్డినేట్స్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఉద్యోగ అవకాశాలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ, భద్రాచలం వారి ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో గల నిరుద్యోగ గిరిజన యువత సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వారి నోటిఫికేషన్‌లో గల మేనేజ్మెంట్ ట్రైని, జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ & సబ్ ఓవర్ సిర్ ట్రైని గల పోస్టులకు దరఖాస్తు చేసుకోవలసిందిగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన నిరుద్యోగ యువతకు పరీక్ష ఫీజు నుండి మినహాయింపు కలదని, కేవలం ఆన్లైన్ అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.100 మాత్రమే చెల్లించాలని, విద్యార్హత, పోస్టుల వివరాలు వయోపరిమితి మిగతా వివరాలను www.scclmines.com వెబ్ సైట్ నందు సందర్శించి అర్హత గల యువత ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

సింగరేణిలో ఉద్యోగాలు భర్తీ

- జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కె.బసవయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి సంస్థ ఖాళీ ఉన్న 327 పోస్టులను ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో (ఎక్స్‌టర్నల్) 813 పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయుటకు నోటిఫికేషన్ విడుదల చేశారు. సింగరేణి బొగ్గు గనుల సంస్థలో ఆయా విభాగాలలో ఖాళీగా ఉన్న 327 పోస్టులను ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో (ఎక్స్‌టర్నల్) ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ నెంబర్ 02/2024, 813 పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయుటకు భర్తీ చేయుటకు శుక్రవారం సాయంత్రం నోటిఫి కేషన్ జారీ చేశామని జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కె.బసవయ్య తెలిపారు. ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో (ఎక్స్‌టర్నల్) భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో మేనేజ్మెంట్ ట్రైనీ (ఈ అండ్ ఎం) పోస్టులు 42, మేనేజ్మెంట్ ట్రైనీ (సిస్టమ్స్) పోస్టులు 7, నాన్-ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో జూనియర్ ఇంజనీర్ ట్రైనీ (జేఎంఈటి) పోస్టులు 100, అసిస్టెంట్ ఫోర్మన్ (మెకానికల్) ట్రైనీ పోస్టులు 9, అసిస్టెంట్ ఫోర్మన్ (ఎలెక్ట్రికల్) పోస్టులు 24, ఫిట్టర్ ట్రైనీ పోస్టులు 47, ఎలక్ట్రీషన్ ట్రైనీ పోస్టులు 98 కలిపి మొత్తం 328 పోస్టులు ఎంప్లాయ్‌మెంట్ నోటిఫికేషన్ నెంబర్ 02/2024లో ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టులకు ఏప్రిల్ 15 తేదీ నుంచి మే నెల 5వ తేదీ వరకు ఆన్ లైన్లో దర ఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాల కోసం ఏప్రిల్ 15 తేదీ తేదీ నుంచి సింగరేణి సంస్థ వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు.

అంతర్గత (ఇంటర్నల్) పద్ధతిలో భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు తెలిపారు ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో మైనింగ్ గ్రాడ్యుఎట్ ట్రైనీ పోస్టులు 22, అండర్ మేనేజర్ పోస్టులు 20, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు 6, నాన్- ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 360, జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ (జేఎంఈటి) పోస్టులు 100, అసిస్టెంట్ ఫోర్మన్ (మెకానికల్) ట్రైనీ పోస్టులు 10, అసిస్టెంట్ ఫోర్మన్ (ఎలెక్ట్రికల్) పోస్టులు 25, ఫిట్టర్ ట్రైనీ పోస్టులు 123, ఎలెక్ట్రీషియన్ ట్రైనీ పోస్టులు 133, వెల్డర్ ట్రైనీ పోస్టులు 14 కలిపి మొత్తం 813 ఈ అంతర్గత (ఇంటర్నల్) నోటిఫికేషన్ ఇందులో ఉన్నాయని, ఈ పోస్టులకు మార్చి 20 తేదీ నుంచి 30 వ తేదీ వరకు ఆన్ లైన్లో దర ఖాస్తు చేసుకోవచ్చని పూర్తి వివరాల కోసం మార్చి 20 వ తేదీ నుంచి సింగరేణి సంస్థ వెబ్‌సైట్‌లో చూడాని కోరారు. ఈ పోస్టులన్నీ వ్రాతపరీక్షా ఆధారముగా పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుందని, దళారులను నమ్మి ఎవరు మోసపోవద్దని, ఎవరైనా సామాజిక మాధ్యమాలలో మెసేజ్ మరియు ఫోన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే ప్రలోభాలకు గురికాకుండా వెంటనే ఏసిబి, సింగరేణి సంస్థ విజిలెన్స్ డిపార్ట్మెంట్ వారికి తెలపాలని కోరారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా రామనుజవరం అభివృద్ధి

- బీటీపీఎస్ సీఎస్ఆర్ నిధులతో పలు శంకుస్థాపనలు
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు మండలంలో గోదావరి పరవాక ప్రాంతంలో రామనుజవరం గ్రామం ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతుందని పినపాక శాసనసభ్యులు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బీటీపీఎస్ రూ.50 లక్షలు సీఎస్ఆర్ నిధులతో రామానుజ వారంలో శ్రీ భ్రమరాంబ వైద్యనాథ లింగేశ్వర స్వామి దేవాలయానికి విశ్రాంతి గది, డైనింగ్ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ మణుగూరు కేంద్రంగా అనేక పరిశ్రమలు అభివృద్ధితో రాష్ట్రంలోనే బంధాలు ఉందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో శివాలయం దినదిన అభివృద్ధి అన్నారు. ఆలయ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ సైదులు రెడ్డి, ఎంపీఓ వల్లాటి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య చారి, ఎంపీటీసీలు పాయల లక్ష్మయ్య, రామారావు, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, కాంగ్రెస్ పినపాక నియోజకవర్గం కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు వీరినాకి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశం కోసం అవగాహన

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు జిల్లా పరిషత్ హై స్కూల్ (కో ఎడ్యుకేషన్) లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం మణుగూరు ప్రభుత్వ ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్ జి.రవి కుమార్ ప్రవేశాల గురించి వివరించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఉన్నతాధికారుల ఆదేశాల అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ సారధ్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఐటీఐ ఆవశ్యకతను, ప్రవేశాలకు గురించి వివరించారు. అదేవిధంగా పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అంతా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.నాగశ్రీ, ఏటీఓ ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మన నడవడికే...మనకు మనుగడ

నవతెలంగాణ-కొత్తగూడెం

మన నడవడికే మనకు మనుగడ అవుతుందని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేం రాజు తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజు విద్యార్థులందరికి శుభాకాంక్షలు తెలుపుతూ, సత్‌శీలత, మంచినడవడిక, ప్రవర్తనలే మనల్ని సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెడుతాయన్నారు. రామవరం ప్రభుత్వ పాఠశాలలోనే తాను చదివి, క్రమశిక్షణతో ఈ స్థితిలో ఉన్నానని తెలిపారు. కష్టపడి చదివితే కష్టాలన్నీ తీరుతాయన్నారు. పదవ తరగతి విద్యార్థులందరికి పరీక్ష సామగ్రి అందజేశారు. ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఎవరి జీవితాలకు వారే జవాబుదారులు కావున కష్టపడి చదివి ఉన్నత భవిష్యత్తులను సాధించాలని పాఠశాల హెచ్ఎం ప్రభు దయాల్ కోరారు. ఈ సమావేశంలో ఎస్ఓ కోటిరెడ్డి, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

వార్తలు వెలువడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా, ఈస్కామ్‌లో కవిత పీఏ అయిన అశోక్ అప్రూవర్‌గా మారి.. కోర్టు ముందు ఇచ్చిన వాంగ్మూలం కవితను అరెస్ట్ చేయటానికి ఈడీ అధికారులకు పెద్ద ఆధారంగా నిలిచినట్టు తెలుస్తున్నది. గత ఏడాదిన్నర కాలంగా ఢిల్లీ లిక్కర్ స్కామ్ వెలుగు చూసి ఢిల్లీ నుంచి తెలుగు రాష్ట్రాల వరకు ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ స్కామ్‌లో సౌత్ ఇండియా గ్రూపు తరఫున కవిత కీలక పాత్ర పోషించి, భారీ మొత్తంలో అవినీతికి పాల్పడ్డట్టు ఈడీ నుంచి ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా, సౌత్ ఇండియా గ్రూపునకు చెందిన సిండికేట్‌కు మద్యం దుకాణాలు లభించేలా చేయటంలో కవిత కీలక పాత్ర పోషించారనీ, ఇందులో భారీ ఎత్తును ముడుపులు చేతులు మారాయని ఈడీ ఆరోపణలు ఉన్నాయి.

ఈడీ నోటీసులపై సుప్రీంకోర్టులో కవిత పిటీషన్‌పై 19న విచారణ

మరోవైపు, కవిత సన్నిహితుడిగా పేర్కొనబడే రామచంద్రపిళ్లై సైతం ఈ కేసులో మొదట అప్రూవర్‌గా మారి, కవితకు వ్యతిరేకంగా వాంగ్మూలమిచ్చి తర్వాత దానిని వెనకకు తీసుకునే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే, కవితను గతేడాది మార్చి నెలలోనే మూడు సార్లు కేంద్ర దర్యాప్తు బృందాలు ఈ కేసులో ప్రశ్నించాయి. కాగా, తాజాగా ఈడీ ఇచ్చిన నోటీసులను సుప్రీంకోర్టులో కవిత సవాలు చేయగా.. దానిపై ఈనెల 19న న్యాయస్థానం విచారణను చేపట్టనున్నది. ఈ నేపథ్యంలో నాటకీయ ఫక్కీలో ఢిల్లీ నుంచి వచ్చిన అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్ నేతృత్వంలోని 12 మంది సభ్యుల ఈడీ ప్రత్యేక బృందం.. బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో చేరుకొని సోదాల సెర్చ్ వారెంట్‌ను చూపించి మరీ చర్యలకు దిగింది. వీరితో పాటు ఐటీ అధికారులు కూడా సోదాల్లో పాల్గొన్నారు.

ఈడీ సోదాలు.. భారీగా చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు

మొదట కవితకు చెందిన సెల్‌ఫోన్లతో పాటు లోపల ఉన్నవారి సెల్‌ఫోన్లన్నింటినీ స్వాధీనపర్చుకున్న అధికారులు.. కవిత నివాసంలో అణువణువునా సోదాలు నిర్వహించినట్టు తెలిసింది. నివాసం ప్రధాన గేట్లను మూసివేసి, బయటవారిని ఎవరినీ లోనికి అనుమతించకుండా కట్టుదిట్టంగా సోదాలు జరిపారు. కవిత నివాసంలో ఈడీ సోదాలు నిర్వహిస్తున్నట్టు తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకొని సోదాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. కవిత నివాసంలోకి ప్రవేశించాలని వారు చేసిన ప్రయత్నాలను పోలీసులు నిరోధించారు. మరోవైపు, కవిత నివాసంలో సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులను.. కవిత తరఫు న్యాయవాదులు సోమభరత్, మరికొందరు ఈ సోదాలపై ప్రశ్నించినప్పటికీ.. వారు ఏ మాత్రమూ స్పందించకుండా తమ పనుల్లో నిమగ్నమయ్యారు.

కవిత ఇంటికి చేరుకున్న కేటీఆర్, హరీశ్.. అధికారులతో వాగ్వాదం

ఇంకోవైపు, హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి చెందిన మరో ఆరుగురు అధికారులు కూడా కవిత నివాసానికి చేరుకొని ఢిల్లీ అధికారులకు మద్దతుగా నిలిచారు. అయితే, అదేసమయంలో నివాసంలో సోదాలు నిర్వహించటమే గాక.. కవితను అరెస్ట్ చేయబోతున్నట్టు బయటకు వార్తలు పొక్కటంతో ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. దాదాపు ఆరు గంటల ప్రాంతంలో బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌లు హుటాహుటిన కవిత నివాసానికి చేరుకోగా.. వారిని కూడా పోలీసులు లోనికి అనుమతించలేదు. లోపల ఏం జరుగుతున్నదో తాము తెలుసుకోవాలనీ, తాము కవిత కుటుంబసభ్యులమని పోలీసులతో పాటు ఈడీ అధికారులతో కేటీఆర్, హరీశ్‌లు వాగ్వాదానికి దిగారు. దాదాపు పది నిమిషాల తర్వాత వారిని అధికారులు లోనికి అనుమతించారు. అప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నమోదైన పీఎంఎల్ఏ కేసుకు సంబంధించి నిందితురాలిగా కవితను అరెస్ట్ చేసి, ఢిల్లీకి తీసుకెళ్తున్నట్టు ఒక నోటీసును కవిత భర్తకు ఈడీ అధికారులు అందజేశారు. అంతేగాక, ఆ కేసుకు సంబంధించిన మెమోను కూడా భర్తకు అందజేసినట్టు తెలిసింది.

ప్రత్యేక బందోబస్తు నడుమ ఎయిర్‌పోర్టుకు

కాగా, ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఏ విధంగా కవితను ఢిల్లీకి తీసుకెళ్తారంటూ కేటీఆర్, హరీశ్‌రావులు ఈడీ అధికారులతో వాదించినట్టు తెలిసింది. ఒకవైపు వారి వాదనలు కొనసాగుతుండగానే, ఈడీ అధికారులు కవిత నివాసంలో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, సెల్‌ఫోన్లను సర్దుకొని కవితను ఢిల్లీకి తీసుకెళ్లటానికి రంగాన్ని సిద్ధం చేసుకున్నారు. ముందుగా, వారు రూపొందించుకున్న వ్యూహం ప్రకారమే ఢిల్లీకి రాత్రి 8.45 గంటల ఫ్లైట్‌కు ముందస్తుగా టికెట్లను కూడా సిద్ధం చేసుకున్నారు. ఒకపక్క, వెలుపల ఉద్రిక్త వాతావరణం ఉండగానే రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ప్రత్యేక బందోబస్తు మధ్య ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్లారు.

నేటి సాయంత్రం కోర్టులో హాజరుపర్చే అవకాశం

మరోవైపు, ఢిల్లీలో శనివారం సాయంత్రం 5 గంటల లోపల కోర్టులో హాజరుపరిచే విధంగా ఈడీ అధికారులు సన్నాహాలు పూర్తి చేసుకున్నట్టు తెలిసింది. అంతకముందు, ఢిల్లీలో ఇదే కేసులో తమ కస్టడీలో ఉన్న నిందితుడు అమిత్ అరోరాతో కలిపి కవితను విచారించే అవకాశం ఉన్నదని తెలిసింది. దాదాపు వంద కోట్ల రూపాయలు ఈ స్కామ్‌లో ముడుపులుగా ఆప్ నేతలకు కవిత చెల్లించినట్టు వస్తున్న ఆరోపణలకు సంబంధించి ఇప్పటికే అప్రూవర్‌గా మారిన రామచంద్ర పిళ్లై, మాగుంట రాఘవ, అశోక్‌ల నుంచి సమాచారాన్ని సేకరించిన ఈడీ.. మున్ముందు దర్యాప్తులో కవితపై పకడ్బందీగా ఉచ్చును బిగించటానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు తెలిసింది. ఈ స్కామ్‌లో ఇదివరకే అరెస్టయిన ఆప్ మంత్రి మనీశ్ సిసోడియా, మరికొందరికి బెయిల్ రావటం అతికష్టంగా మారిన నేపథ్యంలో కవిత కూడా ఆ ఇబ్బందులను ఎదుర్కోక తప్పదనే వాదన న్యాయ నిపుణుల నుంచి వినిపిస్తున్నది.

బీఆర్ఎస్‌లో ప్రకంపనలు

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టు చేసినట్టు ప్రకటించి, ఢిల్లీకి తీసుకెళ్లాయి. మోడీ హైదరాబాద్‌లో ఉన్నప్పుడే ఇలాంటి ఘటన జరగడం రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపుతుంది. ఉద్దేశ్యపూర్వకంగానే కవితను శుక్రవారం అరెస్టు చేశారనే ప్రచారం జరుగుతున్నది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుపై కవిత వేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరగనుంది. అందుకు రెండ్రోజుల ముందు ఆమెను అరెస్టు చేయడం గమనార్హం. మరోవైపు ఆపార్టీ నుంచి వెళ్లిపోయే నేతల సంఖ్యా రోజురోజుకూ పెరుగుతుంది. శుక్రవారం బీఆర్ఎస్‌కు చెందిన వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఆయన కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నారనే ప్రచారం జరుగుతుంది. మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆయన కూడా కారు స్టీరింగ్ వదిలేస్తారనే చర్చ జరుగుతుంది. కవిత అరెస్టుపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం సైలెంట్‌గా ఉన్నారు. ఆమె అరెస్టు తర్వాత తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీల రాజకీయ కుట్రలో భాగంగానే కవిత అరెస్టు జరిగిందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి గురయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు కూడా హడావిడిగా ఢిల్లీ వెళ్లారు. కవితను అరెస్టు చేసి తీసుకెళ్తున్న సందర్భంగా ఆయన కూడా భావోద్వేగానికి గురయ్యారు. ధైర్యంగా ఉండాలని కవితకు చెప్పారు. కేంద్రం రాజకీయ కుట్రల్ని చట్టపరంగా ఎదుర్కొంటామని స్పష్టంచేశారు. మరోవైపు బీఆర్ఎస్, బీఎస్పీ ఎన్నికల పొత్తు ఖరారైంది. బీఎస్పీకి నాగర్‌కర్నూల్, హైదరాబాద్ పార్లమెంటు స్థానాలను కేటాయించినట్టు బీఆర్ఎస్ ప్రకటించింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయాక వరుసగా జరుగుతున్న పరిణామాలపై బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు బెంబేలెత్తుతున్నారు. వ్యక్తిగతంగా తమ రాజకీయ భవిష్యత్ ఏంటని ప్రశ్నించుకుంటున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కవిత అరెస్టు పార్టీకి మేలు చేస్తుందా...నష్టం చేస్తుందా అనే విశ్లేషణల్లో పార్టీ శ్రేణులు ఉన్నాయి. కాంగ్రెస్‌పార్టీ కూడా జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తుంది. మొత్తంమీద లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడదలకు ఒక్కరోజు ముందు రాష్ట్రంలో జరుగుతున్న నాటకీయ పరిణామాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరుగుతుంది.

22 నుంచి నిరవధిక సమ్మె

- ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్‌కు నోటీసు అందజేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల జీతాలు చెల్లించకపోతే ఈ నెల 22 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) హెచ్చరించింది. ఈ మేరకు ఆయన యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.నరసింహ నేతృత్వంలో నాయకులు శుక్రవారం హైదరాబాద్ కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేశారు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వారు తెలిపారు. ఏడు నెలల పీఆర్సీ ఏరియర్స్ పెండింగ్‌లో పెట్టారని చెప్పారు.

ఫైలు కదిలేనా? జీతాలందేనా?

ఉపాధి ఉద్యోగులకు మూడు నెలలుగా అందని జీతాలు

- సమస్య తీవ్రతను పట్టించుకోని ఉన్నతాధికారులు
- కుటుంబాలు గడవక ఉద్యోగుల ఇబ్బందులు
- పర్మినెంట్ చేస్తారనే చిన్న ఆశతో బాధలను భరిస్తున్న వైనం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి హామీ చట్టంలో పనిచేసే కూలీలకే కాదు ఉద్యోగులకూ సర్కారు వేతనాలివ్వడం లేదు. ఒకటికాదు.. రెండు కాదు..మూడు నెలలు నుంచి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. నెలలో ఒకటెండ్రు రోజులు కాస్త లేటుగా పడితేనే కిందామీద అయ్యే ఈ రోజుల్లో మూడు నెలలు జీతాలు రావడట్లేదంటేనే వారు పడుతున్న వ్యథలు అన్నీఇన్నీ కావు. జీతాలు అందకున్నా..అప్పులు చేసుకుని మరీ బతుకులు వెళ్లదీస్తున్నారు. 18 ఏండ్ల నుంచి పనిచేస్తున్న తమను రాష్ట్ర సర్కారు ఎప్పటికైనా పర్మినెంట్ చేయకపోతుందా? అనే చిన్న ఆశతో వారు బాధలన్నింటినీ పంటికింద భరిస్తూ కుటుంబ బాధ్యతలను నెట్టుకొస్తున్నారు. జీతాల ఫైలు ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క వద్ద పెండింగ్‌లో ఉంది. 'డిప్యూటీ సీఎం సారూ..ఈనెలనైనా జీతాలు వేయించండి' అనుకుంటూ కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఉపాధి హామీ చట్టం 2005 ఆగస్టు 23న ప్రారంభమైంది. ఆ చట్ట పరిధిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 3,974 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. అందులో 392 మంది అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీలు 289 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు 2028 మంది, ఏఏలు 870 మంది, అడిషనల్ డీఆర్‌పీలు 8 మంది, సీడీ సీఎల్ఆర్ 17 మంది, జేఈ(సివిల్)లు 60 మంది, ప్లాంటేషన్ సూపర్‌వైజర్స్ 26 మంది, పీవోలు 23 మంది, ఇతర విభాగాలకు చెందిన వారు 261 మంది ఉన్నారు. వీరికి తోడుగా 7,500కిపైగా ఫీల్డు అసిస్టెంట్లున్నారు. వీరంతా ఉపాధి హామీ కూలీలతో పనులను చేయించడంలో, బిల్లింగ్ చేయడంలో, కూలీలకు వేతనాలు అందించడంలో జరిగే అన్ని ప్రక్రియల్లోనూ పాలు పంచుకుంటారు. ఉపాధి హామీ పనులను క్రమం తప్పకుండా చేయిస్తూ కేంద్రం నుంచి వీలైనంత మేరకు ఎక్కువ నిధులను రప్పించడంలో వీరు కీలక భూమిక పోషిస్తున్నారు. వీరు 18 ఏండ్ల ఆరు నెలల నుంచి అదే పనిచేస్తున్నారు. వీరు ఉపాధి హామీ పనులు, హరితహారం, రైతు వేదికలు, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, నీటి నిల్వ పనులు, పండ్ల తోటల పెంపకం, మల్బరీ తోటల పర్యవేక్షణ, నర్సరీల నిర్వహణ, ఇలా 220 రకాల పనులను పర్యవేక్షిస్తున్నారు. 16 శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇంత పనిచేస్తున్న వీరికి జీతాలు మాత్రం సకాలంలో అందడం లేదు. డిసెంబర్ నుంచి వేతనాలు రాలేదు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, ఇలా మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. మార్చిలోనూ పక్షం రోజులు పూర్తయిపోయాయి. జీతమైతే ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి సకాలంలో వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నదన్న విమర్శలు ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. 'మూడు నెలల నుంచి జీతం లేక అప్పులు తెచ్చి మరీ ఈఎమ్ఐ లు కడుతున్నాను. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఇప్పటిదాకా ఎన్నడూ ఇలా కాలేదు. ప్రతి నెలా జీతం వచ్చేది' అని రాష్ట్ర కేంద్రంలో పనిచేసే ఓ ఉద్యోగి వాపోయాడు. వారు అనేక రకాల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసరాల సరుకులు తెచ్చుకునేందుకు, ఇంటి అద్దెలు కట్టేందుకు అప్పులు చేసుకుని బతుకులు వెళ్లదీస్తున్నారు. వేతనాల గురించి ఆఫీసర్ల చుట్టూ తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోని పరిస్థితి. వేతనాలకు సంబంధించిన రూ.121 కోట్ల ఫైలు సీతక్క సంతకంతో గ్రామీణాభివృద్ధి శాఖ ఆర్థిక శాఖకు పంపింది. అక్కడ నుంచి ఆ ఫైలు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దగ్గర పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది.

18 ఏండ్ల నుంచి చేస్తున్నా పర్మినెంట్ ఏది?

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 కంటే ముందు నుంచి పలుశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసింది. వీరిని మాత్రం పట్టించుకోలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దీన్ని అస్త్రంగా చేసుకున్నది. ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న వారిని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తా మనీ, పేస్కేలు అమలు చేస్తామని హామీనిచ్చింది. ఆ చట్టం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల పర్మి నెంట్ ఫైలు ప్రస్తుతం ఉన్నతస్థాయి అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకం పెడితే పర్మినెంట్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆ ఫైలు ఎంత వేగంగా ముందుకు కదులుతుంది? ఎప్పటిలోగా వారు పర్మినెంట్ అవుతారనే విషయంపై వేచిచూడాల్సిందే.

ప్రాజెక్టుల ప్రాథమిక అంచనాలు పెంచడం అనివార్యమా?

రాష్ట్రంలో కొనసాగుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ప్రాథమిక అంచనాలు 4 నుండి 12 రెట్లు పెరగడం సహజమని, అది నేరం కాదని మాజీ నీటి పారుదల శాఖ మంత్రి కడియం శ్రీహరి నిన్న (01.03.2024) మేడిగడ్డ విలేకరుల సమావేశంలో విన్నవించారు. గతంలో రెండు టర్మ్‌లు నీటి పారుదల శాఖా మంత్రిగా ఉన్న అనుభవంతో చెబుతున్నానని, ఎక్కడైనా ప్రాథమిక అంచనా మేరకు ప్రాజెక్టు నిర్మాణం జరిగినట్టు రుజువు చేయాలని సవాల్ విసిరారు. మొదటి నుండి ఇరిగేషన్ ప్రాజెక్టులు పాలక వర్గాలకు, కాంట్రాక్టర్లకు ఏటీఎంలుగా పనిచేస్తున్నాయి. పని ప్రారంభించేటప్పుడు వేసిన అంచనాలు పెంచడానికి వీలుగా ప్రాజెక్టుల నిర్మాణాన్ని జాప్యం చేయడం ఆనవాయితీగా వస్తున్నది. భారీ ప్రాజెక్టులకే కాక, చివరకు మధ్యతరహా ప్రాజెక్టులు కూడా ఈ భారం నుండి తప్పించుకోలేకపోతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలో చేపట్టిన జగన్నాదపూర్ ప్రాజెక్టుకు ప్రాథమిక అంచనా రు.65కోట్లు కాగా, 2023 మార్చి నాటికి రు.244.66 కోట్లు వ్యయం చేయడం జరుగుతుంది. ఇంకా రు.127 కోట్లు వ్యయం చేస్తే తప్ప ప్రాజెక్టు పూర్తి అయి నిర్ణీత 15వేల ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేయలేమని కాంగ్రెస్ శ్వేతపత్రంలో చెప్పింది. గతంలో ఎకరాకు సాగునీటి వనరులు కల్పించడానికి రు.93వేల కోట్లు ఖర్చుకాగా, 2014 నుండి 2024 వరకు ఎకరాకు రు.11.20లక్షల కోట్లు ఖర్చు చేయడం జరుగుతున్నది. ఇంత ఖర్చు చేసినా సకాలంలో నీరు ఇవ్వలేకపోతున్నారు. రాష్ట్రంలో 18 భారీ ప్రాజెక్టులు, 26 మధ్యతరహా ప్రాజెక్టులు దశాబ్దాలుగా నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి.

మేడిగడ్డ - సుందిల్లకు జరిగిన వ్యయం (కోట్లలో)

ప్రాజెక్టు	ప్రాథమిక అంచనా	రీవైజ్డ్ అంచనా	మార్చి 2022 నాటికి వ్యయం
మేడిగడ్డ ప్రాజెక్టు	1849.31	4321.44	3348.24
మేడిగడ్డ ఎత్తిపోతల	2826.10	4915.37	4721.49
అన్నారం బ్యారేజ్	1452.82	2565.51	2326.83
అన్నారం ఎత్తిపోతల	1669.23	3772.56	3003.98
సుందిల్ల బ్యారేజ్	1248.27	2148.45	1671.80
సుందిల్ల ఎత్తిపోతల	1737.57	3573.78	2869.41
మొత్తం	10,783.30	21,297.11	17,941.75

బాధ్యత కలిగిన మంత్రిగా పనిచేసి రివైజ్డ్ పేరుతో 12-15 రెట్లకు అంచనా వ్యయం పెరుగుతుందని వాధించడం అవినీతికి కీలకంగా భావించవచ్చునా? ఏ ప్రాజెక్టునైనా నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయడానికి తగిన ఏర్పాటు లేకుండా తమకు ఉపయోగపడే ఏటీఎంగా మార్చుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ప్రజా ధనాన్ని ప్రాజెక్టుల రూపంలో కొల్లగొట్టడం జరుగుతున్నది. 2014 నుండి నేటి వరకు రు.1,81,067 కోట్లు వ్యయం చేసి 15.81 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీటి వనరులను కల్పించడం జరిగింది. నేడు సాగు నీటి వనరులు కల్పించడం అత్యంత వ్యయంతో కూడుకున్నది. ఈ దురాచారాన్ని తగ్గించడాన్ని నిర్ణీతకాలంలో ప్రాజెక్టులను పూర్తిచేయడం ఒక్కటేమార్గం.

మేడిగడ్డ - సుందిల్ల ప్రాజెక్టుల వ్యయాన్ని గమనిస్తే ఎన్ని రెట్లు అంచనాలు పెరుగుతున్నాయో అర్థమవుతుంది. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడాన్ని పాలకవర్గాలు నిరంతరం అంచనాలను పెంచుతున్నాయి. అందుకు ఈ దిగువ గణాంకాలే ఉదాహరణ.

- సారంపల్లి మల్లారెడ్డి

సందర్శించి... సమస్యలను ఆలకించి..

- జోడేఘాట్‌ను సందర్శించిన మంత్రి సీతక్క
- పోరాట యోధుడు భీమ్‌కు ఘన నివాళి



నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసుల ఆరాధ్యదైవం, పోరాట యోధుడు అసువులు బాసిన పోరుగడ్డ జోడేఘాట్‌ను శుక్రవారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క సందర్శించారు. గ్రామస్తులు మంత్రిని డప్పు, వాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం అమరుడు కుమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ట్రైబల్ మ్యూజియంలో కలియ తిరిగి, మ్యూజియంలో ప్రదర్శనకై ఏర్పాటు చేసిన ఆదివాసీ గిరిజన సంప్రదాయ వస్తువులు, వ్యవసాయ పనిముట్లు, గిరిజన సాంస్కృతిని ప్రతిబింబించే అలంకార ఆభరణాలు, తదితర వస్తువులను తిలకించి వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. పోరు గ్రామాల పెద్ద కుమురం భీమ్ ఉత్సవ కమిటీ మాజీ చైర్మెన్ పెందూర్ రాజేశ్వర్, కోరేంగా గోవింద్ రావు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. హట్టి నుంచి టోకెన్ మోవాడ్ వరకు అటవీ అనుమతులు లేక రోడ్డు పనులు అసంపూర్తిగా ఆగిపోయాయని తెలిపారు. పోరు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. జోడేఘాట్ నుంచి దెంబటి గూడెం 3 కి.మీ దూరంలోనే ఉంటుందని, రోడ్డు సౌకర్యం కల్పిస్తే ఆసిఫాబాద్‌కు కేవలం 13 కి.మీ దూరం మాత్రమే ఉంటుందని, రవాణాపరంగా సౌకర్యంగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా గత ప్రభుత్వం జోడేఘాట్ గ్రామానికి 30 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేసిందని, గ్రామస్తులే స్వంత ఖర్చులతో రూఫ్‌ లెవెల్ వరకు నిర్మాణం పూర్తి చేసుకున్నారని వాపోయారు.

వాటికి సంబంధించిన సగం బిల్లులు రావాల్సి ఉందని, పెండింగ్ బిల్లులు ఇప్పించాలని వేడుకున్నారు. వేసవిలో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు 400 మీటర్ల లోతుకు అడుగంటి పోతాయని, నీటి ఎద్దడి తీర్చేందుకు బోర్లు వేయించాలని కోరారు. మూగజీవాల దప్పిక తీర్చేందుకు చెరువు నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. గ్రామస్తుల సమ స్య లను విన్న మంత్రి సమీప గ్రామ ప్రజలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జోడేగాడ్ ప్రాంతంపైన ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. పోరు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి వెంట కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ సురేష్‌కుమార్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీఎస్పీ సదయ్య, భీమ్ మనుమడు సోనిరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్, జడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణ, వాంకిడి సీఐ శ్రీనివాస్, కెరమెరి ఎస్ఐ గుంపుల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కన్హా శాంతివనంలో ఆధ్యాత్మిక మహోత్సవం

- హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



నతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవ కార్యాక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ హార్ట్ ఫుల్‌నెస్ సహకారంతో రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా శాంతివనంలో నాలుగు రోజులపాటు ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవాలను నిర్వహించను న్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరై శాంతివనాన్ని సందర్శించారు. ఆధ్యాత్మికతపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆమె తిలకించారు. శాంతివనంలో మొక్కను నాటారు. కార్యక్రమానికి న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్, స్వామి చిదానంద సరస్వతి, చిన్న జీయార్ స్వామి, స్వామి ముకుందానంద, యోగి నిరంజన్ దాస్, నమ్రముని మహారాజ్, దాజి, దేవి చిత్ర లేఖ, తారాచంద్ కంటాలే, డాక్టర్ భవాని రావు, దిల్షాద్, టోనీ లాడర్, తదితరులు పాల్గొన్నారు.

ఆడియాలజీ, స్పీచ్ థెరపీ టెక్నాలజీ డిగ్రీ కోర్సులను నిలిపివేయాలి: టీఏఎస్ఎల్‌పీఏ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్‌సీఐ అనుమతి లేకుండా తెలంగాణ పారామెడికల్ బోర్డ్ నిర్వహిస్తున్న ఆడియాలజీ డిప్లొమా కోర్సులను, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న బీఎస్సీ ఆడియాలజీ, స్పీచ్ థెరపీ టెక్నాలజీ డిగ్రీ కోర్సులను తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ ఆడియాలజిస్ట్స్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజిస్ట్స్ అసోసియేషన్(టీఏఎస్ఎల్‌పీఏ) డిమాండ్ చేసింది.ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర వికలాంగుల హక్కుల కమీషనర్ బి. శైలజకు వినతిపత్రం సమర్పించారు.

రష్యా అణు విద్యుత్ ప్లాంట్ సమీపంలో

ఉక్రెయిన్ దాడిపై ఐరాస స్పందన



బ్యాకప్ జనరేటర్ల కోసం ఏర్పాటు చేసిన డీజిల్ ట్యాంకులకు సమీపంలో ఉక్రేనియన్ దళాలు బాంబులు వేస్తున్నాయని రష్యా ఫెసిలిటీ సిబ్బంది ఆరోపించిన తర్వాత, జాపోరోజీ అణు విద్యుత్ ప్లాంట్‌లో భద్రతను కాపాడవలసిన బాధ్యత అన్ని పక్షాలదేనని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ప్రతినిధి తెలిపారు. అణు విద్యుత్ ప్లాంట్ సమీపంలో ఇటీవల జరిగిన దాడి గురించి ఐక్యరాజ్య సమితి ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్‌ను గురువారం విలేకరుల సమావేశంలో అడిగినప్పుడు ఆయన ఇలా చెప్పాడు. "అణు విద్యుత్ ప్లాంట్ చుట్టూ ఉన్న పరిస్థితి గురించి చాలా ఆందోళన చెందుతున్నామని మేము పదే పదే చెబుతున్నాము. దాని భద్రతను కాపాడటంపై హామీ ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుంచుకోవాలి. ఒకవేళ ప్రమాదం అంటూ జరిగితే ఎటువంటి పరిస్థితి ఉత్పన్నం అవుతుందనే విషయం గురించి ఆలోచించడానికే భయమేస్తుంది" అని డుజారిక్ చెప్పాడు. ఐక్యరాజ్య సమితికి చెందిన న్యూక్లియర్ వాచ్‌డాగ్ అయిన ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ రష్యా మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటన గురించి తమకు తెలుసునని పేర్కొంది. రేకులో చుట్టబడిన పేలుడు పదార్థాలతో తయారు చేసిన బాంబును జాపోరోజీ అణు విద్యుత్ ప్లాంట్ కాంపౌండ్ గోడకు కేవలం ఐదు మీటర్ల దూరంలో పడవేసినట్టు ప్లాంట్ డైరెక్టర్ యూరీ చెర్నుక్ గురువారం సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఒక వీడియోలో తెలిపాడు. ఈ దాడి వల్ల అణు విద్యుత్ ప్లాంట్‌కు ఎటువంటి నష్టం జరగలేదు. అలాగే ప్రాణనష్టం కూడా జరగలేదు. అయితే పొరపాటున ఇంధన ట్యాంకులు ధ్వంసం అయితే ప్లాంట్ "అత్యవసర పరిస్థితుల సంసిద్ధత" దెబ్బతింటుందని ఆయన చెప్పాడు.

2022లో ఉక్రెయిన్‌తో వివాదం ప్రారంభంలో యూరోప్‌లోని అతిపెద్ద అణు విద్యుత్ ప్లాంట్ రష్యా నియంత్రణలోకి వచ్చింది. రష్యా నిర్వహించిన రిఫరెండం తరువాత జాపోరోజీ ప్రాంతం రష్యాలో విలీనం అయింది. ఆ తర్వాత ఇది అధికారికంగా రష్యా ఆటమిక్ విద్యుత్ సంస్థ రోసాటమ్ నిర్వహణకు బదిలీ చేయబడింది. జాపోరోజీ అణు విద్యుత్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ ఫిరంగి, క్షిపణి, డ్రోన్ దాడులను ప్రారంభించిందని, అలాగే దానిని స్వాధీనం చేసుకోవడానికి ప్రత్యేక దళాలను అనేక సార్లు పంపిందని రష్యా పదేపదే ఆరోపించింది. జాపోరోజీ అణు విద్యుత్ ప్లాంట్ చాలా సార్లు బ్లాక్‌అవుట్‌లను ఎదుర్కోవటమే కాక దాని సహాయక మౌలిక సదుపాయాలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. జాపోరోజీ అణు విద్యుత్ ప్లాంట్‌కు పెను ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున, దాని పర్యవసానాల ప్రభావాన్ని తగ్గించడానికి అణు విద్యుత్ ప్లాంట్‌ను నిద్రాణ స్థితిలో ఉంచటం జరిగింది.

'ఒక దేశం, ఒకే ఎన్నిక' వద్దు

- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : 'ఒక దేశం, ఒకే ఎన్నిక' అన్న భావనకు తాము పూర్తిగా వ్యతిరేకమని సీపీఐ(ఎం) పునరుద్ఘాటించింది. అప్రజాస్వామికమైన ఈ ప్రతిపాదనను ఐక్యంగా వ్యతిరేకించాల్సిందిగా అన్ని ప్రజాస్వామ్య సంస్థలకు, పౌరులకు విజ్ఞప్తి చేసింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫారసు, దీనిని సాధించేందుకు అది ప్రతిపాదించిన చర్యలు తిరోగమనంతో కూడినవని వ్యాఖ్యానించింది. ఇవి దేశంలో కేంద్రీకృత నిరంకుశ రాజకీయ వ్యవస్థ స్థాపనకు దారి తీస్తాయని పేర్కొంది. పార్టీ పొలిట్‌బ్యూరో శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. రాజ్యాంగానికి, ఇతర చట్టాలకు 18 సవరణలు చేయాలని ఈ నివేదికలో ప్రతిపాదించారు. ఇవి మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను కుళ్లబొడిచేవిగా, అలాగే ఐదేళ్లకోసారి ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజల హక్కును హరించేవిగా ఉన్నాయి.

అంతేకాదు, కేంద్ర- రాష్ట్ర సంబంధాల్లో కేంద్రానికి మరిన్ని అధికారాలిచ్చేవిగా కూడా ఉన్నాయి. ఉదాహరణకు, 18వ లోక్‌సభ ఎన్నికల తరువాత ఎన్నికలు జరిగిన రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాన్ని తగ్గించాలని ఈ నివేదికలో ప్రతిపాదించారు. ఈ రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా 19వ లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒకేసారి ఎన్నికలు నిర్వహించుకోవచ్చని ప్రతిపాదించారు. అంటే దీనర్థం 2026లో ఎన్నికలు జరగాల్సిన పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ రాష్ట్ర అసెంబ్లీల పదవీ కాలం ఈ చర్య వల్ల సగానికన్నా పైగా కుదించబడుతుంది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించిన వంద రోజుల్లోగా అన్ని పంచాయితీలకు, స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని కూడా కమిటీ ప్రతిపాదించింది. ప్రస్తుతం, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయించి, నిర్వహిస్తూ వుంటాయి. మూడు స్థాయిల్లో ఎన్నికలకు ఉమ్మడి ఓటర్ల జాబితాలు, అన్ని రాష్ట్రాల్లోని స్థానిక సంస్థలకు ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల అధికారాలు కేంద్రీకృతమవుతాయని, అది పంచాయితీలు, స్థానిక సంస్థల ప్రాథమిక సూత్రమైన వికేంద్రీకరణ వ్యవస్థకే పూర్తి విరుద్ధమని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

అందుకే ఒక దేశం, ఒక ఎన్నిక అన్న భావనను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పొలిట్‌బ్యూరో మరోసారి స్పష్టం చేసింది. ఈ అప్రజాస్వామిక చర్యను సమైక్యంగా వ్యతిరేకించాలని అన్ని ప్రజాతంత్ర శక్తులకు పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

అమెరికా ప్రత్యేక దళాల ఉనికిని ధ్రువీకరించిన తైవాన్

అమెరికా ప్రత్యేక దళాల సిబ్బంది తైవాన్‌లోని కొన్ని ద్వీపాలలో తమ సాయుధ దళాలకు శిక్షణ ఇస్తున్నారని తైవాన్ రక్షణ అథారిటీ చీఫ్ చియు కువో-చెంగ్ గురువారం పత్రికలకు ధవీకరించాడు. ఒక లెజిస్లేటివ్ విచారణ సందర్భంగా తైవాన్‌లో అమెరికాకు చెందిన శాశ్వత సైనిక ఉనికి గురించి మీడియా నివేదికలను ధవీకరించమని సదరు అధికారిని కోరినట్లు ఫోకస్ తైవాన్ వార్తా సంస్థ తన వెబ్‌సైట్‌లో గురువారం రాసింది. అమెరికా రక్షణ దళాలకు సంబంధించిన సిబ్బంది తైవాన్ దళాలకు శిక్షణ ఇస్తున్నారని, బలహీనతలను, బ్లైండ్ స్పాట్‌లను గుర్తించడంలో వారికి సహాయపడుతున్నారని చియు పేర్కొన్నాడు.

నవతెలంగాణ మానవి 11
www.navatelangana.com
శనివారం
16 మార్చి 2024
ఖమ్మం

ప్రేమంటే ఇది అని స్పష్టమైన అర్థం చెప్పలేని అనుభూతి. ఇద్దరు వ్యక్తుల మధ్య అనిర్వచనీయమైన అంశం. ఇది యవ్వనంలో ఉన్నవారి మధ్యే కాదు ఎవరికైనా కలుగుతుంది. ఒకరిని ప్రేమించడం, వారి ప్రేమను పొందడం అద్భుతమైన విషయం. కానీ నేటి యువత ప్రేమంటే ఆకర్షణ, శారీరక సంబంధం అనుకుంటున్నారు. వయసులో వున్నవారు ప్రేమలో పడితే వారికీ అన్ని అపురూపంగా కనిపిస్తాయి. తర్వాతనే అసలు సమస్యలు మొదలౌతాయి. కానీ వారిది నిజమైన ప్రేమైతే అన్నింటినీ జయించి జీవితాన్ని హాయిగా గడుపుతారు అనడానికి ఈ వారం ఐద్వా అదాలత్ చక్కటి ఉదాహరణ...

ఐద్వా అదాలత్ సెల్: 9190098024

నిజమైన ప్రేమ గెలుస్తుంది



యాసిన్, రేష్మ ఇద్దరూ కలిసి ఆఫీస్‌కి వచ్చారు. యాసిన్‌కు 22 ఏండ్లు ఉంటాయి. అతను ఏసీలు రిపేర్ చేస్తాడు. ఇంట్లో అమ్మా నాన్న ఉంటారు. అన్నయ్య, వదిన వేరుగా ఉంటారు. చెల్లికి పెండ్లి అయిపోయింది. సొంత ఇల్లుంది. ఎవరిది వారికీ అన్నట్లుగా ముందుగా కట్టించి ఇచ్చారు. తల్లిదండ్రులు యాసిన్ కోసం కట్టించిన ఇంట్లో ప్రస్తుతం కిరాయి వారు ఉన్నారు. నెలకు 12000 కిరాయి వస్తుంది. ఇకపోతే అతనికి నెలకు రూ. 30వేల వరకు జీతం వస్తుంది. ఇంటింటికి వెళ్ళి ఏసీలు రిపేర్ చేస్తాడు. అలా వెళ్ళినప్పుడే అతనికి రేష్మ పరిచయం అయింది. రేష్మకు అన్నదమ్ముళ్లు లేరు. ముగ్గురూ అమ్మాయిలే. వీరిలో రేష్మనే పెద్దది. చెల్లెళ్లు ఇద్దరూ ఇంటర్ చదువుతున్నారు. రేష్మ డిగ్రీ చివరి ఏడాదిలో వుంది. డిగ్రీ అయిపోయిన వెంటనే పెండ్లి చేయాలని ఇంట్లో సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. రేష్మ పెండ్లి చేసుకోవడం ఇష్టం లేదు అని చెప్పినా వినకుండా ఒక సంబంధం ఖాయం చేశారు.

ఇంకా రెండు రోజుల్లో పెండ్లి ఉందనగా ఆమె యాసిన్‌తో కలిసి ఇంట్లో నుండి వెళ్ళిపోయింది. ఒక రోజు మొత్తం ఇద్దరూ బయటే ఉన్నారు. తర్వాత రోజు ఐద్వా ఆఫీస్‌కు వచ్చి వారి ప్రేమ గురించి చెప్పి 'మేము పెండ్లి చేసుకోవాలి అనుకుంటున్నాం. మీరేమైనా సాయం చేస్తారా? లేకపోతే మేము వేరే దగ్గరికి వెళ్లి చేసుకుంటాం. మా పెద్ద వాళ్ళకు మాత్రం చెప్పము' అన్నారు. 'మీ పెద్ద వాళ్ళతో మేము మాట్లాడతాం' అని చెబితే ముందు వినలేదు. 'వాళ్లు వస్తే నన్ను మా ఇంటికి తీసుకెళ్ళిపోతారు. మా ఇంట్లో వాళ్ళకు యాసిన్ అంటే ఇష్టం లేదు. యాసిన్ వాళ్ళ నాన్నకు ఇద్దరు భార్యలు, యాసిన్ రెండో భార్య కొడుకు. అందుకే మా వాళ్ళకు నచ్చలేదు' అని చెప్పింది.

'ఏది ఏమైనా మీ పెద్దవారితో మాట్లాడకుండా మేము ఏం చెప్పలేము' అని ఇరువైపుల పెద్దలను పిలిచి మాట్లాడం. యాసిన్ వాళ్ళ అమ్మానాన్న వచ్చారు. 'మీకు రేష్మ నచ్చింది అన్నారంట, మరి పెండ్లి ఎందుకు చేయడం లేదు' అని అడిగాము. 'అమ్మాయి వాళ్ళకు ఇష్టం లేనప్పుడు మేమేం చేస్తాము. అందుకే మేము మా వాడికి వేరే అమ్మాయిని చూస్తున్నాము. రేష్మకు కూడా వాళ్ళ ఇంట్లో వేరే సంబంధాలు చూస్తున్నారు. పైగా వాళ్ళ ఇంట్లో అందరూ ఆడపిల్లలే. అందుకే మాకు ఈ సంబంధం నచ్చలేదు. కానీ ఇద్దరూ మా మాట వినకుండా మీ దగ్గరకు వచ్చారు. పైగా వాళ్ళ తెగ వేరు మా తెగ వేరు. రేష్మ తల్లిదండ్రులను పిలిపించి వాళ్ళ ఇంటికి పంపించండి. మేము మా అబ్బాయిని తీసుకొని వెళ్ళిపోతాము' అన్నారు.

రేష్మ వాళ్ళ తల్లిదండ్రులు, బంధువులు కూడా వచ్చారు. రేష్మ కనీసం వారితో మాట్లాడటానికి కూడా ఇష్టపడలేదు. వాళ్ళతో మాట్లాడితే 'యాసిన్ వాళ్ళ కుటుంబంలో అందరికీ రెండు పెండిండ్లు జరిగాయి. భవిష్యత్‌లో యాసిన్ కూడా రెండో పెండ్లి చేసుకుంటే మా అమ్మాయి పరిస్థితి ఏమిటి. అందరూ రెండో భార్య దగ్గరే ఉంటున్నారు. భవిష్యత్‌లో యాసిన్ కూడా రెండో పెండ్లి చేసుకొని చిన్న భార్య దగ్గర ఉంటే ఎలా? అలాగే అతను చేసేది ఏసీ రిపేరు పని. అది ఎప్పుడూ ఉండదు. పని ఉన్నప్పుడే వెళ్ళాలి లేకపోతే ఇంట్లోనే ఉండాలి. నెలకు కచ్చితమైన జీతం అనేది లేదు. వాళ్ళ తెగ కూడా వేరు. అలాంటి కుటుంబానికి చెందిన అబ్బాయికి మా అమ్మాయిని ఎలా ఇచ్చి పెండ్లి చేయమంటారు. నిన్నటి నుండి రేష్మ కోసం వెదుకుతూనే ఉన్నాం. పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశాం. రాత్రి యాసిన్ వాళ్ళ ఇంటికి వెళ్లి అడిగితే ఏం చెప్పలేదు. అప్పటికీ యాసిన్ ఇంట్లోనే వున్నాడు. మాకు ఎంత భయం వేస్తుంది. మా అమ్మాయికి ఏం జరిగిందో అని చాలా కంగారు పడ్డాం. తను మాత్రం పెండ్లి చేసుకుంటానని మీ దగ్గరకు వచ్చింది' అన్నారు.

ఇరు కుటుంబాల మధ్య మాటా మాట పెరిగి గొడవలు పడ్డారు. మేము అందరికీ సర్దిచెప్పి 'మీ పిల్లలిద్దరూ ఇప్పుడు ఎవరు ఏం చెప్పినా వినే పరిస్థితుల్లో లేరు. ప్రేమలో మునిగిపోయారు. తెగలు వేరయితే ఏంటీ? ఈ మధ్యకాలంలో మతాంతర వివాహాలే చేసుకుంటున్నారు. ఇద్దరూ ప్రేమించుకున్నారు కనుక కలిసి సంతోషంగా ఉండేలా చూడాలి. యాసిన్ ఏసీ రిపేరింగ్‌తోపాటు, కొత్తగా గాజుల దుకాణం పెట్టాలని అనుకుంటున్నాడు. యాసిన్ పనికి వెళ్ళినప్పుడు ఆ షాప్ వాళ్ళ అమ్మ చూసుకుంటుంది. ఇకపోతే రెండో పెండ్లి గురించి అంటారా... వాళ్ళ నాన్న, బంధువులు చేసుకున్నంత మాత్రాన ఇతను కూడా అలాగే చేసుకుంటాడని భయపడడం సరైనది కాదు. మీకు అంత భయం ఉంటే యాసిన్ కోసం అతని తల్లిదండ్రులు కట్టించిన ఇంటిని వీరిద్దరి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించమని చెబుదాం. ప్రేమించుకున్న ఇద్దరికీ పెండ్లి చేసి సంతోషంగా ఉండేలా చూడడం పెద్దలుగా మీ బాధ్యత' అని ఎంతో సర్దిచెప్పాము.

ఇరు కుటుంబాల వారు పెండ్లికి అంగీకరించారు. కానీ యాసిన్, రేష్మా మాత్రం ఇంటికి వెళ్ళడానికి ఒప్పుకోలేదు. 'ఇప్పుడు మీ దగ్గరే సరే అంటారు.. ఇంటికి వెళ్ళిన తర్వాత వేరే అతనికిచ్చి పెండ్లి చేస్తారు' అంటూ మొండికేశారు. సరే అని వాళ్ల ఆచారం ప్రకారం 'ఖాజీ' దగ్గరకు తీసుకెళ్లి మేమే ఇద్దరికీ వివాహం చేయించాం. నెలకోసారి ఆఫీసుకు రావాలని చెప్పాం. తల్లిదండ్రులు కూడా సంతోషించారు.

'మా అమ్మాయి ఎక్కడికో వెళ్ళకుండా మీ దగ్గరకు వచ్చి మంచి పనే చేసింది. మీరు కాబట్టి మమ్మల్ని పిలిచి అర్థమయ్యేలా చెప్పి మా ముందే పెండ్లి చేశారు' అని రేష్మా తల్లిదండ్రులు ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇల్లు కూడా ఇద్దరి పేరు మీద రాసే విధంగా యాసిన్ తల్లిదండ్రులతో మాట్లాడాము. నిజమైన ప్రేమ గెలిచితీరుతుందని యాసిన్, రేష్మలు నిరూపించారు. ఇప్పుడు ఇద్దరూ ఇరు కుటుంబాలతో సంతోషంగా ఉంటున్నారు.

'మా అమ్మాయి ఎక్కడికో వెళ్ళకుండా మీ దగ్గరకు వచ్చి మంచి పనే చేసింది. మీరు కాబట్టి మమ్మల్ని పిలిచి అర్థమయ్యేలా చెప్పి మా ముందే పెండ్లి చేశారు' అని రేష్మా తల్లిదండ్రులు ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారు.

- వై వరలక్ష్మి,
9948794051

హాయిగా నిద్రపోవచ్చు!




ప్రతిరోజూ మనిషికి కంటి నిండా నిద్ర అవసరం. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంతో పాటు సరైన నిద్ర పోవాలి. కొందరికి మానసిక ఒత్తిడి సమస్య అయితే, మరికొందరు ఇతర సమస్యలు వెంటాడతాయి. అలాంటి వారికి రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టదు. స్మార్ట్ ఫోన్లు వచ్చాక చాలామంది నిద్రను లైట్ తీసుకుంటున్నారు. అర్ధరాత్రి.. అపరాత్రి అని లేకుండా నిత్యం ఫోన్లతోనే గడిపేస్తున్నారు. దానివల్ల మెదడు పనితీరు, జీర్ణక్రియ వ్యవస్థపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా అంతుచిక్కని రోగాలను కొని తెచ్చుకుంటున్నారు.

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే కనీసం 8 గంటల నిద్ర అవసరమని వైద్యులు, పరిశోధనలు చెబుతున్నాయి. కొన్ని అలవాట్లను మార్చుకుని.. ఈ సింపుల్ చిట్కాలను పాటించండి. తప్పకుండా మంచి నిద్ర మీ సొంతమవుతుంది.

- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. అప్పుడు జీర్ణక్రియ వ్యవస్థ బాగా పనిచేస్తుంది. మెదడు బాగా అలిసిపోయి నిద్ర త్వరగా పడుతుంది.
- రాత్రి భోజనం 8 గంటల లోపు, త్వరగా జీర్ణం అయ్యే తక్కువ మోతాదులో ఆహారాన్ని తినాలి. సి విటమిన్ అధికంగా ఉండే అరటికాయ, నల్ల ద్రాక్ష, కమలా పండ్లను తినాలి.
- రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల మంచినీళ్లను క్రమం తప్పకుండా తీసుకోవాలి. గోరువెచ్చని మంచినీళ్లు తాగితే ఇంకా మంచిది. రాత్రి వేళలో టీ, కాఫీలు తీసుకోకూడదు.
- పడుకునేముందు పుస్తకం చదవడం, మంచి సంగీతాన్ని వినడం వల్ల త్వరగా నిద్రపడుతుంది.
- బాదం పప్పు లేదా గోరు వెచ్చని బాదం పాలను తాగండి. దీనివల్ల కండరాలు, మనసు రిలాక్స్ అవుతాయి. ఫలితంగా చక్కగా నిద్రపడుతుంది.
- సరైన నిద్ర లేకపోతే ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంటుంది. ఎనిమిది గంటలు కాకపోయినా.. కనీసం ఆరు గంటలైనా ప్రశాంతంగా నిద్రపోయేలా టైమ్ సెట్ చేసుకోండి.

మోరంగడ్డతో ప్రయోజనాలెన్నో...



స్వీట్ పొటాటో దీనినే మనం మోరంగడ్డ అని కూడా అంటాం. ఫైబర్ ఇంకా విటమిన్ బి 6 అధికంగా ఉండే మోరంగడ్డ గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. విటమిన్ సి అధికంగా ఉండే చిలగడదుంప రోగనిరోధక శక్తిని అందించడమే కాదు ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని పెంచుతాయి. ఇందులో ఉండే పొటాషియం హృదయ స్పందనలు, నరాల సంకేతాలను నియంత్రిస్తుంది. మూత్రపిండాల వ్యాధులు, వాపులు, కండరాల తిమ్మిర్ల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. ఇది క్యాన్సర్ కారకాల నుంచీ కాపాడుతుంది. పొటాటో చిప్స్‌కు బదులు స్వీట్ పొటాటో చిప్స్ ఎంచుకోండి. ఆలూ చిప్స్ చేసే హానికి దూరంగా మనకు ఆరోగ్యాన్ని అందిస్తుంది. రక్తంలోని ఎర్ర తెల్ల రక్తకణాలను అధికంగా ఉత్పత్తి చేసి ఒత్తిడిని తగ్గిస్తుంది.

మిషన్‌భగీరథపై విజిలెన్స్

పంపాలని పేర్కొంది. గత వారం రోజులుగా విజిలెన్స్ విచారణ సాగుతున్నది. తొలుత నిజామాబాద్ ఎస్ఈ కార్యాలయంలో విచారించారు. ఆయా పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీరాక్స్ కాపీలను తీసుకున్నారు. అక్కడ జరిగిన పనులు, వ్యయం, ఏమేరకు అవినీతి జరిగిందనే విషయమై ఆరా తీశారు. అలాగే తాజాగా రాసిన లేఖలో నిజామాబాద్‌తోపాటు ఆదిలాబాద్, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన కాంట్రాక్టులు, ఇతర వివరాలను విజిలెన్స్ విభాగం అడిగింది. సోలార్ పథకాల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి వివరాలను ఇవ్వాలని భగీరథ శాఖను కోరింది. కాంట్రాక్టర్ల బౌతిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించి అంశాల్లో స్పష్టత అవసరం అని పేర్కొన్నది. ఆడిట్ పేరాల పరిశీలన, సమాధానాల సమాచారం కావాలని అడిగింది. ఈ మేరకు విజిలెన్స్ ఎస్పీ సిహెచ్.శృత కీర్తి, మిషన్ భగీరథ ఈఎన్సీకి లేఖ రాశారు. కాంట్రాక్టర్లకు పనుల అప్పగింత రికార్డులను ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లోని 26 సెగ్మెంట్లల్లో భగీరథ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. పనులు జరిగిన తీరు, బిల్లుల మంజూరు, పనులు ఇచ్చిన విధానం తదితర అంశాలపై గత వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సోదాల్లో విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నది. గురువారం భగీరథ రాష్ట్రకార్యాలయానికి ఇద్దరు విజిలెన్స్ అధికారులు వచ్చి విచారించారు. గణాంక అధికారితో ప్రాజెక్టు వ్యయం, అప్పులు, వడ్డీ తదితర అంశాలపై ఆరా తీశారు. సమాచారం కావాలని అడగడం మినహా ఫైళ్లేవీ స్వాధీనం చేసుకోకపోవడం గమనార్హం.

ఎలక్టోరల్ బాండ్స్ కేసులో 'సుప్రీం' ఆగ్రహం

(మొదటిపేజి తరువాయి)

బాండ్స్ నంబర్లను అందజేయకపోవడంపై మండిపడింది. ఎలక్టోర ల్ బాండ్లకు చెందిన నంబర్లను బహిర్గతం చేయాలని స్పష్టం చేసింది.ఈ నంబర్లు వెల్లడించకపోయేసరికి, ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత విరాళమిచ్చిందో తెలియలేదని ధర్మాసనం వెల్లడించింది. అన్ని వివరాలను తెలపాలని గతంలో ఇచ్చిన తీర్పులో వెల్లడించినా.. ఎస్‌బీఐ పట్టించుకోకపోవడం పట్ల సీజేఐ డివై చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశిష్టమైన ఆల్ఫా న్యూమరిక్ నంబర్‌ను బ్యాంకులు వెల్లడించాలని ఆయన తెలిపారు. ఆ నంబర్‌తో ఆ విరాళాలు ఎక్కడికి వెళ్తాయో తెలుస్తాయన్నారు. తదుపరి విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. అప్పటిలోగా ఎస్‌బీఐ వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, ఈసీఐ సీల్డ్ కవర్‌లో గతంలో ఇచ్చిన వివరాలను స్కాన్ చేసి డిజిటలైజ్ చేయాలని రిజిస్ట్రీకి ఆదేశించింది. అంతేకాదు.. ఈసీఐ సీల్డ్ కవర్‌లో ఇచ్చిన వివరాలను కూడా కేంద్ర ఎన్నికల కమిషన్ వెబ్ సైట్‌లో శనివారం సాయంత్రం 5 గంటల కల్లా ఉంచాలని స్పష్టం చేసింది.

ఖమ్మంలో హస్తం పంచాయితీ..!

(మొదటిపేజి తరువాయి)

ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతుండటం గమనార్హం. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మినహా మిగిలిన ఖమ్మం ఎంపీలంతా స్థానికేతరులేనన్న గత చరిత్రను కూడా కాంగ్రెస్ అధిష్టానం దగ్గర ఉంచి టిక్కెట్ ప్రయత్నాలు చేసుకుంటున్నవారూ ఉన్నారు.

ఆ మూడు అంశాలు కీలకం..

ఖమ్మం ఎంపీ టిక్కెట్ విషయంలో అంగ అర్థబలంతో పాటు ఆ నేత ఏమేరకు సమన్వయం చేసుకోగలరనే మూడు అంశాలు కీలకంగా మారనున్నాయి. ఈ లెక్కన ముగ్గురు జిల్లా మంత్రులు ఒకరికొకరు తీసిపోని విధంగా ఉన్నారు. 13 లక్షలకు పైగా ఓట్లున్న ఖమ్మం పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు ఎంత బలమున్నా తక్కువలో తక్కువ రూ.100 కోట్లకు పైగా వెచ్చిస్తేనే గెలుపు అవకాశాలున్నాయి. ఎందుకంటే ప్రత్యర్థి పార్టీల నుంచి పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, బీజేపీ టిక్కెట్ ఆశిస్తున్న జలగం వెంకట్రావు, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు సైతం ఖర్చు విషయంలో వెనక్కి తగ్గే అవకాశం లేదనే అంచనాలు ఉన్నాయి.

దీన్నిబట్టి అర్థబలం ఎంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. ముగ్గురు మంత్రుల్లో ఆర్థికపరమైన అంశంలో పొంగులేటి ముందున్నారు. ఇక అంగబలం విషయానికొస్తే ముగ్గురికి ముగ్గురు సమ ఉజ్జీలైనా.. ఒకరికి టిక్కెట్ ఇస్తే మిగిలిన ఇద్దరు ఏకమైనా ఆశ్చర్యపోనక్కర్లేదనే చర్చ ఆ పార్టీలో సాగుతోంది. అలాంటిదేమీ లేకుండా ప్రస్తుతమున్న సమన్వయాన్నే కొనసాగిస్తామనే సంకేతం ముగ్గురు మంత్రుల నుంచి అధిష్టానానికి వెళ్లినప్పుడే కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థిత్వం నిర్ధారణయ్యే అవకాశం ఉంది. మంత్రులు పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డికి కాకుండా భట్టి సతీమణి మల్లు నందినికీ లేకుండా తుమ్మల తనయుడు యుగంధర్‌కూ దక్కకుండా నాలుగో వ్యక్తికి ఎవరికిచ్చినా ఈ ముగ్గురు మంత్రులు వారికి ఎంతమేరకు సహకరిస్తారనే అంశంపైనే కాంగ్రెస్ గెలుపోటములు ఆధారపడి ఉంటాయని విశ్లేషకుల అంచనా. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అభ్యర్థిత్వం కోసం తీవ్ర పోటీ నెలకొన్న ప్రతి చోటా కాంగ్రెస్ అధిష్టానం టిక్కెట్ కేటాయింపుపై విస్తృత అధ్యయనం చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనిలో ప్రధానంగా ఖమ్మంపైనే ఎక్కువ ఫోకస్ ఉందని సమాచారం.

ఎన్నికల బాండ్ల గుట్టు బహిర్గతం

ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తదుపరి ఆదేశాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో స్వాగతించింది. బాండ్లు ఇచ్చిన దాతలు, పుచ్చుకున్నవారి పేర్లు తెలిసేలా ఎన్నికల బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ కోడ్‌లను ఎస్‌బీఐ అందజేయాలంటూ సుప్రీం కోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసింది. రాజకీయ పార్టీలకు అందిన నిధుల వివరాలను ప్రజలకు మరింత పారదర్శకంగా తెలియజేయడానికి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును దెబ్బతీసేందుకే ఈ ప్రయత్నాలన్నీ జరుగుతున్నాయన్న వాస్తవం దీంతో మరింత స్పష్టమైందని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది.

తమ వద్ద అందుబాటులో వున్న డేటాను ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైట్‌లో గురువారం అప్‌లోడ్ చేసినప్పటి నుంచి, ఈ డేటాను విశ్లేషించే యత్నాలు మొదలయ్యాయి. ఈ ఎన్నికల బాండ్ల పూర్తి ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టొచ్చని పొలిట్‌బ్యూరో పేర్కొంది. అయితే, ఎన్నికల బాండ్ల ద్వారా కార్పొరేట్ సంస్థల నుంచి నిధులను బలవంతంగా వసూలు చేసేందుకు ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించారని, అలాగే క్విడ్ ప్రొ కో వంటివి కూడా చోటుచేసుకున్నాయని ప్రాథమిక విశ్లేషణల్లో వెల్లడవుతోందని పొలిట్‌బ్యూరో తెలిపింది. ప్రజాస్వామ్యం భవితవ్యం పట్ల ఆసక్తి కలిగిన అన్ని రాజకీయ పార్టీలు, గ్రూపులు, వ్యక్తులు అందరూ కూడా ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు జరుగుతున్న ఇటువంటి దారుణమైన ప్రయత్నాలను నిరసిస్తూ, వీటిని ప్రతిఘటించాలని సీపీఐ(ఎం) కోరింది.

పదోన్నతులకు ఎన్నికల ఎఫెక్ట్

(జీహెచ్ఎం) పదోన్నతులు చేపట్టే అవకాశమున్నది. అందుకనుగుణంగా వేసవి సెలవుల్లో విద్యాశాఖ షెడ్యూల్‌ను జారీ చేయనుంది. దీంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మల్టీజోన్-2 పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల (జీహెచ్ఎం) పదోన్నతులపై ఉన్న స్టేను హైకోర్టు ఈనెల 11న ఎత్తేసిన విషయం తెలిసిందే. పాత షెడ్యూల్‌ను కొనసాగించేందుకు అనుమతిచ్చింది. దీంతో పాఠశాల విద్యాశాఖ వెంటనే స్పందించి షెడ్యూల్‌ను విడుదల చేస్తుందని ఉపాధ్యాయులందరూ ఆశించారు. ఆ మేరకు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. సీనియార్టీ జాబితా సిద్ధంగా ఉందనీ, వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పిస్తే రెండు రోజుల్లో పదోన్నతుల ప్రక్రియ పూర్తవుతుందని టీఎస్‌యూటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. కానీ పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వస్తుండడంతో ఆ దిశగా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేయకపోవడం గమనార్హం. షెడ్యూల్ విడుదలయ్యాక ఎన్నికల షెడ్యూల్ వస్తే ఆ ప్రక్రియ నిలిచిపోతుందన్న అభిప్రాయానికి వారు వచ్చినట్టు తెలిసింది. అయితే మల్టీజోన్-2 పరిధిలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులకు, మల్టీజోన్-1 పరిధిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు జీహెచ్ఎం పదోన్నతులను కల్పించిన విషయం తెలిసిందే. ఈనెల నుంచే ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణలు ప్రారంభమవుతాయి. మల్టీజోన్-2లో పదోన్నతులు పొందకుండానే స్కూల్ అసిస్టెంట్లు ఉద్యోగ విరమణ పొందుతారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ

(మొదటిపేజి తరువాయి)

సందర్భంగా సంఘాల ప్రతినిధులు ఇచ్చిన విజ్ఞప్తులు, వినతులన్నింటినీ పరిశీలించి, ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని పరిశీలించి సాధ్యాసాధ్యాలు, పరిష్కార మార్గాలను సూచించే బాధ్యతను త్రిసభ్య కమిటీకి అప్పగించామని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పరిష్కరించే దిశగా సలహాలు సూచనలతో నివేదికను అందజేయాలని ఆ కమిటీకి సీఎం సూచించారు.

భువనగిరి బరిలో సీపీఐ(ఎం)

(మొదటిపేజి తరువాయి)

విధానాలను నిరసిస్తూ రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రైతు చట్టాలకు వ్యతిరేకంగా 1100 మంది రైతులు మృతి చెందితే తప్ప ప్రధాని వెనకడుగు వేయలేదని విమర్శించారు. దేశాన్ని అప్పుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. దేశంలో కార్పొరేట్ శక్తులు.. ఆర్ఎస్ఎస్, మోడీ అమిత్ షా త్రయంలో ట్రిబుల్ ఇంజిన్ సర్కార్ నడుస్తుందన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగ నరసింహులు, మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ, సిరిపంగి స్వామి, మాయ కృష్ణ, బొల్లు యాదగిరి, ఎండి.పాషా, బబ్బురి పోశెట్టి, గంగదేవి సైదులు, బొడ్డుపల్లి వెంకటేష్, బండారు నరసింహ, బొలగాని జయరాములు, అవ్వారు రామేశ్వరి, గడ్డం వెంకటేష్, ఎంఎ.ఇక్బాల్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాది సెక్యులర్ సర్కార్ (మొదటిపేజి తరువాయి)

నిలుస్తుందని చెప్పారు. విద్య ఉద్యోగాల్లో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలుపరు స్తామన్నారు. వాటిని మోడీ, అమిత్‌షా రద్దు చేస్తామంటున్నారనీ, అది వారి వల్ల కాదని చెప్పారు. వాటిని అడ్డుకోవడం ఎవరికీ సాధ్యం కాదని చెప్పారు. మైనా ర్టీ పాఠశాలలకు, రెసిడెన్షియల్ భవనాల కోసం ప్రభు త్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందని తెలిపారు. ప్రభుత్వం మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పింస్తుందని చెప్పారు. వారికి అండగా ఉంటుందన్నారు. అన్ని వర్గాలకు సమానమైన గౌరవం ప్రజా ప్రభుత్వంలో ఉంటుందని తెలిపారు.

సముద్రగర్భ కేబుల్స్ విఫలం

- ఆఫ్రికా దేశాల్లో ఇంటర్నెట్‌కు అంతరాయం

అబుజా (నైజీరియా) : సముద్రగర్భంలోని అనేక టెలికమ్యూనికేషన్ కేబుల్స్ విఫలం కావడంతో ఆఫ్రికా దేశాల్లో ఇంటర్నెట్ సేవలకు గురు, శుక్రవారాల్లో అంతరాయం కలిగింది. ఈ విషయాన్ని నెట్‌వర్క్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ వాచ్ గ్రూపులు తెలిపాయి. ఆఫ్రికాలో ప్రముఖ నెట్‌వర్క్ ప్రొవైడర్లలో ఒకటైన ఎంటిఎన్ ఒక ప్రకటనలో 'సముద్ర గర్భ కేబుల్స్ విఫలం కావడంతో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలుగుతోంది. ప్రత్యామ్నాయ నెట్‌వర్క్ మార్గాల ద్వారా ట్రాఫిక్‌ను రీరూట్ చేయడానికి చర్యలు చురుగ్గా కొనసాగుతున్నాయి' అని తెలిపింది. ఈ వైఫల్యానికి కారణాన్ని ఇంకా ఖచ్చితంగా గుర్తించలేదు. ఇటీవల కాలంలో ఆఫ్రికాలో సముద్ర గర్భ కేబుల్స్ విఫలం చెందడం తరుచూ జరుగుతోందని, అయితే తాజా వైఫల్యం అతి పెద్దదని నెట్‌బ్లాక్స్ తెలిపింది. తాజా వైఫల్యంతో ఐవరీ కోస్ట్, లైబీరియా, బెనిన్, ఘన, బుర్కినా ఫాసోతో సహా 10 ఆఫ్రికా దేశాలపై ప్రభావం చూపుతుందని ఇంటర్నెట్ విశ్లేషణ సంస్థ క్లౌడ్‌ఫ్లేర్ తెలిపింది.

నేడే ఎన్నికల నగారా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

18వ లోక్‌సభతో పాటు, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగనుంది. ఇందుకు సంబంధించి నేడు(శనివారం) షెడ్యూల్ విడుదల కానుంది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కొత్త ఈసీలు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, జ్ఞానేష్ కుమార్‌తో కలిసి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపింది. దేశంలోని మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు, ఆంధ్రప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్, ఒరిస్సా, సిక్కిం రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేయనున్నారు. అసెంబ్లీతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కాశ్మీర్‌కు విభజన, ఆర్టికల్ 370 రద్దు తరువాత తొలిసారి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 175, ఒరిస్సాలో 147, అరుణాచల్ ప్రదేశ్‌లో 60, సిక్కింలో 32 అసెంబ్లీ స్థానాలకూ ఎన్నికలు జరగబోతున్నాయి. అలాగే ఇటీవల మరణించిన, ఇతర కారణాలతో దేశ వ్యాప్తంగా ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాల్లోని సీట్లకు ఉప ఎన్నికలు ప్రకటించే అవకాశమున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే నందిత లాస్య మరణంతో ఖాళీ అయిన తెలంగాణలోని కంటోన్మెంట్ సీటుకు కూడా షెడ్యూల్ ప్రకటించే ఆస్కారం ఉంది. కాగా ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల అధికారులు ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి కసరత్తు పూర్తి చేశారు. దీని ఆధారంగా ఈ నెల 13నే షెడ్యూల్ విడుదల చేయాలని ఈసీఐ ముందుగా భావించింది. అయితే గత ఫిబ్రవరి 14న ఎన్నికల కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ చేశారు. మరోవైపు మార్చి 8న అనూహ్యంగా మరో కమిషనర్ అరుణ్ గోయల్ కేంద్ర ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌పై ప్రభావం పడింది. అయితే తాజాగా ఖాళీ అయిన రెండు ఈసీ స్థానాలను కేంద్రం భర్తీ చేయడం, వారిద్దరూ బాధ్యతలు స్వీకరించడంతో షెడ్యూల్‌కు లైన్ క్లియరైంది.

గతంలో మాదిరిగానే ఏడు దశల్లో ఎన్నికలు

2019లో సార్వత్రిక ఎన్నికల కోసం మార్చి 10న ఈసీఐ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. అయితే ఈసారి దాదాపు వారం రోజులు ఆలస్యంగా షెడ్యూల్ విడుదలవుతోంది. అయితే 2019 సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా దేశ వ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిసింది. మొదటి దశ ఏప్రిల్ 11, రెండో దశ ఏప్రిల్ 18, మూడో దశ ఏప్రిల్ 23, నాలుగో దశ ఏప్రిల్ 29 , ఐదో దశ మే 6, ఆరో దశ మే 12, ఏడో దశ మే 19న ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు ఫలితాలు మాత్రం మే 23న వెల్లడించారు. ఇందులో మొదటి దశలోనే తెలంగాణ, ఏపీలో ఎన్నికలు ముగిశాయి. ఈసారి కూడా తొలి దశలోనే తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలను ముగించే అవకాశం ఉంది. కాగా 2014లో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగానే ఏపీ, తెలంగాణలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అయితే 2018లో కేసీఆర్ ముందస్తుకు వెళ్లడంతో... తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో మార్పులు వచ్చాయి. దీంతో ఈసారి ఏపీ రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకే సారి జరగనున్నాయి.

నూతన ఈసీల బాధ్యతల స్వీకరణ

కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ)లో నూతన ఎలక్షన్ కమిషనర్లుగా(ఈసీ) మాజీ ఐఏఎస్ అధికారులు సుఖ్ బీర్ సింగ్ సంధూ, జ్ఞానేశ్వర్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. వీరిద్దరిని నూతన ఈసీలుగా నియమిస్తూ కేంద్ర న్యాయ శాఖ గురువారం రాత్రి గెజిట్ విడుదల చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయమే నిర్వచన్ సదన్ లో నూతన ఈసీలుగా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజీవ్ కుమార్ నేతృత్వంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్, నిర్వాహణ, దశల వారీ ఎన్నికల తేదీలు, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం విడుదల చేయనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు.

వైట్‌బాల్ క్రికెట్‌లో స్టాప్ క్లాక్

మ్యాచ్ ఫీజులో కోత, బౌండరీ లైన్ దగ్గర ఓ ఫీల్డర్ కుదింపు.. వైట్‌బాల్ క్రికెట్‌లో సమయం వృథాను తగ్గించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కమిటీ (ఐసీసీ) అమలు చేస్తున్న కఠిన నిబంధనలు. అయినా, వైట్‌బాల్ ఫార్మాట్ క్రికెట్‌లో ఆశించిన గుణాత్మక మార్పులు రావటం లేదు. టీ20, వన్డే మ్యాచులు నిర్దేశిత సమయం కంటే ఆలస్యంగా ముగుస్తున్నాయి. దీంతో ఐసీసీ మరో కఠిన నిబంధనతో ముందుకొచ్చింది. వన్డే, టీ20 క్రికెట్‌లో 'స్టాప్ క్లాక్' నిబంధనను శాశ్వతం చేయనుంది. రెండు ఓవర్ల మధ్య విరామం 60 సెకండ్ల గడువు మూడుసార్లు మించితే.. ఫీల్డింగ్ జట్టుపై 5 పరుగుల పెనాల్టీ విధించనుంది. ఈ నిబంధన జూన్ 1, 2024 నుంచి మెన్స్ వైట్‌వాట్ క్రికెట్‌లో అమల్లోకి రానుంది. రానున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో సైతం ఈ నిబంధన అమలు చేయనున్నారు.

- జూన్ 1 నుంచి అమల్లోకి కొత్త నిబంధన
- అంతర్జాతీయ క్రికెట్ కమిటీ ప్రకటన



నవతెలంగాణ-దుబాయ్

అంతర్జాతీయ మెన్స్ వైట్‌బాల్ క్రికెట్‌లో సరికొత్త నిబంధనల అమల్లోకి రానుంది. గత ఏడాది డిసెంబర్ నుంచి ప్రయోగాత్మకంగా అమలు పరిచిన 'స్టాప్ క్లాక్' నిబంధన ఈ ఏడాది జూన్ 1 నుంచి శాశ్వతంగా అమల్లోకి రానుంది. వన్డే, టీ20 క్రికెట్‌లో మీతిమీరిన సమయం వృథాను అరికట్టేందుకు 'స్టాప్ క్లాక్'ను అమలు చేస్తున్నట్టు అంతర్జాతీయ క్రికెట్ కమిటీ (ఐసీసీ) ఓ ప్రకటనలో తెలిసింది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్‌లో సైతం స్టాప్ క్లాక్ నిబంధన అమల్లో ఉండనుంది. 'ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీకి (సీఈసీ)కి స్టాప్ క్లాక్ ప్రయోగాత్మక ఫలితాల నివేదికను సమర్పించారు. ఓ వన్డే మ్యాచ్‌లో కనీసం 20 నిమిషాల సమయం ఆదా ఈ నిబంధనతో చేకూరింది. సమయం వృథా నివారణలో స్పష్టమైన ఫలితాలను సీఈసీ పరిగణనలోకి తీసుకుంది. అంతర్జాతీయ వైట్‌బాల్ క్రికెట్‌లో స్టాప్ క్లాక్ నిబంధన తప్పనిసరి చేయాలని నిర్ణయం తీసుకుంది. జూన్ 1, 2024 నుంచి స్టాప్ క్లాక్ రూల్ అమలు చేయబడుతుంది' అని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది.

5 పరుగుల పెనాల్టీ

ఐసీసీ నిబంధనల ప్రకారం ప్రతి రెండు ఓవర్ల మధ్య విరామం 60 సెకండ్లు మించకూడదు. తొలి ఓవర్లో చివరి బంతి పడిన తర్వాత.. 60 సెకండ్ల లోపు రెండో ఓవర్ తొలి బంతి పడాలి. 60 సెకండ్ల గడువును ఓ ఇన్నింగ్స్‌లో మూడుసార్లు దాటితే.. అప్పుడు ఫీల్డ్ అంపైర్ 5 పరుగుల జరిమానా విధిస్తారు. 60 సెకండ్ల సమయం మించినప్పుడు తొలి రెండు సార్లు ఫీల్డ్ అంపైర్ హెచ్చరిక జారీ చేస్తారు. మూడోసారి మాత్రమే 5 పరుగుల జరిమానా విధిస్తారు. ఇదిలా ఉండగా, 2023 డిసెంబర్ నుంచి స్టాప్ క్లాక్ నిబంధనను ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఈ సమయంలో ఏ జట్టు సైతం పెనాల్టీకి గురి కాలేదు. ఈ విషయం సీఈసీకి సమర్పించిన నివేదికలో పొందుపరిచారు.

మూడు నిబంధనలు!

అంతర్జాతీయ వైట్‌బాల్ క్రికెట్‌లో సమయ పాలన కోసం ఐసీసీ ఇప్పటికే రెండు కఠిన నిబంధనలు అమలు చేస్తుండగా, ఇప్పుడు మూడోదీ తీసుకొచ్చింది. మెరుగైన ఓవర్‌రేట్ లక్ష్యం కోసం గతంలో తీసుకొచ్చిన రెండు నిబంధనలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు!. నిర్దేశిత సమయంలోపు నిర్ణీత ఓవర్లను పూర్తి చేయకుంటే.. ఆ సమయం పూర్తయిన తర్వాత మిగిలిన ఓవర్లకు 30 గజాల సర్కిల్ ఆవల ఓ ఫీల్డర్‌ను సర్కిల్ లోపలకు తీసుకురావాల్సి ఉంటుంది. డెత్ ఓవర్లలో ఫీల్డింగ్ జట్టు సర్కిల్ బయట నలుగురు ఫీల్డర్లను మాత్రమే నిలుపుకోవాల్సి ఉంటుంది. ఇక ఓవర్‌రేట్‌కు మ్యాచ్ ఫీజులో జరిమానా సైతం అమల్లో ఉంది. ప్రతి ఆలస్యమైన ఓవర్‌కు మ్యాచ్ ఫీజులో 5 శాతం కోత పడుతుంది. మ్యాచ్ ఫీజులో కోత గరిష్టంగా 50 శాతం వరకు ఉంటుంది. ఆటగాళ్లతో పోల్చితే కెప్టెన్‌కు రెట్టింపు మ్యాచ్ ఫీజు కోత విధిస్తారు.



ఇక కనీసం 10 ఓవర్లు

ఐసీసీ సీఈసీ సమావేశంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో నాకౌట్ మ్యాచుల్లో ఫలితం తేలేందుకు కనీసం ప్రతి ఇన్నింగ్స్‌లో 10 ఓవర్ల ఆట సాగాలని తేల్చింది. ప్రస్తుతం ఏదేని కారణంగా మ్యాచ్ కుదించబడితే.. 5 ఓవర్ల మ్యాచ్‌కు అవకాశం ఉంటుంది. కానీ ఇక నుంచి 5 ఓవర్ల ఆట కుదరదు. క్వార్టర్‌ఫైనల్, సెమీఫైనల్ సహా ఫైనల్లో కనీసం 10 ఓవర్ల ఆట సాధ్యపడితేనే ఫలితం తేలుతుంది. గ్రూప్ దశ మ్యాచులకు మాత్రం ఈ నిబంధన వర్తించదు. గతంలో మాదిరిగానే 5 ఓవర్ల ఆటతో ఫలితాన్ని తేల్చవచ్చు. ప్రపంచకప్‌లో ఫైనల్‌తో పాటు సెమీఫైనల్స్‌కు సైతం రిజర్వ్ డే కేటాయించారు.

2026కు అర్హత ఇక్కడ్నుంచే

ఐసీసీ 2026 టీ20 ప్రపంచకప్ అర్హత ప్రక్రియ 2024 టీ20 వరల్డ్‌కప్‌లోనే మొదలవుతుందని ఐసీసీ సీఈసీ ప్రకటించింది. 2026 ప్రపంచకప్‌లోనూ 20 జట్లు పోటీపడుతుండగా.. 12 జట్లు నేరుగా అర్హత సాధించనున్నాయి. ఆతిథ్య దేశాలు భారత్, శ్రీలంక సహా 2024 టీ20 ప్రపంచకప్‌లో సూపర్8 దశకు చేరుకున్న జట్లు నేరుగా అర్హత సాధిస్తాయి. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలిచిన రెండు/నాలుగు జట్లు సైతం అర్హత సాధిస్తాయి. మిగతా జట్లు రీజినల్, కాంటినెంటల్ అర్హత టోర్నీల నుంచి ప్రపంచకప్‌కు చేరుకోవాల్సి ఉంటుంది.



శరత్ ఓటమి

- సింగపూర్ స్మాష్ 2024

సింగపూర్ : భారత టేబుల్ టెన్నిస్ స్టార్ క్రీడాకారుడు, వరల్డ్ నం.88 అచంట శరత్ కమల్ మెరుపు విజయాలకు బ్రేక్ పడింది. సింగపూర్ స్మాష్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో వరుసగా వరల్డ్ నం.13, వరల్డ్ నం.22 ర్యాంక్ ఆటగాళ్లను ఓడించిన శరత్ కమల్ క్వార్టర్‌ఫైనల్లో తడబడ్డాడు. ఈ టోర్నీలో తొలిసారి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న శరత్ కమల్ 9-11, 2-11, 7-11, 11-9, 8-11తో పరాజయం పాలయ్యాడు. వరల్డ్ నం.6, ఫ్రాన్స్ ఆటగాడు ఫెలిక్స్ లెబ్రూన్ 4-1తో శరత్ కమల్‌పై సాధికారిక విజయం నమోదు చేశాడు. ఇటీవల కాలంలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన శరత్ కమల్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-40లోకి అడుగుపెట్టే అవకాశం ఉంది. పారిస్ ఒలింపిక్స్ ముంగిట శరత్ కమల్ ప్రదర్శన అతడిలో ఆత్మవిశ్వాసం రెట్టింపు చేయనుంది.



కార్ల్‌సన్ చెస్960

ఫ్రీస్టయిల్ వరల్డ్ టూర్ ప్రకటన

పారిస్ : ప్రపంచ చెస్ దిగ్గజం, ఐదు సార్లు ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ సరికొత్త సవాల్‌కు సిద్ధమయ్యాడు. ఈ ఏడాది నవంబర్‌లో ప్రపంచ ఫ్రీస్టయిల్ చెస్ టూర్ (చెస్ 960)కి శ్రీకారం చుట్టనున్నాడు. వరల్డ్ నం.1 కార్ల్‌సన్ మాగ్నస్ ఈ టూర్‌లో భాగంగా ఎంపిక చేసిన ఎనిమిది మంది దిగ్గజ చెస్ క్రీడాకారులతో పోటీపడనున్నాడు. కార్ల్‌సన్ ఈ టూర్‌ను చెస్ పవర్‌హౌస్ భారత్ నుంచి మొదలుపెట్టనున్నాడు. భారత్‌లో చెస్360 ప్రైజ్‌మనీ రూ.4.15 కోట్లుగా కార్ల్‌సన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జర్మనీ, అమెరికా, కంబోడియా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలో సైతం చెస్360 పోటీలు ఉంటాయని తెలిపాడు.

ఆకాశంలో ఐపీఎల్ టికెట్ల ధరలు!

- గరిష్ట టికెట్ ధర రూ.30 వేలు
- కనిష్ట టికెట్ ధర రూ.1500

నవతెలంగాణ, హైదరాబాద్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 సీజన్‌కు సిద్ధమవుతున్న తెలంగాణ క్రికెట్ అభిమానులకు సన్‌రైజర్స్ హైదరాబాద్ గట్టి షాక్ ఇచ్చింది. ఈ సీజన్ టికెట్ల ధరలను అమాంతం పెంచేసిన సన్‌రైజర్స్ యాజమాన్యం.. సగటు అభిమానులు స్టేడియంలో రావటం గగనం చేసింది. ఈ నెల 27న ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్ మ్యాచ్‌కు టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఈ మ్యాచ్‌కు టికెట్ ధర కనిష్ఠంగా రూ.1500గా నిర్ధారించారు. దీనికి జీఎస్‌టి అదనం. గరిష్ఠంగా కార్పొరేట్ బాక్స్ టికెట్ ధర రూ.30 వేలుగా నిర్ధారించారు. ఇతర స్టాండ్స్ టికెట్ల ధరలు రూ.2500, రూ. 4000, రూ. 4500, రూ.7500, రూ.15000, రూ.22000గా ఉన్నాయి. హైదరాబాద్ ఇటీవల వరుసగా క్రికెట్ మ్యాచులకు ఆతిథ్యం వహించింది. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ సహా భారత్, ఇంగ్లాండ్ టెస్టు మ్యాచ్‌లకు టికెట్ల ధరలు సాధారణ అభిమానులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. కానీ ఐపీఎల్ టికెట్లను సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం భారీగా పెంచింది. గతంలో ఐపీఎల్ మ్యాచ్‌లను టెర్రస్ 2 నుంచి వీక్షించేందుకు టికెట్ ధర రూ.500-750 వరకు ఉండేది. కానీ సీజన్‌లో ఇదే టికెట్ ధర మూడు రెట్లు అదనంగా ఉండటంతో అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆదుకున్న పెర్రీ

- ఆర్‌సీబీ 135/6
- డబ్ల్యూపీఎల్ ఎలిమినేటర్



న్యూఢిల్లీ : రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఆల్‌రౌండర్ ఎలిసీ పెర్రీ (66, 50 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో ఆ జట్టును ఆదుకుంది. 49/4తో కష్టాల్లో కూరుకున్న ఆర్‌సీబీని మెరుపు ఇన్నింగ్స్‌తో రేసులోకి తీసుకొచ్చింది. టాస్ నెగ్గిన ఆర్‌సీబీ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ముంబయి ఇండియన్స్ బౌలర్ల జోరుతో ఆర్‌సీబీ వరుసగా వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ స్మృతీ మంధాన (10), సోఫీ డెవిన్ (10), దిశా (0), రిచా ఘోష్ (14) దారుణంగా విఫలమయ్యారు. ఈ సమయంలో ఎలిసీ పెర్రీ జట్టును ముందుండి నడిపించింది. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 40 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన పెర్రీ.. ఆఖరి ఓవర్లో నిష్క్రమించింది. సోఫీ (11), జార్జియ (18 నాటౌట్) పెర్రీ తోడుగా ఆకట్టుకున్నారు. ఆర్‌సీబీ 20 ఓవర్లలో 6 వికెట్లకు 135 పరుగులు చేసింది. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో హేలీ మాథ్యూస్, సీవర్, సైకాలు రెండేసి వికెట్లు పడగొట్టారు. ఎలిమినేటర్‌లో విజేతగా నిలిచిన జట్టు డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది.

నవ్వులే నవ్వులు..



హీరో శ్రీ విష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ముఖ్య పాత్రధారులుగా 'హుషారు' ఫేమ్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వం వహించిన అవుట్ అండ్ అవుట్-ఎంటర్‌టైనర్ 'ఓం భీమ్ బుష్'. వి సెల్యులాయిడ్, సునీల్ బలుసు కలిసి ఈ సినిమాని నిర్మిస్తుండగా, యువి క్రియేషన్స్ సమర్పిస్తుంది. తాజాగా మేకర్స్ శుక్రవారం సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు.

హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ,'మార్చి 22న థియేటర్స్‌కి రండి. మీరు నవ్విన నవ్వులకు థియేటర్స్ బద్దలైపోతాయి. పిచ్చిపిచ్చిగా ఎంజాయ్ చేస్తారు. ఫ్రెండ్స్ గ్రూప్స్‌తో వెళితే ఇంక బాగా ఎంజాయ్ చేస్తారు. 22న ఎవరూ మిస్ అవ్వద్దు. మిమ్మల్ని నవ్వించాలనే ఉద్దేశంతోనే సినిమా చేశాం. రెండు వందల శాతం పిచ్చిపిచ్చిగా నవ్వుతారు. కేవలం ఎంటర్‌టైన్మెంట్ ఇవ్వాలని ఫిక్స్ అయి చేసిన సినిమా ఇది. దర్శకుడు హర్ష చాలా హిలేరియస్‌గా సినిమాని తీశారు' అని తెలిపారు. 'ఈనెల 22 తప్పకుండా అందరూ థియేటర్స్ కి రండి. డబుల్ డోస్ ఎంటర్‌టైన్మెంట్ ఇస్తామని ప్రామిస్ చేస్తున్నాం. నిర్మాతలు వంశీ, సునీల్ చాలా సపోర్ట్ చేశారు. వారి ప్రోత్సాహం వలనే ఇంత క్రేజీ సినిమా చేయగలిగాం. తప్పకుండా సినిమా మీ అందరినీ అలరిస్తుంది' అని ప్రియదర్శి అన్నారు.

దర్శకుడు శ్రీ హర్ష కొనుగంటి మాట్లాడుతూ,'ట్రైలర్‌లో ఉండే ఎనర్జీ కంటే సినిమాలో వందరెట్ల ఎనర్జీ ఉంటుంది. 22న అందరూ గ్యాంగ్స్‌తో రండి. టెన్ టైమ్స్ ఎంటర్‌టైన్ అవుతారు. అది మా గ్యారెంటీ' అని తెలిపారు. నిర్మాత సునీల్ బలుసు మాట్లాడుతూ, 'ఓ మంచి హిలేరియస్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాని తెరకెక్కించాం. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ కచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తుంది. ప్రేక్షకుల నవ్వులతో థియేటర్లు మారుమోగిపోవడం ఖాయం' అని అన్నారు.

అర్జునుడి గీతోపదేశం మొదలైంది



వరలక్ష్మీ శరత్ కుమార్ మెయిన్ లీడ్‌గా, అఖిల్ రాజ్, దివిజ ప్రభాకర్ ఇతర ప్రధాన పాత్రలలో సతీష్ గోగాడ దర్శకత్వంలో ఫస్ట్ కట్ ఫిల్మ్ ఫ్యాక్టరీ ప్రొడక్షన్ నెం1 గా రూపొందనున్న చిత్రం 'అర్జునుడి గీతోపదేశం'. త్రిలోక్ నాథ్.కె, ప్రదీప్ రెడ్డి.వి నిర్మిస్తున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది.

ముహూర్తపు సన్నివేశానికి కనుమెలి అమ్మిరాజు క్లాప్ కొట్టగా, మల్లాల సీతారామరాజు కెమెరా స్విచాన్ చేశారు. త్రిలోక్ నాథ్, పూజిత స్క్రిప్ట్ అందించగా, లక్కంశెట్టి వేణు గోపాల్ తొలిషాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు.

రాజీవ్, ఆదిత్య శశికుమార్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి చరణ్ అర్జున్ సంగీతం అందిస్తుండగా, చైతన్య కందుల డీవోపీగా, అర్జున్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

దర్శకుడు సతీష్ గోగాడ మాట్లాడుతూ,'దర్శకుడిగా ఇది నా తొలి చిత్రం. ఈ కథ చెప్పినపుడు నటీనటులంతా చాలా పాజిటివ్‌గా స్పందించారు. ఈనెల 20 నుంచి మొదటి షెడ్యుల్ అమలాపురంలో మొదలుపెడుతున్నాం. తర్వాత వైజాగ్, హైదరాబాద్, చెన్నైలో తర్వాత షెడ్యూల్స్ ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

'ఫస్ట్ కట్ ఫిల్మ్ ఫ్యాక్టరీలో ఇది మొదటి సినిమా. సతీష్ చెప్పిన కథ చాలా అద్భుతంగా అనిపించింది. ప్రేక్షకులందరినీ అలరించేలా ఈ సినిమా ఉంటుంది' అని నిర్మాతలు చెప్పారు.

రాజీవ్ మాట్లాడుతూ, 'దర్శకుడు సతీష్‌కి సినిమా అంటే చాలా ప్యాషన్. కథ చెప్పినపుడు చాలా ప్లజెంట్‌గా అనిపించింది. మంచి క్యారెక్టర్ చేస్తున్నాను' అని తెలిపారు. 'చాలా మంచి కథ ఇది. ఇందులో లీడ్ రోల్‌లో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు. చాలా మంచి టీంతో కలసి ఈ సినిమా చేస్తున్నాం' అని దివిజ అన్నారు.

వరలక్ష్మి శరత్‌కుమార్, అఖిల్ రాజ్, దివిజ ప్రభాకర్, రాజీవ్, ఆదిత్య శశికుమార్ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి రచన – దర్శకత్వం: సతీష్ గోగాడ, సంగీతం: చరణ్ అర్జున్, డివోపీ: చైతన్య కంధుల, ఆర్ట్: కె.వి.రమణ, ఎడిటర్: అర్జున్, లైన్ ప్రొడ్యూసర్: నాని రెడ్డి కె, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరికృష్ణ బోగ, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: రాము తాటిపాక, కొరియోగ్రఫర్: విజయ్ పోలంకి.

నవచిత్రం

భీమాకు అపూర్వ ఆదరణ



మారుతి, గోపీచంద్, సంపత్‌నంది, మాళవిక శర్మ


హీరో గోపీచంద్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'. ఎ హర్ష దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె కె రాధామోహన్ నిర్మించారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్స్‌గా నటించారు. మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 8న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్‌గా థ్యాంక్స్ మీట్ నిర్వహించింది. దర్శకులు మారుతి, సంపత్ నంది ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

హీరో గోపీచంద్ మాట్లాడుతూ, 'ఇంత మంచి విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. సినిమాకి చాలా మంచి ప్రసంశలు వచ్చాయి. సినిమా చాలా బావుంది, రెండు క్యారెక్టర్స్‌లో చక్కని వేరియేషన్స్ చూపించారని మంచి అప్లాజ్ వచ్చింది. ఇంకా చూడని వారంతా థియేటర్స్‌కి వెళ్లి చూడండి. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది. గ్రాఫిక్స్, యాక్షన్, కామెడీ అద్భుతంగా ఉంటాయి. మా విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి వచ్చిన మారుతి, సంపత్ నందికి ప్రత్యేక ధన్యవాదాలు. ఇంత మంచి కథ తీసుకొచ్చి, ఆడియన్స్‌కి ఏం కావాలో అలాంటి మంచి కమర్షియల్ ప్యాక్డ్ సినిమా ఇచ్చిన హర్షకి, ఎక్కడా రాజీపడకుండా సినిమాని నిర్మించి ఇంత మంచి సినిమా ఇచ్చిన రాధామోహన్‌కి, శ్రీధర్‌కి ధన్యవాదాలు. పరీక్షలు అయిపోయాయి. ఇంకా చూడనికి ప్రేక్షకులు తప్పకుండా చూడండి. ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.

'ఇది నా మొదటి తెలుగు సినిమా. నాకు సపోర్ట్ చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇంత మంచి సినిమాని ఇచ్చిన నిర్మాత రాధమోహన్‌కి, సహ నిర్మాత శ్రీధర్‌కి ధన్యవాదాలు. గోపీచంద్ అద్భుతమైన నటుడు. చాలా సార్లు నిరూపించారు. భీమాకి వచ్చిన రెస్పాన్స్ మరింత అనందం ఇచ్చింది. ఈ అవకాశం ఇచ్చిన ఆయనకు, ఇంతమంచి విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇంకా సినిమా చూడని ప్రేక్షకులు తప్పకుండా థియేటర్స్‌లో చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారు' అని చిత్ర దర్శకుడు హర్ష చెప్పారు.

నిర్మాత రాధామోహన్ మాట్లాడుతూ,'మా 'భీమా' సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఇప్పుడు పరీక్షలు పూర్తయ్యాయి. రోజు రోజుకి కలెక్షన్స్ పెరుగుతున్నాయి. పిల్లలు, పేరెంట్స్ కలసి ఈ సినిమా చూసి, నెక్స్ట్ వీక్ కలెక్షన్స్ ఇంకా బాగా పెరుగుతాయని భావిస్తున్నాం' అని తెలిపారు.

బర్త్‌డే గిఫ్ట్‌లు



ఆనంద్ దేవరకొండ

హీరో ఆనంద్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త పోస్టర్ రిలీజ్ చేసింది 'గం..గం..గణేశా' చిత్రబృందం. ఈ సినిమాను హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆనంద్ దేవరకొండ తన కెరీర్‌లో చేస్తున్న ఫస్ట్ యాక్షన్ మూవీ ఇది కావడం విశేషం.

గం..గం..గణేశా

ఈ మూవీ కొత్త పోస్టర్‌లో రకరకాల ఆయుధాలు పట్టుకుని మీదకు వస్తున్న విలన్స్‌ను నవ్వుతూ చూస్తున్న ఆనంద్ దేవరకొండ స్టిల్ ఉంది. ఈ విలన్స్‌తో పాటే రోజ్ ఫ్లవర్ ఇస్తున్న హీరోయిన్‌ను కూడా చూపించడం ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ప్రస్తుతం ఈ సినిమా రిలీజ్‌కు రెడీగా ఉంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిషోర్, జబర్దస్త్ ఇమాన్యుయల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: కిరణ్ మామిడి, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాడి, సంగీతం : చేతన్ భరద్వాజ్, కొరియోగ్రఫీ: పొలాకి విజయ్, కో-ప్రొడ్యూసర్ –అనురాగ్ పర్వతనేని, రచన, దర్శకత్వం – ఉదయ్ శెట్టి.

డ్యూయెట్‌లో మదన్..



ఆనంద్ దేవరకొండ నటిస్తున్న మరో యూత్ ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ 'డ్యూయెట్'. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. మధుర శ్రీధర్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మిథున్ వరదరాజ కృష్ణన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో రితిక నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆనంద్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆయన నటిస్తున్న మదన్ క్యారెక్టర్ లుక్‌ను రిలీజ్ చేశారు. మనసంతా ప్రేయసిని నింపుకున్న ప్రేమికుడిగా ఆయన ఈ లుక్‌లో కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణలో ఉంది. ఓ డిఫరెంట్ ప్రేమ కథగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగించేలా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. రావు రమేష్ ముఖ్య పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ – అరుణ్ రాధాకృష్ణన్, ఎడిటింగ్ – జి.కె. ప్రసన్న, ప్రొడక్షన్ డిజైనర్ – ఉదయ్ కుమార్, సంగీతం – జి.వి. ప్రకాష్ కుమార్.

సరికొత్త కాన్సెప్ట్‌తో యమధీర



అశోక్‌కుమార్, వేదాల శ్రీనివాస్

కన్నడ హీరో కోమల్ కుమార్ హీరోగా, ఇండియన్ క్రికెటర్ శ్రీశాంత్ నెగిటివ్ రోల్‌లో నటించిన చిత్రం 'యమధీర'. శ్రీమందిరం ప్రొడక్షన్స్‌లో వేదాల శ్రీనివాస్ తొలి చిత్రంగా నిర్మించిన చిత్రమిది. ఈ సినిమాలో నాగబాబు, ఆలీ, సత్య ప్రకాష్, మధు సూధన్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను నటులు, ప్రొడ్యూసర్ అశోక్ కుమార్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత వేదాల శ్రీనివాస్ మాట్లాడుతూ, 'నిర్మాతగా ఇది నా మొదటి చిత్రం. సినిమాల మీద ప్యాషన్‌తో శ్రీమందిరం ప్రొడక్షన్స్ స్టార్ట్ చేశాను. ప్రేక్షకులు ఆదరిస్తారని కోరుకుంటున్నాను. త్వరలోనే ఈ సినిమా థియేటర్లో రిలీజ్ కానుంది' అని తెలిపారు.

'నా స్నేహితుడు వేదాల శ్రీనివాస్ కొత్తగా శ్రీమందిరం ప్రొడక్షన్స్ మొదలుపెట్టడం చాలా సంతోషకరంగా ఉంది. ఈ ప్రొడక్షన్స్‌లో తొలి చిత్రంగా వస్తున్న ఈ చిత్రం చాలా బాగా ఆడాలి. అలాగే మరెన్నో చిత్రాలు ఈ ప్రొడక్షన్స్‌లో రావాలని ఆశిస్తున్నాను. కన్నడలో 90కు పైగా సినిమాలలో నటించిన కోమల్ కుమార్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటించడం విశేషం అని అన్నారు. క్రికెటర్ శ్రీశాంత్ ఫాస్ట్ బౌలర్‌గా మైదానంలో చూపే దూకుడుని ప్రతినాయకుడిగా చూపించే అవకాశం ఉంది. ఆలాగే ఈ చిత్రం అజర్ బైజాన్, శ్రీలంక వంటి దేశాలతో పాటు మన దేశంలోని మైసూర్, చెన్నై, బెంగళూరు ఇతర ప్రాంతాలలో షూటింగ్ జరుపుకోవడం విశేషం' అని అశోక్ కుమార్ చెప్పారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886